06 సెప్టెంబరు 2026

# కథానిధి

# ఆదివారం కథలు

సమర్పణ:

కె.ఎ. మునిసురేష్ పిళ్లై, 99594 88088


## కథాక్రమం

మీకు నచ్చిన కథ ఉన్న వరుస మీద క్లిక్ చేయండి. నేరుగా ఆ కథ ఉన్న పేజీలోకి వెళ్లండి


| | | | |
|---|---|---|---|
| నమస్తే తెలంగాణ బతుకమ్మ | మాదాకవళం | ఎమ్వీ రామిరెడ్డి | 98667 77870 |
| ఈనాడు ఆదివారం | పులిని చూసి నక్క వాతలు పెట్టుకుంటే | దేవితనయ (మాధవి బైటారు) | +974 33952728 |
| | | | 8143602038 (వాట్సప్) |
| ఆదివారం ఆంధ్రజ్యోతి | ఒక విచిత్రమైన రాత్రి (సత్యజిత్ రే) | చింతపట్ల సుదర్శన్ (అను.) | 92998 09212 |
| ప్రజాశక్తి స్నేహ | అమ్మకానుక | యం.ఆర్.అరుణకుమారి | 81215 23835 |
| సాక్షి ఫన్‌డే | ఆత్మబలం | మంత్రిప్రగడ శ్రీనివాసరావు | 99486 96644 |
| తెలుగుప్రభ | జెర్రి- ఒక అవినీతికథ | కె.వి.నరేందర్ | 94404 02871 |
| ప్రజాశక్తి స్నేహ | తెంపుకోలేని బంధం | మోచర్ల అనంతపద్మనాభరావు | 98486 07127 |
| విశాలాంధ్ర | అనుబంధం | చింతపట్ల సుదర్శన్ | 92998 09212 |
| నవతెలంగాణ సోపతి | గెంటీలు? | రామ్ పెరుమాండ్ల | 95422 65831 |
| వార్త | పండిన పసిడికల | పాలగుమ్మి జ్యోతి | |
| సాక్షి ఫన్‌డే | తలుపు | మల్లాది వెంకటకృష్ణమూర్తి | |
| 30.8.26 కథానిధి సమీక్ష | సామాజిక సంక్షోభాలకు సజీవ దర్పణం | భూక్యా గోపినాయక్ | 99891 59196 |


మరికొన్ని బాలల కథలు

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



కథా ప్రియులకు నమస్తే..

ఈ ఆదివారం (6 సెప్టెంబరు 2026) కథల సంకలనం 43 పేజీల కథానిధి పీడీఎఫ్ లో మొత్తం 11 కథలు, అదనంగా మరికొన్ని పిల్లల కథలు ఉన్నాయి. సావకాశంగా చదవండి.. రచయితలకు మీ అభిప్రాయాలు తెలియజేయండి.

**కథానిధి పాఠకులకోసం ఒక కొత్త సదుపాయం అందిస్తున్నాను. మొదటి పేజీలో కథల వరుసక్రమం, రచయిత, ప్రచురణల వివరాలు ఉంటాయి. అందులో మీకు నచ్చిన కథ ఉండే వరుస మీద క్లిక్ చేస్తే.. పీడీఎఫ్ సంకలనంలో నేరుగా ఆ పేజీ కి వెళ్లిపోవచ్చు. ఈ సదుపాయాన్ని కథాప్రియులు వాడుకోగలరు**

కథానిధి పాఠకులకు గతవారం కథల సమీక్షను కూడా అందిస్తున్నాము.
'30 ఆగస్టు 2026 కథానిధి' కథలపై భూక్యా గోపి నాయక్ సమగ్ర సమీక్ష కోసం
ఈ కింది లింక్ లను క్లిక్ చేయండి

**adarsini.com వెబ్ సైట్లో చదవడం కోసం**

**యూట్యూబ్ లో వినడం కోసం**

**30 ఆగస్టు 2026 కథానిధి సంకలనం పీడీఎఫ్ కోసం**

కథానిధి వాట్సాప్ గ్రూపులో మీరు నేరుగా మీ మిత్రులను చేర్చవచ్చు. మీరు జాయినింగ్ లింక్ పంపితే వారు కూడా నేరుగా చేరవచ్చు.

మీ
కె.ఎ. మునిసురేష్ పిళ్లె
99594 88088

- కథలు చదవండి.
- చదివే ఆసక్తి ఉన్న మిత్రులకు ఈ పీడీఎఫ్ షేర్ చేయండి.
- కథలు నచ్చితే రచయితలకు మీ స్పందనలు తెలియ జేయండి. మెసేజీ అయినా పెట్టండి.
- కథలు చదివి వదిలేయకండి. మంచి కథల గురించి మీ మిత్రులతో కూడా ముచ్చటించండి. వారికి కూడా చదివే ఆసక్తి పుట్టవచ్చు.
- సాహిత్యప్రియులు ***https://kathavasudha.com*** లింక్ లోకి వెళ్లిగానీ, దిగువ పేజీలో ఇస్తున్న *QR code* ను స్కాన్ చేయడం ద్వారా గానీ కథావసుధ వెబ్ మేగజైన్ లోని అనువాద కథలు, అనువాద కవితలు, సాహిత్యవ్యాసాలను చదవండి.
- ఆయా దినపత్రికల సౌజన్యంతో

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

ఎమ్వీ రామిరెడ్డి

# మాదా కమలం



ఎం.వి. రామిరెడ్డి
98667 77870

ముల్కనూరు సాహితీపీఠం కథలపోటీ-2026లో రూ.10వేల బహుమతి కథ






నమస్తే తెలంగాణ ఆదివారం
బతుకమ్మ
NAMASTE TELANGANA SUNDAY SUPPLEMENT
6 సెప్టెంబర్ 2026 : : 6 SEPTEMBER 2026
కథ

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# కథ



రాబందు ఒకటి రాక్షసంగా అరుస్తూ ఆ మైదానం మీదుగా ఆకాశంలోకి ఎగిరిపోయింది.

సుమారు పదెకరాల విస్తీర్ణంలో దీర్ఘ చతురస్రాకారంలో ఉన్న ఆ స్థలం చుట్టూ ఏడడుగుల ఎత్తయిన కాంపౌండ్ వాల్ ఉంది. ఉత్తరం వైపున్న ప్రధాన ద్వారం నుంచి మాత్రమే ప్రవేశానికి అనుమతి. దక్షిణం వైపున్న గోడలో కొంతభాగం కూల్చి.. 'హ్యూమానిటేరియన్ ఫౌండేషన్' నిర్వాహకులు పెద్ద ఎత్తున ఆహారపంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వరుసగా పేర్చిన బల్లలపై ఖాళీ డేగిశాలు, దబరాలు, పెద్ద పళ్లేలు పెట్టి ఉన్నాయి.

ఆ ఉదయం ప్రసార మాధ్యమాల్లో వెలువడిన ఓ వార్త.. శరణార్థి శిబిరాల్లో ఆశ్రయం పొందుతున్న నిర్భాగ్యుల నోళ్లలోనూ, మురికివాడల్లో బతుకులీడుస్తున్న నిరుపేదల పేగుల్లోనూ లాలాజలం తోడిపోసింది. నగరంలో ధనవంతులు నివసించే కాలనీల్లో సైతం ఆ కబురు కరకరలాడుతూ ఆకలి కడుపుల్లోకి వ్యాపించింది. చాలాకాలంగా వాళ్లందరి పేగుల నడుమ ముడుచుకు పడుకున్న 'ఆకలి పులి'ని నిద్ర లేపింది.

ఉదయం తొమ్మిది కాకముందే జనం తండోపతండాలుగా ఆ మైదానానికి చేరుకున్నారు.

పదకొండు కావస్తున్నా ఆహార పదార్థాలు మోసుకొచ్చే ట్రక్కుల జాడ లేదు. వేలాది మంది పళ్లేలు, గ్లాసులు పట్టుకొని నాలుగు వరసల్లో నిలబడి ఉన్నారు. క్యూ లైన్లలో ఎక్కడివారక్కడ భూమిలోకి మేకుల్లా దిగబడి ఉన్నారు. వాళ్ల కడుపుల్లోనే కాదు; కళ్లల్లోనూ ఆకలి... కారాలు నూరుతోంది. ఆ ధాటినీ ఘాటునూ భరించలేని బలహీనులు నీరసంగా నేలపై కూలబడ్డారు.

ఆ అన్నార్తుల క్షోభతో పట్టింపులేని దేశాలు యుద్ధక్షేత్రాల్లో ఆకలి తీర్చుకునే పనిలో నిమగ్నమై ఉన్నాయి. రాడార్ల వ్యవస్థ లేకపోవటంతో ఓ దేశం తమ ఫైటర్ జెట్లను సరిహద్దుకు అవతలి దాకా పంపి, భీకరస్థాయిలో జనావాసాలపై బాంబులు జారవిడుస్తోంది. ప్రత్యర్థి దేశం తన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలతో ప్రతిదాడులు చేస్తోంది. ఆయిల్ నిల్వలతో విర్రవీగుతున్న దేశం సహజవనరులతో తులతూగుతన్న దేశంపైకి బాలిస్టిక్ క్షిపణుల్ని ప్రయోగిస్తోంది. అవతలి రాజ్యం తన దగ్గరున్న 'ఐరన్ డోమ్ క్షిపణి విధ్వంసక వ్యవస్థ'తో ఎదురుదాడులకు దిగుతోంది.

భూమిపై లక్షల యోజనాల మేర యురేనియం శుద్ధి చేస్తున్న ఘాటైన వాసన! నేల మాళిగల్లోని రహస్య స్థావరాల్లో అణుబాంబులు తయారవుతున్న నిరంకుశ పాలన! ఆకాశం నిండా నెలల తరబడి, సంవత్సరాల తరబడి భారీ విస్ఫోటనాల పాతర!

సమయం పన్నెండు దాటింది. ఎర్రటి ఎండను కురిపిస్తున్న సూర్యుడికన్నా, కడుపులో మంటలు రేపుతున్న ఆకలితోనే జనం అల్లాడిపోతూ కౌంటర్లవంక ఆశగా చూస్తున్నారు.

అక్కడికి ఏడు మైళ్ల దూరంలోని ఓ స్కూల్లో శరణార్థి శిబిరంలో తల దాచుకుంటున్న ముప్పై రెండేళ్ల కెఫాయా, కాళ్లు పీకుతుండటంతో దుమ్ములోనే చతికిలపడింది. అదే క్యూలో తన ముందు నిలబడి ఉన్న పాప వీపుమీద తట్టింది. పన్నెండేళ్ల హనా తల వెనక్కి తిప్పి చూసింది. కూచోమన్నట్లు సైగ చేసింది కెఫాయా. ఆమెకు సమాంతరంగా ఉన్న క్యూలో పక్కనే ఉన్న పాతికేళ్ల జావెద్ కూడా కింద కూచుంటూ తనకెదురుగా ఒంగిపోయి నిలబడి ఉన్న పెద్దాయన్నీ ప్రోత్సహించాడు. డెబ్బై ఏళ్ల డేనియల్ వెనుదిరిగి చూసి, జావెద్ సైగను స్వీకరించి, ఇబ్బందిగా కాళ్లు వంచి కింద కూచున్నాడు.


క్షుద్బాధ భరించలేని సూర్యుడు నిప్పులు కక్కుతున్నాడు. రెండు నిమిషాలకే హనా వెనక్కి తిరిగి, కెఫాయాతో కబుర్లలో పడింది. డేనియల్ కూడా ఇటువైపు తిరిగి, జావెద్‌తో ముచ్చట్లు పెట్టాడు. పది నిమిషాల్లోనే నలుగురూ మాటల మూటలు విప్పి పంచుకోసాగారు.

ముందుగా, డేనియల్ పరిమితులకు అతీతమైన భాషలో తన జీవనగాథను వివరించటం మొదలు పెట్టాడు...

**కదన రంగం 1:**

డేనియల్ ఓ గుర్రపుశాలలో పని చేసేవాడు. తనూ ఓ గుర్రంలాగే కష్టపడేవాడు. భార్య దినసరి కూలీ. కొడుకు డేవిడ్‌ను మంచి స్కూల్లో చేర్పించారు. డేవిడ్ చురుకైన కుర్రాడు. అటు చదువుకుంటూనే ఏదో ఒక పనిలో నిమగ్నమయ్యేవాడు. స్కూలింగ్ అయిపోయాక సెలవుల్లో, ఖర్జూరాల షాపులో పార్ట్‌టైమ్ పనికి కుదిరాడు. నెల రోజులపాటు సంపాదించిన మొత్తాన్ని తెచ్చి, తల్లిదండ్రుల చేతుల్లో పెట్టినప్పుడు వాళ్ల సంతోషం సాగరమై ఉప్పొంగింది.

వారం తిరక్కుండానే తల్లి హఠాన్మరణం తండ్రీకొడుకుల జీవితాల్ని కుదిపేసింది. దుఃఖంలో చిక్కుబడిపోయి, దిక్కు తెలియని పక్షుల్లా అలమటించారు. ముందుగా డేవిడ్ కోలుకున్నాడు. మానసికంగా కుంగిపోయిన తండ్రిని



'నమస్తే తెలంగాణ-ముల్కనూరు సాహితీపీఠం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2026'లో తృతీయ బహుమతి రూ.10 వేలు పొందిన కథ.

ఎం.వి. రామిరెడ్డి

# ఖుదా కవళం

ఇక అట్టే కష్టపెట్టకూడదని ఒట్టు పెట్టుకొని, చదువు చాలించి, షాపులో పూర్తి కాలపు ఉద్యోగిగా మారిపోయాడు.

అయిదేళ్లు తిరిగేలోగా వ్యాపారంలో మెలకువలు పసిగట్టాడు. దాచుకున్న డబ్బుతో ఒక ఏజెన్సీ ప్రారంభించి, ఖర్జూరాలు ఎగుమతి చేసే దిశగా అడుగులు కదిపాడు. రెండేళ్లు తిరక్కుండానే అతనికి పట్టు దొరికింది. తనకింద పది మంది ఉద్యోగుల్ని నియమించుకున్నాడు. హోల్‌సేల్ షాపులు మొదలు విదేశాల్లో ఉన్న వ్యాపార సంస్థలకు సైతం నాణ్యమైన పండును సరఫరా చేయటం ప్రారంభించాడు. కోవిడ్ సమయంలో సైతం అతని లావాదేవీలు వెనుకంజ వేయకపోవటంపై సాటి వర్తకులు ఆశ్చర్యం వ్యక్తం చేసేవారు. పదేళ్లలోనే ఆ వ్యాపారంలో పాతుకుపోయాడు.

ఓరోజు డేనియల్..

''మన కడుపు నిండింది కదా. ఆకలి బాధతో ఉన్నవాళ్లకు ఏదైనా చేస్తే బాగుంటుంది బిడ్డా'' అన్నాడు.

డేవిడ్ మొహం విప్పారింది.

నెల తిరక్కుండా నే ఓ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభించాడు. వంట మనుషుల్ని నియమించాడు. సరుకులన్నీ సమకూర్చాడు. ప్రత్యేకంగా సూపర్‌వైజర్‌ని నియమించాడు. ఓ ట్రక్కును సిద్ధం చేశాడు. ఆహార పదార్థాలు నింపుకొన్న ఆ ట్రక్కు రోజుకొక దిక్కుకు వెళ్తుంది. పేవ్‌మెంట్లు, మురికివాడలు, భవననిర్మాణ ప్రదేశాల్లో ఆకలితో అలమటిస్తున్న వారి చెంతకు చేరి, కడుపు నింపుతుంది. అనతి కాలంలోనే ఆ సేవాకార్యక్రమానికి మంచి గుర్తింపు వచ్చింది. తమ ట్రక్కు పుణ్యమాని కడుపు నింపుకొన్న అనేకమంది ఫోన్ల ద్వారా, మెసేజీల ద్వారా డేవిడ్‌ను ఆకాశానికెత్తేశారు.

తమ ప్రాంతాలకూ ఆ సేవను విస్తరించాలని వినతులు వెల్లువెత్తాయి. ట్రక్కుల సంఖ్య పదికి చేరింది. ఆ సేవల బాధ్యతను పూర్తిగా తండ్రికి అప్పగించాడు డేవిడ్.

సరిహద్దుల్లో మొదలైన యుద్ధం.. నగరాల్లోకీ, పట్టణాల్లోకీ పాకింది. తాజాగా జరిగిన దాడిలో రాజధాని శివారులోని మురికివాడ అతలాకుతలమైంది. అక్కడి ప్రజలు ఆకలితో అలమటించి పోతున్నారన్న విషయం తెలుసుకున్న డేవిడ్.. ఓ రోజు ట్రక్కుతోపాటు తనూ స్వయంగా వెళ్లాడు. ట్రక్కును చూడగానే ఆ వాడలోని వెయ్యిమంది కళ్లల్లో పునఃప్రాణప్రతిష్ఠ జరిగింది. చాలా రోజుల తర్వాత కడుపారా భోంచేసి, డేవిడ్‌ను మనసారా దీవించారు.


''ఆ సంతోషం తోడుగా వాడు ఖాళీ ట్రక్కుతో తిరుగు ప్రయాణమయ్యాడు. రెండు మైళ్లన్నా వచ్చాడో లేదో, ఏ మూలనుంచో దూసుకొచ్చిన రాకెట్ ఆ ట్రక్కును తునాతునకలు చేసింది. నా కొడుకుతోపాటు సిబ్బంది మొత్తం ప్రాణాలు కోల్పోయారు. నా జీవితంలో శూన్యం ఆవరించింది. మతి భ్రమించింది. మా ఇల్లు ఏమైందో తెలియదు. వ్యాపారం ఏమైందో తెలియదు. నాకు మళ్లీ మైండు పని చెయ్యటం మొదలు పెట్టేపాటికి, ఇదిగో ఈ ఊళ్లోని మా బంధువుల ఇంట్లో ఉన్నాను. వాళ్లకే పూట గడవదు; నేనో గుదిబండనయ్యాను. ఈ ఒక్క పూటయినా కడుపు నిండా తిందామని ఇక్కడికొచ్చాను''.. అంటూ డేనియల్ శూన్యంలోకి చూస్తూండిపోయాడు.

**కదనరంగం 2:**

ఆకాశం ముదురు కెంజాయరంగులో అసహజంగా మెరిసిపోతోంది. సాయంత్రం అయిదు కాకముందే నాలుగు వేలమందికి పైగా జనం ఆ స్టేడియానికి చేరుకున్నారు.

ఏటా జరుపుకొనే సాంప్రదాయిక సంగీత మహోత్సవం ఈ సంవత్సరం జరుగుతుందో లేదోనన్న భయం... తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందంతో తేలిపోయింది. ఆ సంతోషం ప్రతిధ్వనిస్తున్నట్లుగా కళాకారులు గొంతు విప్పారు. పాటలు మైకుల్ని హోరెత్తిస్తున్నాయి. పెద్దా చిన్నా తేడా లేకుండా సంగీతం మత్తులో తడిసిపోతూ,

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



కాళ్లు కదుపుతున్నారు.

ప్రధాన వేదికకు వంద మీటర్ల దూరంలో, తల్లిదండ్రులకు కాస్త దూరంలో పిల్లలతో కలిసి నృత్యం చేస్తోంది హనా. తన చిన్నారి చెల్లి కూడా బుడిబుడి అడుగులతో లయబద్ధంగా కదులుతోంది.

సంగీత పరికరాల హోరు అంతకంతకూ పెరిగిపోతోంది. జనమంతా వివిధ భంగిమల్లో మునకలేస్తున్నారు. గంటన్నర గడిచింది.

ఎక్కడో ఏదో భీకర అపశ్రుతి. రాగాలహోరును భగ్నం చేస్తూ భయంకర శబ్దం. వెనకే కొందరి పెనుకేకలు. చెవులు బద్దలయ్యేలా మళ్లీ ప్రళయభీకర ధ్వనులు. అవి... సీమాంతర ఉగ్రవాదులు పారాగ్లయిడర్లలో పైనుంచి కిందికి దిగుతూ నిర్దాక్షిణ్యంగా జరిపిన కాల్పుల శబ్దాలన్న విషయం అక్కడ చేరిన జనంలో ఎవ్వరికీ తెలిసే అవకాశం లేదు. పదిమందికి పైగా ఆగంతకులు స్టేడియంలో యథేచ్ఛగా పరుగులు తీస్తూ మర తుపాకులతో నిప్పులు కురిపిస్తున్నారు.

తూటాలు దూసుకుపోయిన శరీరాల నుంచి నెత్తుటి ఫౌంటెన్లు పుట్టుకొస్తున్నాయి. ఛిద్రమైన అవయవాలు నలుదిక్కులూ ఎగిరి పడుతున్నాయి. దేహాలకు దేహాలు కూలిన వృక్షాల్లా నేలకొరుగుతున్నాయి. ఆశచావని శరీరాలు కొన్ని దేకుతూ ముందుకు కదులుతున్నాయి. గమ్యం చేరకముందే కదలికలు ఆగిపోతున్నాయి.

హనా తన తల్లిదండ్రుల వైపు వెళ్లబోయింది. అక్కడున్న గుంపు మీదికి గుళ్ల వర్షం మొదలవటంతో భయంతో వెనక్కి పరుగులు తీసింది. స్టేజీకి కాస్త దూరంలో ఉన్న పెద్ద బండరాయి వెనక్కి వెళ్లి దాక్కుంది. అప్పటికే అక్కడ అయిదారుగురు ఉన్నారు, భయంతో వణికిపోతూ. ఉండుండీ కాల్పులమోత వినిపిస్తూనే ఉంది. రెండు నిమిషాల తర్వాత రాయి పక్కనుంచి తల బయటికి పెట్టి చూసింది. అల్లంత దూరంలో చెల్లి, గుక్క పట్టి ఏడుస్తూ కనిపించింది.

చెల్లికోసం లేవబోతున్న హనాని పక్కనున్న పెద్దాయన పొదివి పుచ్చుకొని, వద్దని వారించాడు. ఆ పాప వినలేదు. చెయ్యి విదిలించుకొని బండ మాటునుంచి బయటికొచ్చి, ముందుకు దూసుకుపోయి, చెల్లిని అమాంతం భుజాల మీదికి ఎత్తుకుంది. అదే వేగంతో మళ్లీ బండ చాటుకు చేరుకుంది. హనా భయాన్ని జయించి, అప్పటికి చాలాసేపయింది. గొంతు పగిలేలా ఏడుస్తున్న చెల్లిని గుండెకు హత్తుకొని ఓదారుస్తోంది.

"ఏడ్చీ ఏడ్చీ చెల్లిని తీసుకొని రోడ్డు మీదికొచ్చాను. ఓ పోలీస్ సాయంతో ఇంటికి చేరుకున్నాను. ఎట్లా బతకాలో తెలియలేదు. ఇంట్లో ఉన్న బన్నులు తిని, పాలు తాగి గడిపాం. రెండురోజుల తర్వాత ఊరంతా ఖాళీ అయిపోయింది. ఎవరో వచ్చి మమ్మలి ఓ ట్రక్కులో ఎక్కించుకొని, ఈ ఊళ్లో ఉన్న శరణార్థి శిబిరానికి చేర్చారు. ఇక్కడ సరిగా తిండి పెట్టరు. చెల్లిని శిబిరంలోనే ఉంచి, ఇదిగో ఇక్కణ్నించి జావన్నా తీసుకెళ్దామని వచ్చా"

ఇరవై నిమిషాల తర్వాత కాల్పులశబ్దం ఆగిపోయింది. చెల్లిని అట్లాగే చంకనెత్తుకొని, స్టేడియం అంతా తిరిగింది. నిర్జీవంగా పడిపోయి ఉన్న వందలాది మొహాల్ని వెతికీ వెతికీ చివరికి, తల్లిదండ్రుల శవాల్ని గుర్తించింది.

"ఏడ్చీ ఏడ్చీ చెల్లిని తీసుకొని రోడ్డు మీదికొచ్చాను. ఓ పోలీస్ సాయంతో ఇంటికి చేరుకున్నాను. ఎట్లా బతకాలో తెలియలేదు. ఇంట్లో ఉన్న బన్నులు తిని, పాలు తాగి గడిపాం. రెండు రోజుల తర్వాత ఊరంతా ఖాళీ అయిపోయింది. ఎవరో వచ్చి మమ్మలి ఓ ట్రక్కులో ఎక్కించుకొని, ఈ ఊళ్లో ఉన్న శరణార్థి శిబిరానికి చేర్చారు. ఇక్కడ సరిగా తిండి పెట్టరు. చెల్లిని శిబిరంలోనే ఉంచి, ఇదిగో ఇక్కణ్నించి జావన్నా తీసుకెళ్దామని వచ్చా" అంటూ హనా వివరించింది.

పన్నెండేళ్ల ఆ పాప యాభై ఏళ్ల జీవితం అనుభవించిన శాపగ్రస్థురాలిలా కనిపించింది మిగతా ముగ్గురికీ.

**కదనరంగం 3:**

జావెద్ వాళ్ల తాత కరీంనగర్ ప్రాంతం నుంచి అరబ్బు దేశానికి వలస వెళ్లాడు. రకరకాల పనులు చేసి, జీవితంలో స్థిరపడ్డాడు. కొడుకును బాగా చదివించాడు. అతని విశేష ప్రతిభకు గుర్తింపుగా అక్కడి ప్రభుత్వం చేపట్టిన బాలిస్టిక్ మిస్సైల్ ప్రోగ్రామ్‌లో ఉద్యోగం దక్కింది. మిస్సైల్ తయారీలో కీలక బాధ్యతల్లో నిమగ్నమైన మహమూద్‌ను ఓ ఉగ్రవాద సంస్థ కిడ్నాప్ చేసింది. పోలీసులు అతనికోసం అన్వేషించినా ఫలితం లేదు. ఆర్నెల్లు గడిచినా జాడ లేదు. అతని భార్య గుండె దిటవు చేసుకొని, ఒక్కగానొక్క కొడుకును కంటికి రెప్పలా కాపాడుకోసాగింది.

సంవత్సరం తర్వాత ఓరోజు ఉగ్రవాదమూక అత్యాధునిక ఆయుధాలతో ఓ పార్కు దగ్గర పర్యాటకులపై విరుచుకుపడింది. ఇరవై మందికి పైగా విదేశీయులు మరణించటం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆ ఆయుధాల తయారీకి వాళ్లు అపహరించిన తమ సైంటిస్టే కారణమని ఓ పరిశోధనాత్మక కథనం వెలువడటంతో, ఆ దేశ ప్రభుత్వం అతని కుటుంబంపై నిఘా పెట్టింది. అతని భార్యాపుత్రులపై ఆంక్షలు విధించింది. ఇరుగుపొరుగు ఆ కుటుంబాన్ని వెలి వేశారు.

ఆ అవమానం భరించలేక, ఓ రాత్రిపూట కొడుకుతోసహా దేశం నుంచి పారిపోవటానికి ప్రయత్నించి, పోలీసులకు చిక్కింది సైంటిస్టు భార్య. ఉగ్రవాద సంస్థతో ఆమెకు సంబంధాలు ఉన్నాయనీ, భర్త ఎక్కడ ఉన్నాడో ఆమెకు తెలుసనీ, ఇప్పటికీ రహస్యంగా కలుస్తోందనీ... ఊహాగానాలు చెలరేగటంతో ఆమెపై నిర్బంధం తారాస్థాయికి చేరింది. ఆమెను జైలుకే పరిమితం చేసి, కొడుకు జావెద్‌ను ప్రభుత్వ సంక్షేమ వసతిగృహంలో చేర్చారు.

"అదో నరకం. చెత్తపనులన్నీ చేయించేవారు. క్రమశిక్షణ పేరుతో చిత్రహింసలు పెట్టేవారు. చదువుల ఊసే ఉండదు. అమ్మ ఎక్కడుందో తెలియదు. నాన్న ఏమైపోయాడో అర్థం కాదు. సానుభూతితో కుశలమడిగే నాథుడు కనిపించడు. ఓపిగ్గా అన్నీ భరించాను. నాలుగేళ్లు గడిచాయి. నా సత్ప్రవర్తన అక్కడి అధికారుల్ని ఆకట్టుకుంది. వదిలేస్తే ఏదైనా పని చేసుకొని బతుకుతానని చెప్పాను. నన్ను నమ్మి, నాకు అనుమతినిచ్చారు. ఇదిగో ఈ నగరానికొచ్చాను. పని దొరికినరోజు కడుపు నిండుతుంది; లేనిరోజు పస్తులే. ప్రతినెలా సగం రోజులు నాకు రంజాన్ దినాలే..." అంతటి విషాద గతాన్నీ నవ్వుతూ పంచుకున్నాడు జావెద్.

"అమ్మ గురించి ఆరా తీయలేదా?" ఆసక్తిగా అడిగింది కెఫాయా.

"చెయ్యని ప్రయత్నమంటూ లేదు. అంతా నిరంకుశత్వం. పాలకుల ఇష్టారాజ్యం. ఎంత తిరిగినా ఆమె ఆచూకీ కనిపెట్టలేకపోయాను. ప్చ్... అసలామె బతికుందో లేదో! ఇక, నాన్న సంగతి సరేసరి!" నిట్టూర్చాడు జావెద్.

**కదనరంగం 4:**

రెండురోజుల వ్యవధిలో ఆ నగరం పాతికసార్లు బాంబుల మోతలతో మరుభూమిలా మారింది. వీధులనిండా శవాలు. ఇళ్లల్లో ప్రాణాలతో మిగిలున్న మనుషులు మాత్రం తలుపులు బిగించుకొని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఎప్పుడైనా ఏదైనా పనిమీద వీధిలోకి వస్తే, భరించలేని దుర్వాసన.

అయిదారు రోజుల నరకయాతన తర్వాత మళ్లీ జనజీవనం ప్రారంభమైంది. అయితే, ప్రధాన వీధుల్లో పొంచి ఉన్న సైనికులు విధించిన కఠిన ఆంక్షల కారణంగా ఏ ఒక్కరూ స్వేచ్ఛగా తిరగటానికి వీల్లేకుండా పోయింది.

మంచినీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న ఓ ఇంజినీరు విధులు ముగించుకొని, లెనిన్ సెంటర్ మీదుగా ఇంటికి వెళ్తున్నాడు. ఆ విగ్రహం వెనక నుంచి ఓ యువతి కేకలు వినిపించటంతో అటుగా పరుగు తీశాడు. ఇరవయ్యేళ్ల అమ్మాయిని ఓ సైనికుడు లైంగికంగా వేధిస్తున్నాడు. అతను కోపంతో ఊగిపోతూ, దగ్గరగా వెళ్లి ఆ అమ్మాయికి అడ్డుగా నిలబడ్డాడు.

"ఎవడ్రా నువ్వు?" అంటూ ఆ జవాను తన తుపాకీ మడమతో అతని తలపై బలంగా బాదాడు.

తూలిపడబోయి, తమాయించుకున్న అతను ఆ అమ్మాయి వైపు తిరిగి.. 'నువ్వెళ్లి పో' అన్న భరోసా ఇచ్చాడు. ఆమె పరుగులాంటి నడకతో వెళ్లిపోయింది. సైనికుడు ఆవేశంగా ముందుకురికి, అతని గొంతు చుట్టూ చేతులు బిగించాడు.

అతను తొట్రుపడలేదు. దేనికైనా సిద్ధం అన్నట్లు ధీమాగా నిలబడ్డాడు. సైనికుడి అహం దెబ్బ తింది. ఇంకేదో చేయబోయి, అంతలోనే తన ప్రయత్నం విరమించుకుని, వెనక్కి వెళ్లిపోయాడు. అతను ఇంటికి చేరుకున్నాడు.

రాత్రి తొమ్మిది దాటుతుండగా, తలుపులపై పెద్ద చప్పుడు. అతను గడియ తీశాడు.

లెనిన్ సెంటర్ సైనికుడు మరో ఇద్దరు జవాన్లతో కలిసి, బిలబిలమంటూ లోపలికి వచ్చాడు.

అలజడి విని, గదిలోంచి హాల్‌లోకి వచ్చింది అతని భార్య.

ఆ సైనికుడు అతన్ని బలంగా తోసేసి, దౌర్జన్యంగా ముందుకెళ్లి, ఆమెను ఆక్రమించుకోబోయాడు. అతను ఆగ్రహంతో ముందుకురికి, సైనికుడి జుట్టు పట్టుకొని చేతిబలం కొద్దీ గుంజి, కింద పడేశాడు. అప్పటిదాకా కాస్త దూరంగా నిలబడిన జవాన్లు జరజరా వచ్చి, అతనిపై దాడి చేశారు. ఈ వెసులుబాటుతో సదరు సైనికుడు రెట్టించిన కోపంతో ఆమె జడ పట్టుకొని, బరబరా లోపలి గదిలోకి ఈడ్చుకెళ్లాడు.

"మృగంలా మీదపడ్డాడు. ఒళ్లు హూనం చేశాడు. ప్రతిఘటించబోతే హింసించాడు. నా శరీరాన్ని రక్తసిక్తం చేశాడు. తాళ్లతో బంధించి, రెండురోజులపాటు అమానుషంగా అఘాయిత్యం చేశాడు. ఆ జవాన్లు నా భర్తను ఎటు తీసుకెళ్లారో తెలియదు. తనెక్కడున్నాడో తెలియదు. అసలు బతికే ఉన్నాడో లేదో తెలియదు..." కన్నీరు తుడుచుకుంటూ చెప్పింది కెఫాయా.

"నాకు స్పృహ వచ్చేసరికి ఆస్పత్రిలో బెడ్‌మీద ఉన్నాను. నర్సు ఫోన్ నుంచి నా భర్తకు కాల్ చేశాను. స్పందన లేదు. ఓ స్వచ్ఛందసంస్థ సాయంతో ఇక్కడికి నాలుగు మైళ్ల దూరంలో బేస్ క్యాంపు దగ్గరున్న శిబిరానికి చేరుకున్నాను. పేరుకే అది సహాయకేంద్రం. గదులు ఘోరం. భోజనం దారుణం. మరుగుదొడ్లు అధ్వానం. ఇక్కడ ఈరోజు ఆహారకేంద్రం పెడుతున్నారని తెలుసుకొని వచ్చాను..."

* * *

ఒంటిగంట దాటుతుండగా ఆహారం మోసుకొచ్చిన ట్రక్కుల శబ్దం విని, క్యూ లైన్లలోని వారంతా అప్రమత్తమయ్యారు. పది నిమిషాల్లోనే పంపిణీ మొదలైంది. జనం ఎగబడి చాస్తున్న పళ్లేల్లో వలంటీర్లు ఆహారపదార్థాలు వడ్డిస్తున్నారు. లైను మెల్లగా కదులుతోంది.

తనవంతు రాగానే హనా పళ్లేన్ని ముందుకు చాపింది. అందులో మూడు రొట్టెముక్కలు పడ్డాయి. గిన్నెలో రెండు గరిటెల జావ దక్కింది.

సరిగ్గా అదే సమయంలో... ఎటునుంచి వచ్చారోగానీ, సైనిక దుస్తుల్లో వచ్చిన ఆరుగురు వ్యక్తులు ఫుడ్ కౌంటర్ పక్కనే నిలబడి, జనం వంక కర్కశంగా చూశారు. అరక్షణం చూపులు మార్చుకున్నారు. సైగలతో సంభాషించుకున్నారు. చేతివేళ్లు తుపాకులపై బిగించారు. పొజిషన్ తీసుకున్నారు. ఆహారం తీసుకొని వెనక్కి వెళ్తున్న వారిపైన, క్యూలల్లో ముందుకు వస్తున్న వారిపైన వాళ్ల చేతుల్లోని మారణాయుధాలు భీకరంగా గర్జించాయి. భీతావహమైన ఆక్రందనలతో ఆ మైదానం ప్రతిధ్వనించింది.

చేతుల్లోని పళ్లేలు, గిన్నెలు, గ్లాసులు నేలంతా పరుచుకున్నాయి. తెగిన చేతులు, విరిగిన కాళ్లు, తూట్లు పడిన గుండెలు... నలుదిక్కులా దిక్కు లేకుండా పడిపోయాయి.

అంతటి భయానక సమయంలోనూ హనా తన చేతుల్లోని ఆహారాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటూ కింద కూచుండిపోయింది. కాల్పులు కొనసాగుతూనే ఉన్నాయి. ఆక్రందనలు ఆకాశంలో ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. పావుగంట అనంతరం... ఆ దుర్భర శబ్దాలు శాంతించాయి.

హనా పైకి లేచింది. ఆ ప్రాంతం నుంచి ఎంత దూరంగా వెళ్తే అంత మంచిదని గ్రహించి, ఉత్తరం వైపు నడిచింది. అడుగు తీసి అడుగేస్తే శవాలగుట్టలు. కొనప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న అభాగ్యులు. నిలువెల్లా గాయాలతో రక్తసిక్తమై, సాయం కోసం పెనుకేకలు పెడుతున్న నిస్సహాయులు.

కాల్పులకు నేలకొరుగుతూ చేతుల్లోని పళ్లేలు జారవిడవటంతో, మట్టితో కలిసిన జావ- కాళ్ల కింద కలిగిస్తున్న కంపరం. నెత్తురు అంటిన రొట్టెముక్కల వికృతరూపాల వికారం.

అవేవీ ఆ పాపను భయపెట్టడం లేదు. కడుపులో ఆకలి మాత్రమే పరుగులు తీయిస్తోంది.

సగం దూరం పరిగెత్తిందో లేదో.. డేనియల్ ఎదురొచ్చాడు. ఆ పాప సరికొత్త ధైర్యంతో ఏదో అనబోతుండగా, ఆ పెద్దాయన నిర్దాక్షిణ్యంగా హనా చేతుల్లోంచి జావ, రొట్టెలు లాగేసుకున్నాడు. ఒకప్పుడు ట్రక్కుల కొద్దీ ఆహారాన్ని పంచిపెట్టిన డేనియల్.. ఇప్పుడు ప్రతిఘటించబోయిన ఓ చిన్నారిని విసిరికొట్టాడు. బండరాతికి తగిలి, తల పగిలి, చనిపోయిన పాప వంక కన్నెత్తి అయినా చూడకుండా.. ఆబగా జావ తాగటం మొదలు పెట్టాడు.

ఉత్తర ద్వారానికి నాలుగడుగుల దూరంలో... జావెద్ చేతిలోని ఆహారాన్ని కూడా అంతే నిర్దయగా లాక్కుంది కెఫాయా. జావెద్ ఊరుకోలేదు. కిందపడి ఉన్న సత్తు పళ్లేన్ని చేతిలోకి తీసుకొని, కెఫాయాపై దాడి చేశాడు. ఆమె నిశ్చేష్ట కాలేదు. తన చేతిలో ఉన్న గిన్నెలోని జావను గటగటా తాగి, అదే గిన్నెతో జావెద్ మొహాన్ని పచ్చడికింద కొట్టింది. జావెద్ ఎదురుదాడి చేస్తున్నాడు. ఆమె సివంగిలా తిరగబడుతోంది...

ఆ మైదానం వ్యాప్తంగా అక్కడక్కడా అలాంటివే వందలాది యుద్ధాలు బాహాబాహీ నడుస్తూనే ఉన్నాయి...

ఇంతకీ, ఆ మైదానం ఎక్కడుందో గుర్తు పట్టారా?

టెహ్రాన్‌లోది కదూ!

కాదు కాదు... టెల్ అవీవ్ కావొచ్చు!

గాజా నగరం నడిబొడ్డులా కనిపిస్తోందే!

లేదు లేదు... కచ్చితంగా కార్కివ్ అయి ఉండొచ్చు!

పాక్ ఆక్రమిత భూభాగంలోని కుగ్రామం కూడా కావొచ్చు!

ఆ మైదానపు దుర్భర ఉనికిని 'సొంతం' చేసుకునేందుకు కంబోడియా, లెబనాన్, బాల్కన్స్, రువాండా, చెచెన్యా, సూడాన్... ఇంకా చాలా భూభాగాలు 'సర్వ సన్నద్ధం'గా ముందుకు రావొచ్చు!! ■



ఎం.వి. రామిరెడ్డి
98667 77870

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# పులిని చూసి నక్క వాతలు పెట్టుకుంటే...

**మాధవి బైటారు, Qatar (దేవి తనయ)**

+974 33952728, +91 8143602038 (వాట్సప్)

**ఆ అర్ధరాత్రి,** భర్త భూషణ్ కాళ్ళు పట్టుకుని రోదిస్తుంది మేఘమాల.

పక్కనున్న పిల్లలు కూడా వెక్కివెక్కి ఏడుస్తున్నారు...

ఫ్యాన్ కి వేలాడుతున్న చీర. దానికి సరిగ్గా కిందన ఉన్న బెంచీపై కూర్చుని నిస్సహాయంగా తలదించుకున్నాడు భూషణ్.

అతనిని కఠిన నిర్ణయంవైపు నెట్టిన కారణం... అప్పులా, బెట్టింగా, అనారోగ్యమా... లేదంటే సమాజంలో ఏర్పడిన పోలిక, పోటీల వలన చేసే ఆర్భాటాల ఫలితమా లేక మరేదైనా...?

గుండెల్లో వేవేల అగ్ని పర్వతాల విస్ఫోటనం మధ్య జరిగే రాపిడిలో పారిపోయే ప్రయత్నం చేసాడు.

కారుతున్న కన్నీళ్ళ మధ్య సంవత్సరం కిందట జరిగిన విషయాలు గుర్తుకురా సాగాయి సేల్స్ మేన్ భూషణ్ కి.



ఓరోజు రాత్రి తొమ్మిదవుతుండగా, తాను పని చేస్తున్న చీరల షాప్ నుండి ఇంటికి వస్తున్నాడు.

తమ వీధిలోకి అడుగుపెట్టగానే రోడ్డు పక్కన ఒక పెద్ద ఫ్లెక్సీ కనిపించింది.

అందులో ఒక అందమైన అమ్మాయి పట్టు లంగావోణి వేసుకుని, బోలెడన్ని నగలు, మేకప్ తో కూర్చున్న ఫోటో ఉంది.

అమ్మాయి పేరుతో సహా 'ఫలానావారి రజస్వలా ఆహ్వానం' అంటూ కిందన రాసి ఉంది.

ప్రతీది వీధిలో పెట్టుకోవడం ఇప్పుడు ఫ్యాషన్. పెట్టకపోతే అనాగరికులు, ట్రెండ్ కి తగ్గట్టుగా నడవలేనివాళ్ళు... అనే ముద్ర.

ఒకప్పుడు గుట్టుగా, లేదంటే కొందరు చుట్టాల మధ్యే జరిగిన ఆ కార్యక్రమాలకి అనవసరపు ప్రచారాలు, ఆర్భాటాలు.

ఆడపిల్లల మీద అకృత్యాలు, ఈవ్ టీజింగ్ లు జరుగుతున్న ఈ కాలంలో తల్లితండ్రులే ప్రపంచానికి తెలిసేలా చెయ్యడమేమిటో...

అందరూ వెళ్ళేదారిలో వెళ్ళకుంటే అవహేళనల రాళ్ళు, వెక్కిరింతల ముళ్ళు గుచ్చుకోవచ్చనే భయమేమో...

ఐనా 'ఎవరి డబ్బు వాళ్ళది, ఎవరి ఇష్టం వాళ్ళది' అనుకున్నాడు.

'పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లు'... మారుతున్న పరిస్థితులు

కానీ అదే వాతలు తాను కూడా పెట్టుకోకపోతే వచ్చే పర్యవసానాలను ఊహించలేదు.

తమ ఇంటికి మూడిళ్ళ ముందు ఇంద్రభవనంలాంటి ఇల్లు ప్రభాకర్ ది.

బంగారం దుకాణంతో కలిసి వచ్చిన అదృష్టానికి ఆ ఇంటికి రంగులు, హంగులు చేరాయి.

ఇంటి ముందు ఖరీదైన కార్లతో పాటు, వేసిన షామియానా, ఇంట్లో చుట్టాలు, స్నేహితులతో కళకళలాడుతుంది.

భూషణ్ ఇంటికి వచ్చేసరికి భార్య మేఘమాల ఎదురు వచ్చింది.

"ప్రభాకర్ గారి అమ్మాయి కార్యక్రమం ధూమ్ ధామ్ గా చేస్తున్నారు. భోజనానికి మనందరిని రమ్మన్నారు. రేపేలాగూ ఆదివారం కదా అందరం వెళ్దాం." గడగడా

చెప్పేసింది.

"మరి బహుమతి...?" అడిగాడు.

'మీ రాక మాకు ఆనందం, బహుమతులు తీసుకురాకపోతే సంతోషం...' అని రాసి ఉన్న వెయ్యి రూపాయల కార్డు చూపించింది మేఘమాల.

"అమ్మాయికి ఏ కొత్త మోడల్ నగలు వేస్తారో..." ఊహించసాగింది.

"ఎందుకు వెయ్యరు. వాళ్ళకి ఏకంగా నగల దుకాణమే ఉంది." నవ్వాడుభూషణ్.

ఇద్దరు కూతుర్లు చేతిలో పుస్తకాలను చదువుకుంటున్నా ఓ చెవి, వీళ్ళ మాటలపై పడేశారు.

మర్నాడు మధ్యాహ్నం కుటుంబమంతా ఫంక్షన్ హాల్ కి వెళ్లారు.

తిరునాళ్ళకి వచ్చానేమోనని భ్రమపడ్డాడు భూషణ్.

రెండు అంతస్తులలో కలిపి ఓ మూడువేలమంది పైగా ఉంటారేమో...

ఊపిరాడనట్లనిపించింది.

అంతమందిని 'వచ్చారా, బాగున్నారా, తిన్నారా...?' అని ప్రభాకర్ కుటుంబం ఎలా పలకరించగలుగుతుందని ఆశ్చర్య పడ్డాడు.

పైగా నగరంలోని ప్రముఖులు కూడా వచ్చారాయే. ఇక హడావుడికి కొదవేముంది.

చుట్టూ తెల్లటి పొగ, అందులోనుండి హంస వాహనంపై వస్తున్న అమ్మాయి, ముందు డాన్సులతో అదరగొడుతున్న కొందరు అమ్మాయిలు, చెవులు చిల్లులు పడుతున్న పాటలు...

అరగంట క్యూలో నిలబడి అమ్మాయిని ఆశీర్వదించాక...

భోజనాల దగ్గర

చికెన్, మటన్, చేపలు, రొయ్యల వంటలతో పాటు చైనీస్, కాంటినెంటల్, ఆసియన్, సుషీ... అంటూ ఏవేవో వంటలు, కొన్ని ఎప్పుడూ వినని, తినని వంటలు...

మరోపక్క దోశ, ఊతప్పాల లైవ్ కౌంటర్స్...

"అన్ని కలిపి ఓ నూట ఏభై రకాలు ఉంటాయా?" అడిగింది జనంలోని ఒకావిడ.

"రెండు వందలట..." అక్కడున్న బోర్డ్ చూపిస్తూ భుక్తాయాసంతో ఇంకొకావిడ.

"ఒక్క స్వీట్స్ మాత్రమే ఏభై రకాలట"

"షుగర్ స్పెక్స్ మామూలుగా ఉండవయితే..." నవ్వుకున్నారు.

పదార్థాలను పూర్తిగా తినలేక, కొంచెమే రుచి చూసి నిర్దాక్షిణ్యంగా డస్ట్ బిన్ లో పడేస్తున్నారు చాలామంది.

ఇంట్లో ఏవైనా మిగిలిపోతే రోజుల కొద్ది ఫ్రిడ్జ్ లో దాచుకుంటారు.

మనది కానప్పుడు చేతులు ఎంత దూరమైనా విసరగలవు.

భోజనాలయ్యాక వెళ్లొస్తామని ప్రభాకర్ వాళ్ళకి చెపుదామనుకున్నా, జనసంద్రంలో వాళ్ళ జాడ లేదు.

ఇంటికి వచ్చాక కూడా ఆ అమ్మాయి వేసుకున్న ఖరీదైన దుస్తులు, నగలు, మేకప్ గురించి మేఘమాల చెబుతూనే ఉంది.

"ఆపుతావా సొద. పొద్దుపోయింది, పడుకో." విసుక్కున్నాడు.

"ఎవర్ని మెచ్చుకున్నా గుచ్చుకుంటుంది..." పక్కకి తిరిగింది.

అప్పటివరకు వెళ్లొచ్చిన కార్యక్రమాల విశేషాలు, వాటి ఘనతలు గురించి అప్పుడప్పుడు చెపుతూనే ఉండేది మేఘమాల.

ఆరోజు ఉదయం షాపుకి బయలుదేరముందు పెరట్లో మామిడి చెట్టు మీద కాకి అరుస్తూ ఉంది.

తల్లి రాజమ్మ, మంచంపై కూర్చుని దగ్గుతూ ఉంది.

'వచ్చేటప్పుడు అమ్మకోసం దగ్గుమందు తీసుకురావాలి' అనుకుంటూ బయలు దేరాడు.

చీరల షాపుకి వచ్చిన కాసేపటికే కస్టమర్స్ రావడం మొదలయ్యింది.

బోర్డర్ బాగుంటే రంగు బాగోలేదని, రంగు బాగుంటే బోర్డర్ బాగోలేదని చీరలు షెల్ఫ్ ల నుండి తీయిస్తూనే ఉన్నారు.

నచ్చితే ఒకటో, రెండో చీరలు కొంటున్నారు... లేదంటే అలా వెళ్లిపో తున్నారు.

ఊపిరి సలపని పనిలో ఉన్నప్పుడు ఇంటి నుండి ఫోన్ వచ్చిందని కబురు.

ఏమయ్యిందని కంగారుపడ్డాడు.

"మన చిన్నమ్మాయి మనస్విని స్కూల్ నుండి ఫోన్ వస్తే వెళ్ళి, ఇంటికి తీసుకు వచ్చాను. మరో వారం రోజులు బడికి వెళ్లదు. సెలవు పెట్టి ఇంటికి రండి." ఆనందంగా చెప్పింది భార్య.

ముందు అర్థం కాని విషయం, తర్వాత పెదాలపై చిరునవ్వును మొలిపించింది.

"పంతులు గారికి ఫోన్ చేసి ఎన్ని గంటలకి చాప మీద కూర్చోబెడితే మంచిదో కనుక్కోండి. ఈలోగా నేను చుట్టుపక్కల వాళ్ళని పిలుస్తాను. మీ అక్కకి కూడా ఫోన్ చెయ్యండి. మేనత్త కూర్చోబెట్టాలి. అలాగే సన్నాయి మేళంవాళ్ళకి చెప్పండి. వస్తూ లడ్డూలు, కారాలు తీసుకురండి. త్వరగా వచ్చెయ్యండి." ఉత్సాహంగా చెప్పింది మేఘమాల.

ఆడపిల్లలు నట్టింట్లో తిరిగే మహాలక్ష్మి అని మురిసిపోతున్నా, ఆ మహాలక్ష్మి అనుగ్రహం లేనిదే ఖర్చులు ఎలా...?

ఆలోచనల్లో ఇంటికి చేరాడు.

ఓ మూల సిగ్గుపడుతూ కూర్చుంది మనస్వి.

పసిడి పాదాలతో తన గుండెల మీద తన్నుతూ, చిట్టి వేళ్ళతో మీసాలతో ఆడుకున్న చిన్నారేనా... ఆశ్చర్యమేసింది.

"సాయంత్రం నాలుగున్నరకి ముహూర్తం బాగుందని పంతులుగారు చెప్పారు." భార్యతో అన్నాడు.

"సరేనండి. మనస్వికి కట్టడానికి కొత్త చీర లేదు అందుకే పక్కింటి శాంతికి చీర కొనమని చెప్పాను. తర్వాత డబ్బులు ఇద్దాం. అలాగే వాళ్ళకి తెలిసిన

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

ఫొటోగ్రాఫర్ కి కూడా చెప్పమన్నాను. మా అమ్మా వాళ్ళు కూడా బయలుదేరారట." అంది మేఘమాల. ఆమెకు కాలు నిలవడం లేదు.

ఇంతలో పక్కింటి అమ్మాయి వచ్చి, "ఆంటీ, ఈ ఫంక్షన్ అంతా నా యూట్యూబ్ ఛానల్ లో పెడతాను. మీకు ఓకేనా?" అడిగింది.

అడగకుండానే వరం దొరికినట్లు "వీడియో బాగా తియ్యి. వైరల్ అయిపోవాలి." సంబరంగా చెప్పింది మేఘమాల.

ఆ అమ్మాయి ఛానెల్ లో లక్షల్లో సబ్ స్క్రయిబర్స్ ఉన్నారు. తమ కార్యక్రమాన్ని బోలెడంత మంది చూస్తారు.

"సోషల్ మీడియాలో వీడియోలు పెట్టడం అవీ వద్దు. ప్రపంచానికి తెలియాల్సిన అవసరం లేదు." వారించాడు భూషణ్.

"అబ్బా!! మీరు మరీన్నూ. మా ఫ్రెండ్ కూతురి వీడియో ఇలాగే పెడితే, చాలా బాగా చేశారని ఎంతమంది మెచ్చుకున్నారో..." అంది మేఘమాల.

"ఫర్వాలేదు అంకుల్. ఈకాలంలో ఇవన్నీ చిన్న విషయాలు. ఐనా వీడియో పెడితేనే కదా మీ ఇంటి పద్ధతులు అందరికీ తెలుస్తాయి." లౌక్యంగా అంది ఆ అమ్మాయి. ఆ అమ్మాయికి కంటెంట్ కావాలి మరి.

"మీరింకా ఇక్కడే ఉన్నారేమిటి? జాకెట్టు ముక్కలు, అరటిపళ్లు, తమల పాకులు, కొబ్బరికాయలు తీసుకురండి." తొందరపెట్టింది మేఘమాల.

"ఎంతమందిని పిలుస్తున్నావు?" అడిగాడు.

"ఊ!! ఈరోజుకి అందరూ కలిపి ఓ ఏభై మంది అవుతారేమో. అందుకే ఏభై పెద్ద స్టీల్ డబ్బాలు తీసుకురండి."

"ఇప్పటికిప్పుడు ఇంత ఖర్చు అంటే..." నసిగాడు.

"ఏదోచేసి తీసుకురండి. ఈలోగా మనస్విని రెడీ చేస్తాను." లోపలికి వెళ్ళిపోయింది.

సాయం కోసం వచ్చిన చుట్టుపక్కల వాళ్ళ ముందు చర్చ బాగుండదని ఊరుకున్నాడు.

నెలాఖరు వరకు ఉండాల్సిన డబ్బులకి రెక్కలు వచ్చాయి.

భూషణ్ ఇంటికి తిరిగివచ్చేసరికి సందడి పెరిగింది.

"అక్కా, వచ్చావా, బాగున్నావా?" అంటూ ఆప్యాయంగా అక్కని పలక రించాడు.

"బాగున్నానుకాని సమయమయి పోతుంది రా. సన్నాయి మేళంవాళ్ళని సిద్ధంగా ఉండమని చెప్పు" అంది నవ్వుతూ.

తొమ్మిది రోజులు కూర్చోబెడతామన దానికి సూచనగా గోడపై తొమ్మిది పసుపు ముద్దలు కొట్టించి, చాప మీద మనస్విని కూర్చోబెట్టారు.

వచ్చినవాళ్ళకి స్వీట్లు, కారాలు ఇచ్చి కూల్ డ్రింక్స్ ఇచ్చారు. బొట్టుపెట్టి తాంబూలం, రిటర్న్ గిఫ్ట్స్ ఇచ్చి సాగనంపింది మేఘమాల.

రాత్రి భోజనాల దగ్గర "అప్పటికప్పుడు ఐనా చాలా బాగా జరిగింది కదండీ." అంది మేఘమాల టిఫిన్ తోపాటు లడ్డు, కాజాలని కూడా భర్త ప్లేటులో వేస్తూ...

"అవునవును..." అన్నాడు.

మొబైల్ లో తీసిన ఫోటోస్, వీడియోలను దూరంనుండి చెల్లికి చూపిస్తుంది పెద్ద కూతురు.

"శనివారం స్నానం చేసేద్దాం. పట్టులంగావోణి, రెండు లెహెంగాలు తీసుకుందాం. ప్రభాకర్ గారి అంత కాకపోయినా మనం కూడా భోజనాలు ఘనంగానే పెడదాం." అంది మేఘమాల.

ఉలిక్కిపడ్డాడు.

"వాళ్ళతో మనకి పోటీ ఏమిటి? వాళ్ళకి సొంతంగా జ్యూయల్లరి షాప్ ఉంది." అన్నాడు.

"ఇలాంటివి మళ్ళీమళ్ళీ చేస్తామా ఏమిటి? ఇప్పుడిదయిపోతే మళ్ళీ పెళ్లప్పుడే" దీర్ఘం తీసింది మేఘమాల.

"ఫంక్షన్ హాల్, బట్టలు, భోజనాలు, రిటర్న్ గిఫ్ట్స్, మిగతా ఖర్చులు అన్నీ కలిపి లక్షల్లో ఉండాలి..."

ఏదోరకంగా చూడాలి మరి. ఏమాత్రం తగ్గినా పిసినిగొట్టు వాళ్ళమని , చేతగానివాళ్ళమని రకరకాలుగా వెక్కిరిస్తారు. 'భోజనాలకి ఓ వంద రకాలు పెడతారా, రిటర్న్ గిఫ్ట్స్ ఏమిటో' అంటూ దీర్ఘం తీసింది ఎదురింటి కళ్యాణి. మీకేం చాతనవుతుందిలే అని ఆవిడగారి వెటకారం కాబోలు..." ఉక్రోషపడింది మేఘమాల.

"పెట్టినా అంటారు. పెట్టకపోయినా అంటారు. వాటిని కాదు మన స్తోమతని పట్టించుకోవాలి. మనకున్నంతలో చేద్దాం. పూర్తిగా వద్దని అనడం లేదు." అన్నాడు భూషణ్

"పెద్దమ్మాయికి చేశాం ఇప్పుడు చిన్నదానికి ఘనంగా చేయకపోతే ఎలా?" ప్రశ్నించింది.

"అప్పుడు చేసిన అప్పులే ఇంకా తీరలేదు." అన్నాడు.

అక్కడే ఉన్న భూషణ్ తల్లి రాజమ్మ

"ఈకాలం ఆడపిల్లలకి కూడా చదువులు అవసరం. ఆపై ఉద్యోగం, పెళ్లి... ఇప్పుడు ఖర్చు పెట్టాలనుకుంటున్న డబ్బులను చదువు కోసం ఉంచుకుంటే మంచిది." సలహా ఇవ్వబోయింది.

కానీ కోడలు చురుగ్గా చూసిన చూపుకి మరి మాట్లాడలేదు.

వాళ్ళ చర్చలు బెడ్రూంలోకి మారాయి.

"అర్థం చేసుకో మాలా, మనకొచ్చే జీతం మీద ఐదుగురుం గడుపుతున్నాం. ప్రతీనెలా ఊహించని ఏదో ఒక ఖర్చు ఊడి పడుతూనే ఉంది." నిస్సహాయంగా అన్నాడు భూషణ్.

"అప్పు తీసుకుందాం." సలహా ఇచ్చింది మేఘమాల.

"ఇప్పుడు ఉన్నవాటికే వడ్డీలు కట్టలేకపోతున్నాం."

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

"మీరేం చేస్తారో నాకు తెలియదు. మన కార్యక్రమం గురించి కూడా గొప్పగా చెప్పుకోవాలి, అంతే" హెచ్చరించింది.

"నాకు మాత్రం చెయ్యాలని ఉండదా? పెళ్ళిళ్ళు బాగా చేద్దాం. అప్పటికి ఆర్థికంగా పుంజుకుంటామేమో..."

"ఉట్టి కేగలేనమ్మ స్వర్గానికేగిందట..." "ఐనా నేనూ, నా పిల్లలంటే మీకిష్టం లేదు." ఆఖరి అస్త్రం వదిలింది మేఘమాల.

సూటిగా గుండెకి తగిలిన బాణానికి విలవిలలాడాడు.

'ఎవరన్నారు ప్రేమని మాటల్లో, చిన్న చిన్న పనుల్లో వ్యక్తం చెయ్యవచ్చని...

అప్పులు చేసి మరీ ఆడంబరాలకు పోతేనే ప్రేమ, భాధ్యత ఉన్నట్లు... పోలికలు, పోటీలే ఈనాడు సమాజాన్ని పీడిస్తున్న మరో సామాజిక రుగ్మతలు...' విరక్తిగా నవ్వుకున్నాడు భూషణ్.

పక్కకి తిరిగి పడుకున్న భార్య అనుకున్నపని జరిగేంతవరకు తనవైపుకి తిరగదని తెలిసిన భూషణ్ నిట్టూర్చాడు.

మౌన యుద్ధం రెండోరోజూ కొనసాగుతుంది.

భోజనం అయ్యాక మంచంపై పడుకుని ఇంటి పైకప్పు చూస్తున్నాడు.

'ఏదైతే ఇన్నాళ్ళూ తమకు నీడనిచ్చిందో దానినే మరోరకంగా వాడుకోవాలా? అమ్మ ఏమంటుందో? తాతల నుండి వస్తున్న ఇల్లు. ఇద్దరు కూతుర్లతో పాటు ఇదొక్కటే తన ఆస్తి.'

నెమ్మదిగా లేచి బీరువాలోని ఇంటి తాలూకూ కాగితాలు తీసి చదివాడు.

మర్నాడు మేఘమాల దగ్గరికి వచ్చి డబ్బులు తెచ్చి, చేతిలో పెట్టాడు.

'ఎక్కడివి?' అని చూస్తున్న ఆమెతో 'మన ఇంటి కాగితాలు, తనఖాలు ఇచ్చే సేఠ్ చేతిలోకి వెళ్ళాయి.' ముక్తసరిగా అన్నాడు.

డబ్బులతో మళ్ళీ చలనం వచ్చింది.

కార్డులు నుండి విందు భోజనాలలో పదార్థాల వరకు చర్చించుకుంటున్నారు.

వాళ్ళు చెప్పుకుంటున్న పదార్థాల పేర్లు వింటున్న రాజమ్మ "మన ఇంట్లో ఏ కార్యక్రమానికి నీచు కూరలు పెట్టము. అంతకీ కావాలంటే కార్యక్రమం తర్వాత, దగ్గరి వాళ్ళకే పెడదాం" అంది.

"అది ఒకప్పుడు. ఇప్పుడు పెట్టకపోతే నాన్ వెజ్ లేదానని మొహంమీదే అనేస్తారు. సరిగ్గా తినకుండా లేచిపోతారు. నలుగురితో నారాయణ..." సమర్థించుకుంది కోడలు.

ఆదివారంనాడు జరిపిన కార్యక్రమాన్ని చూసి 'బాగా చేసావంటూ' పైకి అంటున్నా కొందరు 'ఇల్లు తనఖా పెట్టి మరీ చెయ్యడం... అవసరమా' అంటూ చెవులు కొరుక్కుంటున్నారు.

నెలలు గడుస్తున్నాయి.

పెద్దమ్మాయి పది పూర్తయ్యి కాలేజీకి వచ్చింది. ఫీజులు కట్టాలి.

పొద్దున్న సుప్రభాతం బదులుగా, ముందు తీసుకున్న అప్పు తాలూకా అప్పులవాళ్ళ కేకలు, తిట్లు, శాపనార్థాలు ...

ఇప్పుడు సేఠ్ పెట్టిన గడువు తీరిపోతే ఈ ఇల్లుని జప్తు చేసుకుంటాడు.

ఆలోచనలతో, అవమానాలతో నిద్రాదేవి దూరమయ్యింది. షాపులో కూడా చురుకుగా ఉండలేకపోతున్నాడు.

మగవాడు ఏడవకూడదు. బాధని పంచుకోకూడదు.

ఈ అప్పుల సముద్రాన్ని ఈదుకువెళ్ళి, ఒడ్డుకి చేరడం తనవల్ల కాదు.

చుట్టుపక్కలవాళ్ళకి, చుట్టాలకి తమ పరిస్థితి, వెటకారంతో కూడిన చర్చనీయాంశం.

కఠిన నిర్ణయం తీసుకోక తప్పదు.

వెళ్ళిపోవాలి... దూరంగా వెళ్లిపోవాలి...

ఈ అంతులేని ఆవేదన నుండి అనంతానందాన్ని పొందాలి.

ఫ్యాన్ కి తాడు బిగించాడు.

సరిగ్గా అప్పుడే కలత నిద్రలో ఉన్న మేఘమాల లేచి వచ్చింది.

❀❀❀

భర్త చేయబోతున్న పనిని చూసి గుండెలు బాదుకుంది మేఘమాల.

ఇంట్లో అందరూ కలిసి భూషణ్ ని బల్లపై నుండి కిందకి దించారు.

"మంచి రోజులు వస్తాయి. నన్ను నమ్మురా, నాయనా!!. ఈ వయస్సులో తీరని దుఖాన్ని భరించలేను." భూషణ్ ని దగ్గరికి తీసుకుని ఏడిచింది తల్లి.

"మీరు డీలాపడటం చూస్తున్నాను కానీ పరిస్థితులు ఇంత దారుణంగా మారుతాయని ఊహించలేదండి. నన్ను క్షమించండి." గొల్లుగొల్లున ఏడిచింది మేఘమాల. లెంపలు వేసుకుంది. కాళ్లావేళ్ళా పడింది. అనవసర ఖర్చులు చేయనని, స్థాయికి తగ్గట్లు ఆలోచిస్తానని ప్రమాణాలు చేసింది.

"ఊరుకో మాలా!! నేను చేస్తున్నది తప్పేనని తెలుసు కానీ ఈ పరిస్థితులనుండి ఎలా బయటపడాలో తెలియక... " తల దించుకున్నాడు భూషణ్.

తండ్రిని పట్టుకుని వలవలమని ఏడ్చారు కూతుర్లు.

"ఖాళీ సమయంలో పిల్లలకి ట్యూషన్ చెపుతాను, నాన్నా" అంది పెద్ద కూతురు.

బాగా చదువుకుని పెద్ద ఉద్యోగం తెచ్చుకుంటానని, వదలకుండా గట్టిగా పట్టుకుని ఉండిపోయింది చిన్న కూతురు.

"బట్టలు కుట్టడం కానీ ఏదైనా చిన్న ఉద్యోగం కానీ వెతుక్కుంటానండి. కష్టాల కొండను పిండిచేసి, తీరానికి చేరుదాం..." స్థిరంగా అంది మేఘమాల.

తన కుటుంబంతో సమస్యలు గురించి వివరించకుండా, ఒక్కడే కుమిలిపోతూ దారుణానికి ఒడిగట్టాలనుకున్న తన ఆలోచనకి తిట్టుకున్నాడు భూషణ్.

చీకటిలాగానే సమస్యలు కరగబోతున్నాయి అన్నట్లు సూరీడు తూరుపున పలకరిస్తున్నాడు.

❀

..ఈనాడు ఆదివారం

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# ఒక విచిత్రమైన రాత్రి

బెంగాలీమూలం: **సత్యజిత్ రే**; అనువాదం: **చింతపట్ల సుదర్శన్**



జయంత్ పడక కుర్చీలో వెనక్కి వాలి
హాయిగా కాళ్ళు ఊపుకుంటూ కూర్చున్నాడు.
ఉత్తర బీహారులోని ఓ అడవిలో ఉన్న
బంగాళాను ఎంపిక చేసుకోవడం
మంచిదయింది, మరో చోట ఇంత ప్రశాంతత
ఉండేది కాదు అనుకున్నాడు.

భద్రత విషయం అడగక్కర్లేదు. బ్రిటిష్
కాలం నాటి పాత ఫర్నిచర్ ఆకర్షణీయంగా
ఉంది. పెద్ద మంచం. దానిమీద పరిచిన
శుభ్రమైన బెడ్ షీటు. పరిశుభ్రంగా ఉన్న
అటాచ్డ్ బాత్రూం.. ఇంకేం కావాలి?

తెరిచి ఉంచిన విశాలమైన కిటికీలోనుంచి
కీచురాళ్ళ చప్పుడు వినిపిస్తోంది. కరెంటు
లేదు. అయినా ఫర్వాలేదు. కలకత్తాలో తరచూ
కరెంటు సమస్య ఉండడంవల్ల కిరోసిన్ దీపం
వెలుగులో చదవడం అలవాటే. పైగా తన
ఇంట్లో దీపం వెలుతురు కన్నా ఇక్కడ
వెలుతురు ఎక్కువగానే ఉంది.
చదువుకోవడానికి తనకు ఇష్టమైన డిటెక్టివ్
నవలలు కావలసినన్ని వెంట తెచ్చుకున్నాడు.

బంగాళాలో ఎవరూ లేరు ఒక్క చౌకీదారు
తప్ప!

ఇదే మంచిదయింది. తను ఇక ఎవరితోనూ
మాట్లాడే అవసరం కూడా లేదు. పది రోజుల
క్రితం కలకత్తాలో టూరిస్ట్ కార్యాలయానికి వెళ్లి
గది బుక్ చేశాడు. నాలుగు రోజుల కింద
తనకు గది కేటాయించబడిందని ఉత్తరం
వచ్చింది. ఇక్కడ కనీసం మూడు రోజులైనా
ఉండి ఆ తరువాత ఎక్కడికి వెళ్లాలో
నిర్ణయించుకుందాం అనుకున్నాడు. అతని
దగ్గర కనీసం ఒక నెల రోజులు హాయిగా
గడపడానికి సరిపడా డబ్బుంది. కలకత్తా
నుండి సొంత కారు నడుపుకుంటూ 550
కిలోమీటర్ల దూరం వచ్చాడు.

అన్నమాట ప్రకారం 9:30 కల్లా చౌకీదారు
భోజనం తెచ్చాడు. చపాతీ, పప్పు, కోడికూర
వడ్డించాడు. డైనింగ్ హాలు కూడా బ్రిటిష్
కాలం నాటిదే. టేబుల్, కుర్చీలు ఆకర్షణీయ
మైన కబోర్డ్ చైనా గిన్నెలు అన్నీ బ్రిటిష్ కాలం
నాటివే. భోజనం అయ్యాక "ఇక్కడ దోమలు
ఉన్నాయా?" అని అడిగాడు.

జయంత్ కలకత్తాలో ఉన్న ఫ్లాటులో దోమలు
అనేవే లేవు. గత పదేళ్ళనుంచి అతనికి దోమ
తెర వాడాల్సిన అవసరమే రాలేదు. ఇక్కడ
కూడా దోమతెర వాడాల్సిన అవసరం లేకపోతే
అంతకుమించిన ఆనందం ఏముంటుంది.

"చలికాలంలో దోమలు ఉంటాయి. కానీ, ఇది
ఏప్రిల్ నెల కదా ఆ సమస్య ఉండదు.
అవసరమైతే దోమతెర ఏర్పాటు చేయగలను"
అన్నాడు చౌకీదారు.

జయంత్ రాత్రి పడుకునేటప్పుడు తలుపు
మూసుకుంటే మంచిది అన్నాడు. తలుపు
తెరిచి ఉంచితే ఏ నక్కో మరే జంతువో కానీ
లోపలికి రావచ్చును అన్నాడు. జయంత్ తల
ఊపాడు, ఎట్లాగూ తాను తలుపు వేసుకునే
పడుకోవాలని అనుకున్నాడు.

భోజనం అయ్యాక చేతిలో టార్చితో డైనింగ్
హాల్‌కు ఆనుకుని ఉన్న వరండాలోకి వచ్చాడు.
దాని వెలుతురు ఒక మద్ది చెట్టు కాండంపై
పడింది. వెలుగుని అటు ఇటు కదిలించి
ఏదైనా జంతువు కనబడుతుందేమోనని
చూశాడు. అడవి పూర్తిగా నిశ్శబ్దంగా ఉంది.
నిరంతరం వినిపించే కీచురాళ్ళ చప్పుడు తప్ప.

"బంగ్లాలో దయ్యాలేం లేవు కదా?" అడి
గాడు జయంత్ డైనింగ్ గదిలోకి తిరిగి వస్తూ.

టేబుల్ శుభ్రం చేస్తున్న చౌకీదారు పని ఆపి
నవ్వుతూ తను అక్కడ 35 ఏళ్ల నుంచి
ఉన్నానని, ఎంతోమంది బంగ్లాలో
ఉండిపోయారని కానీ ఎవరూ ఒక్క దయ్యాన్ని
కూడా చూడలేదని అన్నాడు. ఇది విన్న
జయంత్ మనసు తేలికపడింది.

డైనింగ్ రూమ్ తర్వాత రెండవ గది
జయంత్‌ది. భోజనానికి వెళ్ళేటప్పుడు తన గది
తలుపు మూయలేదు. తిరిగి వచ్చాక అలా
తలుపు తీసి ఉంచాల్సింది కాదు అనుకున్నాడు.

ఓ వీధి కుక్క గదిలో జొరబడింది. బక్క
చిక్కిన గోధుమరంగు మచ్చలు ఉన్న తెల్లని
కుక్క అది. గదిలో మూల కూర్చొని ఆ రాత్రి
అక్కడే ఉంటాను అన్న ధీమా
చూపించడానికేమో నోరు తెరిచింది. దాని
కోరపళ్ళు బయటకు
వచ్చాయి.

జయంత్ వెనక్కి
అడుగు వేశాడు.

అతని
చిన్నప్పుడు వాళ్ళ
పొరుగింటి
అబ్బాయిని
పిచ్చికుక్క కరిచింది. హైడ్రోఫోబియాతో ఆ
అబ్బాయి పడ్డ అవస్థలు తను కళ్ళారా
చూశాడు. అందుకే మొరిగే కుక్కను
సమీపించేందుకు సాహసించలేదు. దానివైపే
చూస్తూ వెనక్కి నడిచి మళ్ళీ వరండాలోకి
వచ్చి, "ఒకసారి ఇటు రా.." అని పిలిచాడు.

చౌకీదారు తువ్వాలతో చేతులు
తుడుచుకుంటూ వచ్చాడు.

"నా గదిలో ఒక కుక్క దూరింది, దాన్ని
వెళ్ళగొట్టు."

చౌకీదారు ముఖంలో ఆశ్చర్యం కనిపించింది.

"ఈ ప్రాంతంలో కుక్కలు అనేవి లేవా?
ఎందుకంత ఆశ్చర్యం.. నాతో రా చూపిస్తా!"
చౌకీదారు జయంత్ వైపు అనుమానంగా
చూస్తూ గదిలోకి వచ్చాడు.


ఆ వెనకే జయంత్ వచ్చాడు. "ఎక్కడయ్యా
కుక్క. అసలు గదిలోకి కుక్క వచ్చిన జాడే
లేదు" అన్నాడు. జయంత్ చౌకీదారుని
పిలవడానికి వెళ్ళిన కొద్ది క్షణాల్లో అది
బయటకు వెళ్ళిపోయింది.

అయినా చౌకీదారు మంచం కింద,
బాత్రూంలో ఉండేమోనని చూశాడు

**సత్యజిత్ రే (1921-1992) : 1992లో గౌరవ ఆస్కార్ పురస్కారాన్ని అందుకున్న సత్యజిత్ రే ప్రపంచ సినిమాలో 20వ శతాబ్దపు ఉత్తమ చిత్ర దర్శకుడిగా ప్రసిద్ధుడు. కలకత్తా ప్రెసిడెన్సీ కాలేజీ, రవీంద్రనాథ్ ఠాగూర్ శాంతినికేతన్‌లో చదువుకున్న రే సంగీతం, సినిమాటోగ్రఫీ, కళాదర్శకత్వం, ఎడిటింగ్ శాఖల్లో నిష్ణాతుడు. డాక్యుమెంటరీలు, లఘు చిత్రాలు, మొత్తం 37 చిత్రాలకు దర్శకత్వం వహించిన సత్యజిత్ రే మొదటి చిత్రం 'పథేర్ పాంచాలి' కేన్స్ చలనచిత్రోత్సవంలో 11 అంతర్జాతీయ బహుమతులు గెల్చుకుంది. బెంగాలీ కథా రచయితగా ఆయన రాసిన ఏభై కథలు సంపుటాలుగా వచ్చాయి. రే కథల్ని గోపా మజుందార్ ఇంగ్లీష్‌లోకి అనువదించారు. ఈ కథ 1979లో బెంగాలీలో ప్రచురితమైంది.**



ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి




"లేదయ్యా ఇక్కడ ఏ కుక్క లేదు."

"ఇప్పుడు లేదేమో ఒక నిమిషం కింద ఇక్కడే ఉండింది" అని తనకు పడక కుర్చీ తెమ్మని అడిగాడు. సిగరెట్ కాల్చి దాని కొనని నులిమి కిటికీ నుంచి బయటకు విసిరేశాడు. తరువాత చేతులు పైకెత్తి ఒళ్ళు విరుచు కుంటూ ఉన్నప్పుడు గమనించాడు. పోయిన కుక్క మళ్లీ వెనక్కు వచ్చినట్టుంది. ఇదివరకటి లాగానే గదిలో ఓ మూల నిలబడ్డది. ఎంత చిరాకుగా ఉందో! దాన్ని అక్కడే ఉండనిస్తే రాత్రంతా కూర్చుని తన కొత్త బాటా చెప్పుల్ని కొరికి ముక్కలు చేసేస్తుందనుకున్నాడు.

జయంత్‌కి తెలుసు కుక్కలకి చెప్పులంటే ఎంత పిచ్చో. నేల మీద ఉన్న చెప్పులను తీసి టేబుల్ మీద పెట్టాడు.

ఇప్పుడు ఆ గదిలో అతనితోపాటు మరొక ప్రాణి ఉన్నది. కాసేపు ఉండనిచ్చి నిద్రపోయే ముందు దాన్ని బయటికి తరిమేయాలి అనుకున్నాడు. టేబుల్ మీద పెట్టిన ఇండియన్ ఎయిర్లైన్స్ బ్యాగులో నుంచి ఓ నవల బయటకు తీశాడు. తను ఎక్కడ దాకా చదివాడో ఆ పేజీ చివర మడత పెట్టి ఉంచాడు. తను వేళ్ళతో పుస్తకంలోని ఆ పేజీని తెరవబోతూ కుక్క వైపు చూశాడు.

అతనికి తెలియకుండానే మరొక జీవి గదిలోకి ప్రవేశించింది. అది ఒక పిల్లి. ఒళ్ళంతా పెద్దపులికి ఉన్నట్టు చారలు ఉన్నాయి. తన ఒంటిని బంతిలా చుట్టి పసుపు కళ్ళతో అతని వైపే సూటిగా చూసింది. ఇలాంటి పిల్లిని తను ఎక్కడ చూశాడో గుర్తు చేసుకున్నాడు.

గుర్తొచ్చింది!

తన ఇంటి పక్కనే ఉండేది కుందూస్ కుటుంబం. వాళ్ళ దగ్గర ఏడు పిల్లి పిల్లలు ఉండేవి. వాటిల్లో ఒకటి అచ్చం ఈ పిల్లిలాగే ఉండేది. ఆ రాత్రి జరిగింది స్పష్టంగా కళ్ళ ముందు కదలాడింది. ఆరు నెలల కింద ఒక రాత్రి అదే పనిగా పిల్లులు పోట్లాడే శబ్దానికి మెలకువ వచ్చింది. అతని మనసు బాగా లేదప్పుడు, తన వ్యాపార భాగస్వామి అధీర్‌తో వాగ్వివాదం అంతకు ముందు రోజే జరిగింది. ఆ గొడవ ఇద్దరూ దాదాపు కొట్టుకునే వరకు... అతను పోలీసుల దగ్గరికి వెళ్తాననే వరకు వెళ్ళింది. అందువల్ల ఆ రాత్రి అతనికి సరిగ్గా నిద్ర పట్టలేదు. అప్పుడు ఈ పిల్లి అరుపులకు తల పగిలిపోయింది. ఒక అరగంట తర్వాత తన ఓపిక పూర్తిగా నశించి, బరువుగా ఉన్న పేపర్ వెయిట్‌ని అందుకని కిటికీలోంచి ఆ అరుపు వినిపిస్తున్న వైపు విసిరాడు. మరునాడు కుందూస్ కుటుంబ సభ్యులు అంతా అరిచి గీపెట్టారు. ఎవరో తమ పిల్లుల్లో ఒకటైన చారల పిల్లిని చంపేశారని.

ఈ వార్త జయంత్‌కు ఆనందాన్ని కలిగించింది. తను ఒక పిల్లిని హత్య చేశాడా? దీన్నే హత్య అని అంటే మనుషులు హత్య అని ఆలోచించకుండా ఎన్ని హత్యలు చేస్తున్నారు అనుకున్నాడు.

మరొక సంఘటన కూడా జ్ఞాపకం వచ్చింది.

చాలా సంవత్సరాల కిందట అతను కాలేజీ విద్యార్థిగా హాస్టల్‌లో ఉండేవాడు. ఒకరోజు గదిలో ఒక చీమలదండు గోడమీదికి ఒకదాని వెనుక ఒకటి ఎక్కుతుండడం చూశాడు. ఒక దినపత్రిక పేపర్ తీసుకొని దాని చివర మంట పెట్టి చీమలదండును పైనుంచి కిందికి రాలగొట్టాడు. అతను చూస్తుండగానే ఎన్నో చీమలు నేల మీద పడక ముందే చచ్చిపోయాయి. ఇవి కూడా హత్యలేనా?

వాచీ చూసుకున్నాడు. సమయం పదికి పది నిమిషాలు తక్కువ. ఒక నెల వరకు అతనికి ఆ దృశ్యం గుర్తొస్తుండేది. ఎప్పుడు చూసినా ఒళ్ళు సెగలు పొగలుగా ఉండేది. అందువల్ల రోజుకి మూడుసార్లు స్నానం చేయడం మొదలుపెట్టాడు. ఈ భావన కూడా క్రమక్రమంగా కనుమరుగైంది.

పుస్తకం తెరిచి ఒకటి రెండు వాక్యాలు చదివాడో లేదో అతని దృష్టి మరొకసారి పిల్లి మీద పడింది. ఇది ఎందుకు తనవైపే తదేకంగా చూస్తోంది! ఈ రాత్రి గదిలో తాను ఒక్కడే పడుకోలేడు అన్నది ఖాయమైంది. చెప్పుకోదగ్గ విషయమేమిటంటే అవి రెండూ మనుషులు కాకపోవడం. ఆ రెండూ నిశ్శబ్దంగా తమ మానాన తాము ఉంటే తను ఆ రాత్రి హాయిగా నిద్రపోగలడు. తనకు నిద్ర చాలా ముఖ్యం. అనేక కారణాల వల్ల అతను కొద్ది రోజుల నుండి సరిగ్గా నిద్రపోనేలేదు.

జయంత్‌కు ఆధునికులు నిద్ర కోసం వాడే నిద్ర బిళ్ళలు మింగడం ఎంత మాత్రం ఇష్టం లేదు. దీపాన్ని మంచం పక్కనే ఉన్న చిన్న టేబుల్ మీద పెట్టాడు. షర్టు విప్పి బట్టల స్టాండుకు తగిలించి ఫ్లాస్కులో నుంచి కొన్ని నీళ్లు తాగి మంచం మీద పడుకున్నాడు. చేతిలో పుస్తకం ఇంకా అలాగే ఉంది. మంచం కాళ్ళ దగ్గర కూర్చొని ఉన్న కుక్క లేచి నిలబడి జయంత్ వైపు సూటిగా చూసింది.

ఒక కుక్క హత్య గుర్తొచ్చి జయంత్ గుండె లయ తప్పింది. నిజమే అది కూడా ఒకరకంగా హత్యే. అతనికి ఆ సంఘటన బాగా గుర్తుంది. తాను 1973లో కారు కొన్న రోజుల్లో జరిగింది. తను కారు కొంచెం రాష్‌గానే నడిపించేవాడు. కలకత్తా వీధుల్లో ట్రాఫిక్ విపరీతంగా ఉండడం వల్ల, తను నగరం దాటి పోతే తప్ప స్పీడోమీటర్ ముల్లు పూర్తిగా తిరిగే అవకాశం లేదని, కనీసం 70 మైళ్ళ వేగంతో కారు నడిపితే తప్ప తృప్తిగా ఉండదని హైవే మీద వెళ్లేవాడు.

ఒకనాడు కోలాగాట్‌కు జాతీయ రహదారి మీద వెళ్తున్నప్పుడు కారుని ఒక కుక్క మీదుగా పోనిచ్చాడు. తెల్లటి చర్మం మీద బ్రౌన్ మచ్చలు ఉన్న వీధి కుక్క. జయంత్‌కి ఏం జరిగిందో తెలిసినా ఏమీ పట్టించుకోకుండా అదే వేగంతో వెళ్లిపోయాడు. కాసేపటికి అతని మనసు తను చేసింది తప్పు అంది. కానీ అతను పట్టించుకోలేదు. అది కేవలం ఒక వీధి కుక్క మాత్రమే.. ఎంత బక్క చిక్కిన కుక్క అంటే దాని పక్కటెముకలు లెక్కపెట్టవచ్చు. అలాంటి జీవి బతికి ఉండడం అవసరమా? దానివల్ల ఎవరికి లాభం?

జయంత్‌కు ఈ సంఘటన గుర్తున్నది కానీ అతని మనసులో తను నేరం చేసిన జాడే లేదు. ఆ సంఘటనలు జరిగినప్పుడు తనదే గెలుపు కానీ ఈ రాత్రి హఠాత్తుగా ఆ సంఘటనలు గుర్తుకు వచ్చి అతని మనశ్శాంతిని నాశనం చేశాయి.

జీవితంలో ఎన్నో జంతువులని చంపాడు. తను చంపిన ప్రాణులన్నీ ఇప్పుడు ఇక్కడికి వస్తాయా? తను చిన్నపిల్లవాడిగా ఉన్నప్పుడు షాట్ గన్‌తో కాల్చి చంపిన ఆ నల్ల పక్షి మాటేమిటి? ఆ పక్షి పేరు కూడా అతనికి తెలియదు. తను తన మామయ్య ఇంటికి జర్గ్రామ్‌కు వెళ్ళినప్పుడు బరువైన ఇటుకతో ... అవునూ.. అదీ ఇక్కడే ఉందా? కిటికీ వైపు చూస్తే ఒక పాము కనిపించింది. అది ఎనిమిది అడుగుల పొడుగున్న నాగుపాము. దాని మృదువైన శరీరం కిటికీలోంచి కిందకి జారి గోడకు ఆనించి ఉన్న టేబుల్‌ని ఎక్కుతున్నది.

సాధారణంగా పాములు ఏప్రిల్ నెలలో కనిపించవు కానీ ఇది వచ్చింది. దాని శరీరంలో మూడింట రెండు భాగాలు బల్ల మీదికి ఎక్కాక అది తన పడగని విప్పింది. దీపం వెలుగులో

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి




దాని పడగా, క్రూరమైన కళ్ళూ మెరిశాయి. తన మామ ఇంట్లో ఉన్నప్పుడు ఇలాంటి పామునే ఇటుక రాయితో చితగ్గొట్టాడు. ఆ పాము ఆ ఇంట్లో ఎన్నాళ్ళ నుంచో ఉండేది. ఎవరికీ హాని తల పెట్టింది కాదు. జయంత్ గొంతు పూర్తిగా ఎండిపోయింది. కనీసం చౌకీదారును రమ్మని అరవలేకపోయాడు. బయట ఉన్న కీచురాళ్ళు అరవడం ఆపాయి.

ఒక విచిత్రమైన నిశ్శబ్దం అంతటా ఆవరించింది. అతని చేతి వాచీలో ముళ్ళు నెమ్మదిగా కదులుతున్నాయి గనుక వాటి చప్పుడు వినిపించడం లేదు. ఒక నిమిషం తాను కలగనడం లేదు కదా అనుకున్నాడు.

ఈమధ్య కొన్నిసార్లు ఇలా జరిగింది. తన ఇంట్లో తన సొంత గదిలో పడుకున్నప్పుడు కూడా తను వేరే ఎక్కడో పడుకున్నట్టు... అపరిచితులు ఎవరో మాట్లాడుకుంటూ గది ముందునుంచి వెళుతున్నట్టు అనిపించింది. కానీ ఆ చిత్రమైన స్థితి కొద్ది క్షణాలే ఉండింది. బహుశా నిద్రపోవడానికి ముందు అలా ఊహించుకునే వాడేమో కానీ తను ఇవాళ చూస్తున్నది మాత్రం కల కాదు. తనని తాను గిచ్చుకొని చూశాడు.

కల కాదు నిజమే.. కళ్ళ ముందు కనపడుతున్నదంతా నిజమే. అంతా కచ్చితంగా ప్రత్యేకంగా తనకోసం జరుగుతున్నది. ఒక గంట అలాగే పడుకున్నాడు గదిలోకి కొన్ని దోమలు కూడా వచ్చాయి. అవి తన మంచం చుట్టూ గాలిలో గిరికీలు కొడుతున్నాయి కానీ ఇంకా కుట్టలేదు. తన జీవితంలో అతను ఎన్ని దోమల్ని చంపాడో ఎవరు చెప్పగలరు. ఒక గంట తర్వాత గదిలో ఉన్న ప్రాణుల్లో ఏదీ దూకుడు చూపించకపోవడంతో రిలాక్స్ అయ్యాడు. ఇక నిద్రపోవచ్చు అనుకున్నాడు.

దీపం వత్తిని తగ్గించబోతున్న క్షణాన ఏదో శబ్దం వినిపించింది. బంగ్లా గేటు నుంచి వరండా మెట్ల వరకు ఉన్న గులకరాళ్ళ దారిలో ఎవరో నడుస్తున్నారు. ఈసారి నడిచి వస్తున్నది నాలుగు కాళ్ల ప్రాణి కాదు, రెండు కాళ్ళదే. ఇప్పుడు జయంత్‌కి విపరీతంగా చెమట పట్టింది. గుండె దడదడలాడుతున్నది.

కుక్క, పిల్లి ఇంకా అతన్నే సూటిగా చూస్తున్నవి. దోమలు గుయ్యిమనడం మానలేదు. నాగుపాము ఇంకా విప్పి ఉన్న పడగను ఒక కనిపించని పాములవాడి వినిపించని నాగస్వర శబ్దానికి లయబద్ధంగా అటూ ఇటూ ఊపుతున్నది.

అడుగుల చప్పుడు వరండా దగ్గరికి వచ్చింది. ఒక చిన్న నల్లని పక్షి కిటికీలో నుంచి లోపలికి ఎగిరి వచ్చి టేబుల్ మీద కూర్చుంది. అతను షాట్ గన్‌తో కాల్చినప్పుడు ఆ పక్షి గోడ మీద నుంచి కిందకి జారి, పక్క వాళ్ళ తలుపు దగ్గర నేల మీద చచ్చి పడింది.

అడుగుల చప్పుడు ఆగిపోయింది. ఆ అడుగుల చప్పుడు ఎవరిదో తెలిసిపోయింది. అవి తన భాగస్వామి అధీర్ బాబు అడుగులే అయి ఉండాలి.

ఒకప్పుడు స్నేహితులే అయినా తర్వాత ఒకళ్ళతో ఒకళ్ళకు మాటలు లేవు. అధీర్‌కి జయంత్ వ్యాపారం నడిపే తీరు నచ్చలేదు. అతను జయంత్‌ను పోలీసులకు పట్టిస్తానని బెదిరించాడు. జయంత్ నిజాయితీగా వ్యాపారం నడపడం మూర్ఖత్వం అన్నాడు. అధీర్ ఈ అభిప్రాయాన్ని ఒప్పుకోలేదు. అధీర్ నైతికత ముందే తెలిసివుంటే అతనితో వ్యాపారంలో భాగస్వామ్యం చేసేవాడే కాదు జయంత్. అధీర్, జయంత్‌కు బద్ధ శత్రువుగా మారడానికి ఎక్కువ కాలం పట్టలేదు.

శత్రుశేషం ఉండరాదని శత్రువు బతికి ఉండటం ఎప్పటికైనా ప్రమాదమని ఏం చేయాలో అదే చేశాడు. క్రితం రాత్రి జయంత్, అధీర్ ఇంటికి వెళ్ళాడు. ఇద్దరూ ముందు గదిలో ఎదురెదురుగా కూర్చున్నారు. జయంత్ జేబులో రివాల్వర్ ఉంది. భాగస్వామిని చంపే ఉద్దేశంతోనే వచ్చాడు. అధీర్ తనకు కొద్ది అడుగుల దూరంలోనే ఉన్నాడు. ఇద్దరూ మరొకసారి వాదించుకున్నారు. అధీర్ గొంతు తారాస్థాయికి చేరుకుంది.

జయంత్ రివాల్వర్ బయటకు తీసి కాల్చాడు.

ఒకప్పటి తన భాగస్వామి ముఖంలోకి చూస్తే ఇప్పుడు నవ్వొచ్చింది. అధీర్ తను ఆయుధంతో వస్తాడని అసలు ఊహించి ఉండడు. ఈ సంఘటన జరిగిన పదిహేను నిమిషాల్లోనే కారులో బయలుదేరాడు. రాత్రి బురుద్వాన్ రైల్వేస్టేషన్ వెయిటింగ్ రూమ్‌లో ఉండి ఈ ఉదయమే తను పదిరోజుల కింద బుక్ చేసిన ఈ అడవిలో బంగ్లాకు వచ్చాడు.

**ఎవరో తలుపు బాదుతూనే ఉన్నారు. జయంత్ కళ్ళు మసకలు కమ్ముతున్నాయి. అయినా కుక్క తన వైపు చూస్తున్నట్టు కనిపించింది. పిల్లి కళ్ళు తన కళ్ళకు సరిగ్గా అంగుళం దూరంలో ఉన్నవి. పాము టేబుల్ కాలు మీద నుంచి సరాసరి తన దగ్గరికి రావడానికి దిగుతున్నది. పక్షి ఎగిరి మంచం మీద కూర్చుంది. ఛాతి మీద లెక్కలేనన్ని చీమలు.. అతని బనీను కనిపించనంతగా కమ్ముకున్నవి. చివరికి ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్లు తలుపు పగలగొట్టారు.**

ఎవరో తలుపు కొట్టారు.

ఒకసారి.. రెండుసార్లు.. మూడుసార్లు.

జయంత్ తలుపు వైపు చూశాడు. అతని మొత్తం శరీరం వణుకుతోంది. శ్వాస ఆడనట్టు అనిపించింది.

"తలుపు తెరువు జయంత్... నేను అధీర్‌ని" అనే మాటలు వినిపించాయి.

తను అతన్ని వదిలేసి వచ్చినప్పుడు అతడు పూర్తిగా చనిపోయాడో లేదో తెలీదు. ఇప్పుడు సందేహమే లేదు. ఆ కుక్క, ఆ పిల్లి, ఆ పాము, ఆ పక్షి... ఒకప్పుడు చచ్చిన ప్రాణులన్నీ గదిలో మళ్ళీ ఇప్పుడు కనిపిస్తున్నాయి. అంటే తలుపు బయట నిలబడి ఉన్న అధీర్ కూడా చచ్చే ఉండాలి.

ఎవరో తలుపు బాదుతూనే ఉన్నారు. జయంత్ కళ్ళు మసకలు కమ్ముతున్నాయి. అయినా కుక్క తన వైపు చూస్తున్నట్టు కనిపించింది. పిల్లి కళ్ళు తన కళ్ళకు సరిగ్గా అంగుళం దూరంలో ఉన్నవి. పాము టేబుల్ కాలు మీద నుంచి సరాసరి తన దగ్గరికి రావడానికి దిగుతున్నది. పక్షి ఎగిరి మంచం మీద కూర్చుంది. ఛాతి మీద లెక్కలేనన్ని చీమలు.. అతని బనీను కనిపించనంతగా కమ్ముకున్నవి.

చివరికి ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్లు తలుపు పగలగొట్టారు. అధీర్ బాబు పోలీసులను కలకత్తా నుంచి తీసుకువచ్చాడు. జయంత్ కాగితాల్లో టూరిజం శాఖ నుంచి వచ్చిన ఉత్తరం దొరకడంతో, అతను ఇక్కడ ఉన్నాడని వాళ్ళకి తెలిసింది.

మంచం మీద జయంత్ అచేతనంగా పడి ఉండడంతో ఇన్‌స్పెక్టర్ సామంత్ "తలుపు తెరవకుండా చచ్చాడు. నీ భాగస్వామి గుండె బలహీనమైనదా?" అని అడిగాడు.

"అతని గుండె బలహీనత గురించి తెలియదు. కానీ, ఈ మధ్య అతని ప్రవర్తన వింతగా అనిపించింది. మంచివాడు ఎవడూ భాగస్వామ్యంలో ఉన్న సభ్యుల నిధులతో ఇలా ఆడుకోడు. మోసం చేయాలని చూడడు. అతడు అక్రమంగా డబ్బు సంపాదించడానికి వచ్చి పిచ్చోడైనాడా అనిపించింది నాకు. తన జేబులోని రివాల్వర్ తీస్తాడని ఊహించలేదు నేను. షాక్ నుంచి కోలుకోవడానికి పది నిమిషాలు పట్టింది. రివాల్వర్తో పేల్చి పారిపోయాడు. అప్పుడే నిర్ణయించుకున్నా ఈ పిచ్చోడిని పోలీసులకు పట్టించాలని. ఇవాళ నేను బతుకున్నాను అంటే అది కేవలం అదృష్టం వల్లే."

సామంత్ ముఖం చిట్లించి "అంత దగ్గర నుంచి రివాల్వర్‌తో కాలిస్తే ఎలా మిస్సయింది?"

అధీర్ బాబు చిరునవ్వు నవ్వి అన్నాడు.

"ఎవరైనా ఎలా చచ్చిపోగలరు.. విధిరాత అలా లేకపోతే! బుల్లెట్ నాకు తగల్లేదు. సోఫా మూలకు తగిలింది. ఎవరైనా చిమ్మ చీకటిలో లక్ష్యాన్ని ఎలా చూడగలరు? మా ప్రాంతంలో పవర్ కట్ ఉంది కదా.. అతను రివాల్వర్ బయటకు తీసిన క్షణమే కరెంటు పోయింది."

---

92998 09212

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



# అమ్మ కానుక

మినీ కథ

యం. ఆర్ అరుణ కుమారి
8121523835

'నీకు ఈ జన్మలో పెళ్లి అయ్యే యోగం లేనట్లుందిరా' దిగులుగా అంది భార్గవి.

'అదేంటక్కా.. అలా అనేసావు?' సుదీప్ హర్ట్ అయ్యాడు.

'లేకపోతే ఏంట్రా నీ గొంతెమ్మ కోరిక? ఏ పెళ్లికూతురన్నా నీ కోరిక ఒప్పుకుంటుందని అనుకుంటున్నావా? ఇప్పటికి ఎన్ని సంబంధాలు తప్పిపోయాయి నీ కోరిక వల్ల?' కాస్త విసుగ్గానే అంది భార్గవి.

'అక్కా! ఒప్పుకునే అమ్మాయి తప్పక దొరుకుతుంది' దృఢంగా అంటున్న సుదీప్ వైపు జాలిగా చూసింది భార్గవి.

'పిచ్చి సన్నాసి ! ఇది ఉమ్మడి కుటుంబాల కాలంగాదురా! వ్యక్తి కుటుంబాల కాలం నడుస్తోంది. అందుకే మనుషుల మధ్య సంబంధాలు, మమతాను రాగాలు లేకుండా పోతున్నాయి'

'ఒక కుటుంబంలోనే లేనప్పుడు సమాజంలో మానవ సంబంధాలు, విలువలు ఎలా ఉంటాయక్కా?'

'కార్ల్ మార్క్స్ ఏనాడో చెప్పాడు కదరా మానవ సంబంధాలన్నీ ఆర్థిక బంధాలేనని!'

'కానీ అక్కా! మన అమ్మానాన్న ఎప్పుడూ... డబ్బుకు కాకుండా మనుషులకే విలువ ఇవ్వాలి. ఒక మనిషి నైతిక విలువలుతో ఉన్నప్పుడే మనిషిగా గుర్తింపు అని చెప్పేవారు కదా!'

'నిజమేరా కానీ ఇప్పుడు ప్రతి దాన్ని డబ్బుతో, సమయంతో, స్వప్రయోజనంతో ముడిపెట్టి... మనిషి చూస్తున్నాడు'

'అవునక్కా! మనిషికి మానవత్వం గుర్తు చేసే ప్రయత్నం ఎవరో ఒకరు చేయాలి కదా!'

'ఒక్కరి ప్రయత్నం వల్ల సమాజం మారిపోతుందంటావా?"

'రాత్రికి రాత్రి మారిపోతుందనుకోవడం మూర్ఖత్వమే కదక్కా! ఈ ప్రయత్నంలో నేను సఫలం అవుతానో లేదో కాలం నిర్ణయిస్తుంది'

ఇప్పటికే చాలా సంబంధాలు చూశారు. అన్నీ... పెళ్లి చూపులప్పుడు సుదీప్ కోరిక విని వెనక్కి వెళ్ళిపోయాయి. కొందరు ఆశ్చర్యపోయారు. కొందరు భయపడ్డారు. కొందరు హేళన కూడా చేశారని విన్నారు. అయినా సుదీప్ తన పట్టు వీడడం లేదు. పెళ్లి చూపులప్పుడు చెప్పడము.. మళ్లీ వాళ్ళు వద్దనుకోవడం ఎందుకని .. ముందుగానే సుదీప్ కోరిక చెప్పి దానికి ఒప్పుకుంటేనే.. పెళ్లి చూపులు ఏర్పాటు చేయించమని చెప్పారు పెళ్లిళ్ల పేరయ్యకు. ఆ మాట చెప్పాక ఒక్క సంబంధం గురించీ చెప్పలేదాయన. ఫోన్ చేస్తే 'మీకు తెలియందేముందమ్మా? ఉన్న వాళ్ళనే వద్దనుకునే కాలం ఇది. ఇక.. లేనివాళ్లను కావాలనుకుంటుంటే మనకెందుకు ఆ లంపటాలు అన్న భయము ఉంటుంది కదా? అయినా నా ప్రయత్నం నేను చేస్తాను లెండి' అని పరిస్థితి వివరిస్తూనే హామీ ఇచ్చాడాయన.

ఆ మాటలు విని భార్గవి నిరాశపడింది. తమ్ముడికి పెళ్లి కాదేమోనన్న బాధ దాచుకోలేకపోయింది. ఎన్ని చెప్పినా... ఎంత నచ్చచెబుతున్నా సుదీప్ తన నిర్ణయాన్ని వదలటం లేదు.

' నీళ్లు లేవని మేఘాలను ఆకాశం వద్దంటుందా? నీలి నీలి ఆకాశంలో తెల్లని మబ్బులు ఎంత అందమో మనిషికి వ్యక్తిత్వమే మర్యాద కాదూ?!?

ఒకరి ఆశయం మంచిదైనప్పుడు వీలైతే ప్రోత్సహించాలి లేకపోతే ఊరుకోనుండాలి . నువ్వు ఎందుకలా బాధపడి అతన్ని నిరుత్సాహపరుస్తావు? అతడి ఆశయాన్ని అర్థం చేసుకునే అమ్మాయి దొరక్కపోదు. అంతవరకూ నువ్వు కాస్త ఓపికగా ఉండు.' భర్త రవి మాటలకు బదులు పలకలేక 'అంతకన్నా చేసేదేముందిలే?' అనుకుంటూ దీర్ఘంగా నిట్టూర్చింది భార్గవి.

ఒక యాక్సిడెంట్ లో సుదీప్ కి అమ్మానాన్న ఒకేసారి చనిపోయారు. ఆ దుఃఖం నుండి ముందుగా తేరుకున్నది భార్గవే! భర్త, పిల్లలే కాకుండా డిగ్రీ చదువుతున్న తమ్ముడి బాధ్యత కూడా తనదే కాబట్టి తల్లిదండ్రుల మరణ బాధను కడుపులో దాచుకొంది. తండ్రి ఉద్యోగం తమ్ముడికి వచ్చాక పెళ్లి ప్రయత్నాలు మొదలుపెట్టారు. తల్లిదండ్రుల పుట్టినరోజులకు, పెళ్లిరోజుకు, వర్ధంతికి వృద్ధాశ్రమాల్లో, అనాధాశ్రమాల్లో అన్నదానాలు చేస్తారు. అలా ఓసారి ఒక ఓల్డేజ్ హోమ్ కు వెళ్లి వచ్చాక సుదీప్ చాలా డిస్టర్బ్ అయిపోయాడు. కొన్ని రోజులు ముభావంగా ఉంటూ ...తీవ్రంగా ఆలోచించి ఒక నిర్ణయం తీసుకున్నాడు. అది అక్కా బావలకు చెబితే ముందు వాళ్లే ఒప్పుకోలేదు. అయితే సుదీప్ మొండి పట్టుపట్టడంతో చివరకు ఒప్పుకోక తప్ప లేదు. ఇక ఒప్పుకునే అమ్మాయి దొరకాలి. దొరకదేమోనన్న అనుమానం అక్కకు. సంకల్పం బలంగా ఉంటే అనుకున్నది జరుగుతుందన్న నమ్మకం తమ్ముడికి ఉంది.

• • •

'మీరు సరిగ్గా నే విన్నారా? మీరు వివరంగా చెప్పారా అసలు?' నమ్మలేనట్లు అడిగింది భార్గవి పెళ్లిళ్ల పేరయ్య తెచ్చిన అమ్మాయి ఫొటో, బయోడేటా చూస్తూ.

'చెప్పానమ్మా. పెళ్ళిచూపులకు మీరు మంచి రోజు చూసుకుని చెబితే ..నేను వాళ్లకు చెప్తాను.' పెళ్లిళ్ల పేరయ్య వెళ్లిపోయాక భర్తకు, తమ్ముడికి ఫోన్ చేసి చెప్పింది భార్గవి ఆనందంగా. తర్వాత తమ ఇంటి పురోహితుడికి ఫోన్ చేసి దగ్గరలో ఉన్న మంచి రోజులు శుభ సమయాలతో సహా చెప్పమని చెప్పింది. పెళ్లి చూపులకే పెళ్లి అవుతున్నంత సంబరపడిపోయింది భార్గవి.

• • •

'అమ్మా! మీరు ఈ ఆశ్రమానికి ఎలా వచ్చారు?'

'కొత్త కథేముంటుంది బాబూ? ఇప్పుడు చాలామంది తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యే కదా?'

'సమస్యకు కారణం ఏమిటంటారు?'

'స్వార్థం కాక మరేముంటుంది?'

'ఎవరి స్వార్థం? పిల్లలదే కదా!'

'పూర్తిగా కాదు బాబూ! తల్లిదండ్రులది కూడా.'

'తల్లిదండ్రులదా? వాళ్లకు స్వార్థం ఏముంటుందమ్మా? తమ శక్తి యుక్తులు, సంపాదన, జీవితం మొత్తం పిల్లల కోసమే దారపోస్తారు కదా? వాళ్ళ త్యాగానికి ప్రతిఫలంగా చివరి దశలో చూసుకోకుండా వదిలేయటం పిల్లల తప్పు కాదా?'

'తల్లిదండ్రులు పిల్లల కోసం చేయటం అనేది బాధ్యత. దానికి ప్రతిఫలం ఆశించటమే స్వార్థం అంటాను నేను.'

'సరే. మీ మాటే సరైనది అనుకుందాము. మరి పిల్లలకు వృద్ధులైన తల్లిదండ్రులను చూసుకోవలసిన బాధ్యత లేదంటారా?'

"........."

'చెప్పండమ్మా. బాధ్యత లేదంటారా లేక తెలియదంటారా?'

'ఉందని తెలుసుకోకపోవడమే కావచ్చు.'

'తెలియకపోతే తెలియ చెప్పాలి కదా?'

'చెప్పినా వినకపోతే ఏం చేయాలి? కడుపులో లేనిది కావలించుకుంటే వస్తుందా?'

'అమ్మా! ఏ సమస్య పరిష్కారానికైనా సామ బేధ దండోపాయలుంటాయి. మీకు తెలియదేమో తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత తీసుకోకుండా ఇలా అనాధాశ్రమాలు, రోడ్లపాలు చేస్తున్న పిల్లలను... కొడుకులు, కోడళ్ళు, కూతుళ్లను కూడా శిక్షించే చట్టాలు వచ్చాయి . ఇప్పుడు మీలాంటి చాలామంది తల్లిదండ్రులు కోర్టుకు వెళ్లడానికి కూడా వెనుకాడడం లేదు.'

'కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడుతుంది. కుటుంబం గుట్టు విప్పితే పరువు రట్టవుతుందని చాలామంది ఫిర్యాదు చేయడానికి వెనుకంజలోనే ఉన్నారన్న మాటా నిజమే కదా?'

'అయితే తప్పక మార్పు రావాలి తల్లిదండ్రుల్లోనూ, పిల్లల్లో కూడా. తమ బిడ్డలే కదా తమను చూసుకోక ఎలా ఉంటారన్న అలివిమాలిన నమ్మకంతో ముందు చూపు లేకుండా తమకున్నదంతా బిడ్డల కోసమే ఖర్చు పెట్టేసో, ఇచ్చేసో.. మలిదశలో వారి దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఎదురు చూడడం తప్పని.. ఇప్పటి పిల్లల ప్రవర్తన నిరూపిస్తోంది. ఆ ప్రవర్తనలో

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

మార్పు తెచ్చే చట్టాలు రావడం సంతోషం. ఆ చట్టాలను.. అవసరమైన తల్లిదండ్రులు ఉపయోగించుకోవటమూ ఆనందమే.

అయితే మనుషుల్లో మార్పు పరస్పర ప్రేమానురాగాలతోనే రావాలి కానీ చట్టాల వల్ల రాదని... శిక్షా భయంతో ఒకవేళ వచ్చినా అది మొక్కుబడిగానే ఉంటుందని నా భావన.'

'ఇంత బాగా పరిస్థితులను, మనుషులను అర్థం చేసుకున్నారు. మాట్లాడుతున్నారు. మీరేం చదువుకున్నారమ్మా'

'చదువు అంటే మీ దృష్టిలో డిగ్రీలతో కొలిచే కాగితాలు. నా దృష్టిలో జీవితం నేర్పే అనుభవ పాఠాలు.'

'బాగా చెప్పారమ్మా. మళ్లీ కలుద్దాం. నమస్తే!'

***

'నమస్తే అమ్మా ! బాగున్నారా ? నేను ఆరు నెలల క్రితం ఇక్కడ ఇంటర్వ్యూ చేశాను.. మా టీవీ ఛానల్ కోసం! మీరు కూడా మాట్లాడారు.'

'నమస్తే బాబూ! గుర్తొచ్చారు. బాగున్నారా?'

'బాగున్నానమ్మా. ఇదిగో ..ఈమె విదీష... నాకు కాబోయే భార్య. మరో పదిహేను రోజుల్లో మా పెళ్లి. మా పెళ్ళికి మీరు రావడమే కాదు మాకు కానుక కూడా ఇవ్వాలి.'

'కానుకా? ఆశీస్సులు తప్ప నేనేమీ ఇవ్వగలను బాబూ?' ఆమె రవ్వంత ఇబ్బందిగా, విచారంగా అంది.

'అవే.. మేము రోజూ పొందే అవకాశాన్ని ఇవ్వండమ్మా!' సుదీప్ చిరునవ్వుతో అన్నాడు.

'అంటే ?' ఆమె అర్థం కానట్లు అడిగింది.

'అంటే ....' సుదీప్ వివరంగా చెప్పాడు. అతను చెప్పింది విని ఆమె మొదట నమ్మలేదు. తర్వాత ఆశ్చర్యపోయింది. భయపడింది. 'నావల్ల మీకేం ఉపయోగ'మంటూ అభ్యంతరం చెప్పింది. విదీష వైపు అనుమానంగానూ చూసింది.

'అమ్మా!ఆ రోజు మీరో మాట అన్నారు గుర్తుందా? మనుషుల్లో మార్పు చట్టాల భయంతో కాక పరస్పర ప్రేమతో రావాలి అని. మనం చేసే ఈ పని వల్ల కొందరిలోనన్నా మార్పు రావచ్చేమో! మార్పుకు శ్రీకారమైన ఆలోచనా విత్తు పడొచ్చు కదా!. చిన్నప్పుడు "అమ్మ నాది ..అమ్మ నాది" అని పోట్లాడుకునే పిల్లలు ..పెద్దయ్యాక 'అమ్మను చూడటం నా వల్ల కాదు..' అని వంతులు, వాటాలు వేసుకునే స్వార్థపు ఆలోచనా దృక్పథం మారుతుందేమో చూద్దాం. మలి సంధ్య... మరో బాల్యంలా సంతోషంగా గడవాలన్న ఆకాంక్ష తప్ప మాకు మరేమీ స్వార్థం లేదమ్మా. నిదానంగా, ప్రశాంతంగా ఆలోచించండమ్మా' అని అన్నాడు సుదీప్.

ఇద్దరూ ఎంతో సేపు నచ్చ చెప్పాక, ఆశ్రమ పెద్దలు కూడా వివరించాక ... 'తనకు నచ్చకపోతే ఎప్పుడైనా తిరిగి వచ్చేయడానికి ఒప్పుకోవాలని, తనమీద హక్కులు ఏమి ఉండకూడదన్న' షరతుతో ఒప్పుకుందామె అయిష్టంగానే.

• • •

సుదీప్ విదీషల పెళ్లి నిరాడంబరంగా జరిగింది. రిజిస్టర్ పెళ్లి చేసుకున్నారు. పెళ్లితో పాటు "దత్తత" కూడా రిజిస్టర్ చేయబడింది. తమ తల్లిదండ్రుల వర్ధంతి రోజు అన్నదానం చేస్తూ తాను ఇంటర్వ్యూ చేసిన ...పిల్లలు వదిలేసిన ఒక తల్లిని దత్తత తీసుకున్నారు సుదీప్ విదీషలు. పిల్లలు లేని దంపతులు పిల్లలను దత్తత తీసుకున్నట్లే తల్లిదండ్రులు లేనివారు.. అనాథలుగా బతుకుతున్న తల్లిదండ్రులను దత్తత తీసుకొంటే ఇటు తమకు వారి ప్రేమ, అటు వాళ్ళకు చివరి దశలో ప్రశాంతంగా.. కుటుంబం, పిల్లలతో గడిపిన ఆనందం దక్కుతుందన్న సుదీప్ సదాశయము మెచ్చి అతన్ని పెళ్ళాడింది విదీష. తనకు పాదాభివందనం చేస్తున్న కొత్త దంపతులను మనసారా ఆశీర్వదించిందా అమ్మ. ✦

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

ఈవారం కథ



● మంత్రిప్రగడ శ్రీనివాసరావు


'నేను ఇప్పట్లో ఇండియా రాలేను. ఫుల్ బిజీగా ఉన్నాను. మీరే చూసుకోండన్నయ్యా!' ఇక అంతకన్నా చెప్పాల్సిందేమీ లేదన్నట్లు ఫోన్ చేసి చెప్పాడు రాఘవ.

'అది కాదురా రాఘవా! నాన్న సంవత్సరీకానికయినా రాకపోతే ఎలారా? ఒకసారి ఆలోచించు.!'

'లేదన్నయ్యా! అర్థం చేసుకో! కావాలంటే వీడియో కాల్‌లో అటెండ్ అవుతానులే!' అంటూ ఫోన్ కట్ చేశాడు రాఘవ.

మాధవరావు, సుమతి దంపతులకు ఇద్దరు కొడుకులు. పెద్ద కొడుకు రామారావు హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా స్థిరపడ్డాడు. చిన్న కొడుకు రాఘవ అమెరికాలో మాస్టర్స్ పూర్తి చేసుకుని, అక్కడే ఉద్యోగం చేస్తున్నాడు. ఇద్దరికీ పెళ్లిళ్లయి ఎవరికి వారు జీవిస్తున్నారు. తల్లి సుమతి పెద్ద కొడుకు రామారావు వద్దనే ఉంటుంది.

# ఆత్మబలం



మాధవరావు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ పొంది, అంతా సెటిల్ అయ్యారు అనుకుంటున్న తరుణంలో అనారోగ్యంతో సంవత్సరం క్రితం కాలం చేశాడు.

యాభై సంవత్సరాల పాటు ఏమాత్రం అరమరికలు లేకుండా, అన్యోన్యంగా జీవించిన తమ బంధం భౌతికంగా వీడటంతో ఆనాటి నుంచి కుమిలి కుమిలి రోదిస్తూనే ఉంది సుమతి.

అంత్యక్రియలు, కర్మకాండలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తే తన భర్త ఆత్మ శాంతిస్తుందని, ఆ విధంగానే శ్రాద్ధ కర్మలు నిర్వహించాలని కొడుకులను కోరింది సుమతి. పెద్ద కొడుకు రామారావు ఆచార వ్యవహారాలను అనుసరిస్తుంటాడు. కానీ చిన్న కొడుకు రాఘవ మాత్రం ఆస్తికులకు నాస్తికులకు మధ్యలో ఉండి, కొన్నింటిని అనుసరిస్తూ, కొన్నింటిని త్యజిస్తూ ఉండే స్వభావం. అదీగాక తన తండ్రి తనకేమీ చేయలేదనే కోపంతో ఉంటుంటాడు. అన్నను చూసుకున్నట్లుగా తనను చూసుకోలేదని బాధపడుతుంటాడు. మాధవరావు చనిపోయిన రోజు అన్న రామారావు బలవంతం మీద అమెరికా నుంచి వచ్చి చివరి చూపు చూసి, అంత్యక్రియల్లో పాల్గొని, వెంటనే వెళ్లిపోయాడు.

అంత్యక్రియల తర్వాత మాధవరావు కుటుంబ స్నేహితుడు నారాయణ శాస్త్రిగారితో మిగతా కర్మకాండల విషయమై చర్చించిన విషయాలు ఒక్కొక్కటిగా రామారావు మదిని తొలుస్తున్నాయి.

ప్రతి నెలా మాసికం పెడుతూ, శాస్త్రోక్తంగా సంవత్సరీకం వరకు జరపాలని అమ్మ కోరడంతో పాటు, శాస్త్రిగారు కూడా శాస్త్రం ప్రకారం నిర్వహించాలని కుటుంబ సభ్యులకు సూచించాడు. దీనికి అసహనానికి గురైన రాఘవ, 'శాస్త్రిగారూ! మళ్లీ ఇండియా నేను రాలేను. నన్ను ఇబ్బంది పెట్టకండి' అనడంతో

శాస్త్రిగారికి కోపం వచ్చి, 'చిన్నపిల్లోడిలా మాట్లాడకు రాఘవా! నాన్న ఎంత నిష్టాగరిష్ఠుడో అందరికీ తెలుసు. నాన్న ఆత్మ శాంతించాలంటే సంవత్సరం వరకు అన్ని తిథులూ పెట్టాల్సిందే. ఆ విధంగా చేయకపోతే మీ కుటుంబానికే అరిష్టం.' అని హెచ్చరించారు.

'భయపెట్టి నన్ను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారా? ఇక్కడ ఉన్నవాళ్లు చేస్తే చేసుకోండి.. నాకవసరం లేదు.' అని రాఘవ కరాఖండిగా చెప్పాడు.

'కర్మాధికారంతో పెద్దవాడు కర్మ చేస్తున్నప్పటికీ, ఒకే చోట అన్నదమ్ములిద్దరూ ఈ క్రతువును చేయాల్సిందే. అంతేకాదు ఏటి సూతకం కూడా ఉంటుంది. సంవత్సరం పాటు మరే శుభకార్యాలు చేపట్టకూడదు. పితరుల ఆత్మశాంతికి, కుటుంబ సభ్యుల అభివృద్ధికి తర్పణాలు విడవాల్సిందే రాఘవా!' హెచ్చరించాడు శాస్త్రిగారు.

'శాస్త్రిగారూ! ప్రతినెలా మాసికం, మధ్యలో వచ్చే తిథులు, ఇవన్నీ కాకుండా సంవత్సరానికి ఒకసారే పెట్టుకోవచ్చు కదా! మాకంతా టైం వేస్ట్. వ్యయ ప్రయాసలతో కూడినది. కాస్త ఆలోచించండి మా వైపు కూడా!' రాఘవ తనకు అనుకూలమైన సమాధానాన్ని తెప్పించుకునేందుకు ప్రయత్నించాడు.

'పురాణాల ప్రకారం అంత్యక్రియలు, కర్మ కాండలు మరణానంతరం జీవికి శాంతి చేకూర్చడమే కాక, కుటుంబ సభ్యుల శ్రేయస్సు, ధార్మిక సంప్రదాయాన్ని చాటుతాయి.


సంవత్సరం వరకు కూడా ఆత్మ కుటుంబ సభ్యుల మధ్యనే తిరుగుతూనే ఉంటుంది. విధిగా అన్ని తిథులలో శ్రాద్ధాలు పెట్టాల్సిందే. సంవత్సర దీక్ష తప్పదు.' అని శాస్త్రిగారు మరింత వక్కాణించడంతో, గుటకలు మింగిన రాఘవ..


'సరేలెండి! ఏం చేస్తాం!? నేను లేకపోయినా ప్రతినెలా అన్నయ్య ఇక్కడ ఏర్పాటు చేస్తాడు. నేను సంవత్సరీకానికి వస్తాను. వీలైతే ప్రతి నెలా నేనక్కడ పెట్టుకుంటాలేండి.' అసహనంగా చెప్పాడు రాఘవ.

'లేదు రాఘవ! అన్నదమ్ములిద్దరూ ఒకే చోట కలిసి చేయాల్సిందే. ఇది శాస్త్రమే కాదు. కలిసి మెలిసి ఉండే కుటుంబ ఐక్యత సూత్రం, మాసిక ధర్మాన్ని చాటుతుంది. నాన్నగారి ఆత్మశాంతికి ఆ మాత్రం సమయం కేటాయించలేవా..?' నిలదీస్తున్నట్లు ప్రశ్నించడంతో, చేసేది చేయొచ్చు ఈయనతో వాదనెందుకని మాట్లాడకుండా ఉండిపోయాడు రాఘవ.

కొత్తగా పెళ్లయిన తన తమ్ముడిని ఇబ్బంది పెట్టటం ఎందుకనుకుని..

'సరే రాఘవ! కనీసం నాన్నగారి సంవత్సరీకానికైనా తప్పనిసరిగా నువ్వు, వనజ వచ్చేయండి.' అన్నాడు. ముసిరిన జ్ఞాపకాల నుంచి బయటకు వచ్చాడు రామారావు. సంవత్సరీకానికైనా తమ్ముడొస్తే బాగుండు అనుకుంటూ, వచ్చే నెలలో వున్న నాన్న




సంవత్సరీకం ఏర్పాట్ల ఆలోచనలో నిమగ్నమయ్యాడు.

• • •

'ఏవండీ! మామగారి సంవత్సరీకం వచ్చేనెల ఉంది కదా! ఇండియా వెళ్దామండి.'

'నీకేమైనా పిచ్చా? ఇక్కడ బోలెడన్ని పనులున్నాయి. అదేదో వాళ్లే చేసుకుంటారు. ఏదో ఒక సాకు చెప్పొచ్చులే.' విసుగ్గా అన్నాడు రాఘవ.

'అదేంటండి అలా అంటారు? తండ్రికి శ్రాద్ధ కర్మలు పెట్టకపోతే, మనకు మంచిది కాదండి. ఫ్లీజ్ కొన్ని పాటించాలి. అయినా తండ్రి ఋణం తీర్చుకోవడం, ఆయన ఆత్మశాంతికి ఈ మాత్రం చేయడానికి వెనుకాడటం ఏమాత్రం బాగోలేదు.' వనజ గట్టిగానే అంది.

'వనజా...నీకేం తెలియదు ఊరుకో! నాకేం చేశాడని మా నాయన? అందరిలాగే చదువుకున్నాను. సొంతంగా కష్టపడి ఉద్యోగం తెచ్చుకున్నాను. అన్నయ్యను చూసినట్లు నన్నేమైనా చూశాడా? ఆ రోజు ఏదో ఒకటి చెప్పి, అక్కడి కార్యక్రమం వీడియో కాల్‌లో చూసి ఓ నమస్కారం పెట్టేద్దాం సరిపోతుంది. ఎటువంటి సంస్కారాలు చేయనవసరం లేదు. ఇక నన్ను విసిగించకు.' అంటూ అగ్గిమీద గుగ్గిలమయ్యాడు రాఘవ.

'జన్మనిచ్చి, పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులకు ఏంచేస్తే ఋణం తీరుతుంది? జీవించినంత కాలం సేవ చేయాలి. చనిపోయిన తర్వాత శ్రాద్ధకర్మలు పెట్టి వారి ఆత్మను శాంతింపచేయాలి.' అంటూ రాఘవను కన్విన్స్ చేయబోయింది వనజ.

'ఏమోలే! పనికిరాని టాపిక్. ఎట్టి పరిస్థితుల్లో నాన్న తిథికి తిరిగి ఇండియాకు వెళ్ళేది లేనేలేదు. ఉన్నాడుగా అన్న... ఆయన చూసుకుంటాడులే. ఇక దాని గురించి వదిలేయ్! అవునూ! నాన్న అంత్యక్రియలకు వెళ్లినప్పుడు హైదరాబాదులో ఒక విల్లా చూశాను కదా! దానికి అడ్వాన్స్ ఇవ్వాలి. ఈ వారం రోజుల్లో చెల్లిస్తాను.'

'అదేమిటండీ! మీకు మొన్ననే ఉద్యోగం కూడా పోయింది కదా, మళ్లీ ఇంకో ఉద్యోగం వచ్చేవరకు ఆగుదాం. పైగా మామగారు పోయి సంవత్సరం కూడా కాలేదు. సంవత్సరం లోపు ఎటువంటి శుభకార్యాలు చేయకూడదు కదా! ఇప్పుడు డబ్బు కట్టడం అంత శ్రేయస్కరం కాదు, ఆలోచించండి.' భర్తకు నచ్చచెప్పడానికి ప్రయత్నించింది వనజ.

'ఛత్! చాదస్తం మాటలు మాట్లాడకు. ఇవన్నీ ట్రాష్. మానసిక బలహీనతతో ఆడుకునే శాస్త్రాలు. వీటిని నమ్మను. సిద్ధాంతాలు, సంప్రదాయాలు, నమ్మకాలు, మూఢత్వాలతో ప్రాక్టికల్ లైఫ్‌కు అడ్డం చెప్పకు. ఇప్పటివరకు నేను దాచుకున్న డబ్బుతో వచ్చేవారం అడ్వాన్స్ చెల్లిస్తాను.' అంటూ ఒంటి కాలిపై లేచాడు రాఘవ. ఇక ఆ విషయం కొనసాగిస్తే భర్త సీరియస్ అవుతున్నాడని గ్రహించింది వనజ.

'సర్లేండి... రేపు ఆదివారం ఎక్కడికో వెళ్దామని చెప్పారు.' టాపిక్ మార్చడానికి ప్రయత్నం చేసింది వనజ.

'యస్. బాగా గుర్తు చేశావు. మనం రేపు పిక్నిక్‌కి వెళ్దామనుకున్నాము. కాస్త మనసన్నా రిలాక్స్‌డ్‌గా ఉంటుంది, వెళదాం.' ఉద్యోగం, సంవత్సరీకం ఈ రంధి నుంచి కాస్తంత ఉపశమనం కావాలనుకున్నాడు రాఘవ.

• • •

ఆరోజు ఆదివారం సమీపంలోని వాటర్ ఫాల్ సైట్ సీయింగ్‌కు వచ్చారు రాఘవ, వనజలు. వాటర్ ఫాల్స్ సమీపంలో ఓ నది ప్రవహిస్తోంది. అందులో పర్యాటకులు బోటింగ్ షికారు చేస్తున్నారు.

'ఏవండీ..! మనం కూడా బోటింగ్ చేద్దామండి.। గోముగా అడిగింది వనజ.

'వామ్మో! నాకు నీళ్లంటే భయం. ఆడపిల్లవైనా మీ నాన్న నీకు ఈత నేర్పాడు. మీ మామగారున్నారే- అదే- మా నాయన- మా ఊరి చెరువులో కొన్ని రోజులే సగం వరకే ఈత నేర్పారు. పూర్తిగా నేర్చుకోకముందే నుమోనియా రావడంతో, ఇక నేర్పలేకపోయాడు. దాంతో నాకు ఈత రాకుండా పోయింది. అందులో కూడా ఆయన వల్లే ఫెయిలయ్యాను.' అని గతాన్ని గుర్తు చేసుకుంటూ...

'వెళితే నువ్వు వెళ్ళు. నేను ఇక్క డే ఉంటాలే' అన్నాడు.

'అదేంటండి చోద్యం కాకపోతే! షికారు ఎవరైనా ఒక్కరే చేస్తారా? జంటగా వెళితేనే సరదా ఉంటుంది. అయినా ప్రతి ఒక్కరికి బెల్టు పెడతారు. భద్రంగానే ఉంటుంది. మగవారయుండి అంత భయపడితే ఎలా? పదండి పోదాం.' అనగానే తన ఇగో పనిచేసి, బోటింగ్‌కు సిద్ధమయ్యాడు రాఘవ.

బోట్‌లో నదిలో కొద్ది దూరం వెళ్లేసరికి ఒకచోట ప్రవాహం ఉద్ధృతమై, బోటులో చివర కూర్చున్న రాఘవ బెల్టు ఊడి అదుపు తప్పి నీళ్లలో పడిపోయాడు. పడీ పడగానే నీటిలో మునుగుతూ హాహాకారాలు చేస్తున్నాడు. భర్త ప్రమాదాన్ని గమనించిన వనజ వెంటనే నీటిలో దూకింది. కానీ ఇద్దరికీ పోను పోను చాలా దూరం పెరగడంతో, ఆమె రాఘవను అందుకోలేకపోతుంది. రాఘవ నీటిలో మునుగుతూ తేలుతూ, నీళ్లు మింగుతూ ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు.

కాకతాళీయంగా పైకి ఒక్కసారి ఆకాశం వైపు చూపు పడిన రాఘవకు నాన్న ఆకారం కనిపించినట్లయింది. ఆనాడు తమ ఊరి చెరువులో నాన్న ఈత నేర్పిన దృశ్యం గుర్తుకొచ్చింది. టైరు మధ్యలో తనను కట్టి ఈత ప్రాక్టీస్ చేయించిన దృశ్యం కళ్ళ ముందు కదలాడింది. పైనుంచి నాన్న...

'కమాన్ రాఘవా! కమాన్! అలాగే చేతులు, కాళ్లు ఆడించి పైకి తేలు... మునగకు... శరీరాన్ని తేలికగా చేసుకో... కాళ్లు చేతులు వేగంగా ఆడించు కమాన్... కమాన్... అలాగే... ఇంకా ముందుకు... ఇంకా ముందుకు... అంటున్నట్లుగా, ఉత్సాహపరుస్తూ, తనకు మరోసారి ఈత నేర్పుతున్నట్లుగా అనిపించి తన శక్తినంత కూడ తీసుకొని ఈత కొడుతూనే ఉన్నాడు రాఘవ.

'నీకు ఈత బాగా వచ్చు... బాగా ఈదుతున్నావు. వెరీ గుడ్... అలాగే వచ్చేయ్..! అలాగే...' అంటూ వెన్ను తడుతున్నట్లుగా నాన్న ఆత్మదర్శనంతో రాఘవ మరింత బలాన్ని కూడతీసుకొని చేతులు కాళ్లు వేగంగా కదిలిస్తూ, నీటిపై తెలియాడటం మొదలెట్టాడు. ఇంతలో ఎవరో ఒకరు బలంగా ఒక్క తోపు తోసినట్లు

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

అనిపించడంతో, ఒక్కసారిగా ఒడ్డు సమీపంలోని చిన్న చెట్టును అందుకోగలిగాడు. ఆ చెట్టు ఆసరాతో నెమ్మదిగా ఒడ్డుకు చేరుకున్నాడు రాఘవ. ఒడ్డుకు చేరిన రాఘవ అంత చల్లదనంలో కూడా చెమటలు కక్కుతూ, ప్రాణ భయంతో వణుకుతూ ఆయాసపడుతూ కూర్చున్నాడు. ఇంతలో వెనకనుంచి వచ్చి భర్తను పట్టుకున్న వనజకు దుఃఖం కట్టలు తెంచుకుంది.

లోపల నుంచి పీలగా వస్తున్నట్లుగా, జీర గొంతుతో, రొప్పుతూ...

'వనజా... వనజా..! నాన్న కనిపించాడు. ఆత్మదర్శనమైంది.' అంటూ తల పైకెత్తి చూపించాడు.

'నన్ను రక్షించింది... పునర్జన్మ నిచ్చింది నాన్నే వనజా..! ఆనాడు సగం నేర్పిన ఈత, ఈనాడు పైనుంచి పూర్తిగా నేర్పాడు. అంతేకాకుండా అదృశ్య శక్తిగా, నేను కొట్టుకుపోకుండా బలంగా ఒడ్డుకు నెట్టడంతో నేను బతికాను వనజా..!' అంటూ వల వల ఏడుస్తున్న భర్త వైపు లాలనగా చూసింది వనజ.

అంత బాధలోనూ ఆమె మోములో ఓ చిరుదరహాసం మెరిసింది. తల పైకెత్తి ఆకాశం వైపు చూస్తూ, 'మీ సంకల్పం గొప్పది మామగారు..! ఎవరితో ఏ పని చేయించాలో ఆ పని చేయించే ఆత్మబలం మీది. మీ కుమారుడిని కాపాడటానికి ఆత్మ శక్తిగా సగం మీరు పనిచేస్తే, వేగంగా డైవ్ చేసుకుంటూ నా భర్తను రక్షించుకునే మిగతా సగం బాధ్యతను నేను పూర్తి చేశాను. నేను చేసిన ఆ సగం మీ అదృశ్య శక్తిగా విశ్వసిస్తున్న నా భర్తకు, మీపై కలకాలం అదే గౌరవం, నమ్మకం ఉండే విధంగా, ఈ విషయాన్ని మనసులోనే దాచుకుంటాను మామగారు.' అంటూ వనజ చేతులెత్తి నమస్కరించింది.

●●●

'అన్నయ్యా..! నాన్న తిథికి నేనూ వనజ ఇద్దరం వచ్చేస్తున్నాం! అన్ని ఏర్పాట్లు ఘనంగా చేయండి..! టికెట్లు కూడా తీసుకున్నాం.' రామారావుకి ఫోన్ చేసి చెప్పాడు రాఘవ.

'వనజా..వనజా.' అంటూ గట్టిగా పిలిచాడు రాఘవ.

'ఏంటండీ..! ప్రతిదానికి హడావుడే... మీకు ఏదొచ్చినా తట్టుకోలేము. ఏంటో చెప్పండి.' అంటూ వంటింట్లో నుంచి వచ్చింది వనజ.

'ఏం లేదు వనజా! గత నెల నాకు లేఆఫ్‌లో ఉద్యోగం పోయిందిగా... ఈ రోజు మెయిల్ వచ్చింది వేరే కంపెనీలో మరింత ప్యాకేజ్‌తో పైస్థాయి ఉద్యోగం వచ్చింది.' అంటూ సంతోషంతో వనజను కౌగిలించుకుని ఉక్కిరిబిక్కిరి చేశాడు రాఘవ.

'ఓహ్! సూపర్... మంచి వార్త చెప్పారు. మీకు ఇంకోటి చెప్పడం మర్చిపోయాను. హైదరాబాదులో విల్లాకు అడ్వాన్స్ చెల్లించవద్దని మా అన్నయ్య ఫోన్ చేసి చెప్పాడు. అదేదో డబుల్ రిజిస్ట్రేషన్ వివాదంలో ఉందట.' వనజ చెప్పడంతో మరింత ఆనందంతో మరోసారి నాన్నను మనసులో తలచుకున్నాడు రాఘవ.

'యస్... వనజా..! సంవత్సరంలోపు శుభకార్యం మన చేత చేయించకుండా అడ్డుపడి, మనకు మేలు చేసింది మీ మామగారే. శాస్త్రాన్ని నమ్మకపోవడంతో చేయాల్సిన కర్మలు సరిగా చేయలేదేమో, అందుకే ఆ రోజున నాకు ఉద్యోగం పోయింది. నాన్న ఆత్మ దర్శనం కావడంతో, నాన్నపై విశ్వాసం పెరగడంతో, మళ్లీ పాత దానికన్నా పెద్ద ఉద్యోగం వచ్చింది. నిజంగా ఇది నాన్న ఇచ్చిన వరప్రసాదమే కదా వనజ!' అంటూ ఆత్మ సంతృప్తితో ఆనందాన్ని వ్యక్తం చేశాడు రాఘవ.

మంచి పరివర్తనతో తన భర్తలో వచ్చిన మార్పుకు వనజ లోలోన సంతోషించి, మామగారికి కృతజ్ఞతలు చెప్పుకుంది. మాధవరావు సంవత్సరీకానికి రాఘవ, వనజలు ఇండియా బయలుదేరారు.

●●●

ఇల్లు చేరీ చేరగానే అమ్మను పట్టుకొని, కుమిలి కుమిలి ఏడ్చాడు రాఘవ.

'నాన్నను తప్పుగా అర్థం చేసుకున్నానమ్మా! నాకు నాన్న ఆత్మ దర్శనమైంది.' అంటూ జరిగిందంతా చెప్పాడు. నేను మళ్ళీ బతికి నీ ముందున్నాను అంటే, నాన్న ఇచ్చిన పునర్జన్మేనమ్మా!' అంటున్న రాఘవను పొదివి పట్టుకుని ఓదార్చింది సుమతి.

'నీకు ఇంకో విషయం చెప్పనా రాఘవా! నాన్న విషయంలో ఇంకోటి కూడా పూర్తిగా అర్థం చేసుకోలేకపోయావు. నాన్న నీకు చెరువులో ఈత నేర్పుతున్న కాలంలో, నాన్నకు న్యుమోనియా వచ్చింది. దాంతో పూర్తిగా ఈత నేర్పలేకపోయాడు.

కాలం గడుస్తున్నా కొద్దీ, వ్యాధి ముదిరి ఊపిరితిత్తులు బాగా దెబ్బతిన్నాయి. ఆ పరిస్థితుల్లోనే నీ అమెరికా ప్రయాణం రావడంతో చికిత్సకు వెచ్చించాల్సిన డబ్బును నీ అమెరికా ప్రయాణానికి, చదువుకు పెట్టాడు. సరైన సమయంలో చికిత్స లేకపోవడంతో, వ్యాధి ముదిరి ప్రాణాంతకమైంది. ఒక రకంగా తన ప్రాణాన్ని నీ చదువు, ఉన్నతికి పణంగా పెట్టాడు.

అంతే కాదు రాఘవా..! నువ్వు అనుకున్నట్లు అన్నయ్యను ఎక్కువగా ఏమీ చూడలేదు. ఇంకా.. అన్నయ్యే నీకోసం త్యాగం చేశాడు తెలుసా..? మీ ఇద్దరికీ సమానంగా వచ్చిన వాటాలో, అన్నయ్యకు వచ్చిన ఎకరం పొలంలో సగం అమ్మి నీ చదువుల ఖర్చుకు పెట్టాడు. నీకు నాన్న, అన్నయ్యల పట్ల అపోహలు ఉండటంతో, ఇప్పటివరకు ఈ విషయాలు చెప్పలేకపోయాను. నీ అంతట నీవే పరివర్తన చెందావు కాబట్టి ఈ విషయాలు ఇప్పుడు చెప్పగలిగాను.' అమ్మ చెబుతున్న విషయాలు వింటున్న రాఘవ ఒక్కసారిగా నిలువెల్లా ద్రవించిపోయాడు. అంతలో అప్పుడే అటుగా వస్తున్న రామారావును పరుగు పరుగున వెళ్లి గాఢంగా హత్తుకున్నాడు.

'నన్ను మన్నించు అన్నయ్యా...! నన్ను క్షమించు నాన్నా..!' అంటూ పశ్చాత్తాపంతో కుంగిపోతూ గుక్కపట్టి ఏడుస్తుంటే, అమ్మ, అన్నయ్యలు మరింత ప్రేమ పూర్వకంగా అక్కున చేర్చుకుని ఓదార్చారు.

'ఇదే రాఘవా..! మన ఆత్మ బలం' అని రామారావు తమ్ముడిని ఆప్యాయంగా నిమిరాడు.

మాధవరావు సంవత్సరీకానికి కావలసిన ఏర్పాట్లను చర్చించటానికి అక్కడికి వచ్చిన నారాయణ శాస్త్రిని చూసిన రాఘవ కన్నీటిని ఆపుకోలేకుండానే

'శాస్త్రిగారూ...! నా మూర్ఖత్వానికి మన్నించండి.' అంటూ ఆయనకు సాష్టాంగ నమస్కారం చేశాడు. జరిగిందంతా తెలుసుకున్న నారాయణ శాస్త్రి 'మాధవా..నీ ఆత్మ సంకల్పం గొప్పది.' అనుకుంటూ మనసులోనే అభినందించాడు.

'కర్మణ్యే వాధికారస్తే, మా ఫలేషు కదాచనా... కర్తవ్యాన్ని చేయడమే నీ బాధ్యత, ఫలములపై ఎప్పుడూ హక్కు లేదు. ఇది నిష్కామ కర్మ సిద్ధాంతం రాఘవా!' అంటూ వేదాంత ధోరణిలో వివరించాడు నారాయణ శాస్త్రి. 'అంతేకాదు..! శాస్త్రం, శాస్త్రీయత, విశ్వాసం, సంప్రదాయం, ఆచార వ్యవహారాలు, విలువలు, కుటుంబ బంధాల మేళవింపే జీవిత సారం..! అదే మన ఆత్మబలం..!' అని సత్ జీవన విధాన బోధ చేసిన నారాయణ శాస్త్రికి వినమ్రంగా నమస్కరించారు అందరూ.

## కథాకళి FEED ME A STORY

**23.8.2026 ఫన్‌డేలో ప్రచురించిన 'బండ' కథకి పాఠకులు సూచించిన టాప్ 5 పేర్లు.**

మనది కానిది బరువే
**ఆదిత్యజానకి, ఆస్ట్రేలియా**

నిజాయితీ నిద్ర లేచింది
**రామనపూడి వీరభద్రరావు, చిక్కాల**

గుణ కుబేరుడు
**ఎస్.జనార్దన స్వామి, హైదరాబాద్**

మంచిని పెంచిన సంచి
**రమేష్ రెడ్డి మిన్నంరెడ్డి, పీలేరు**

ఒక దీపం వెలిగింది
**రఘువీర్, హైదరాబాద్**

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



**ఆ గదిలో చీకటిగా వుంది.**
**అదో రకం జిడ్డు వాసన.**
**నేలంతా బంక బంక.**

**ఆ గది గోడలు బూజుపట్టి కిల్లీల మరకల్తోటి మాసిపోయినట్టు మాడిపోయినట్టున్నాయి. ఓ వ్యక్తి పడుకునేంత సిమెంటు గద్దె.**

**మరో మూలకు సగం నీటితో నిండిన కుండ. దానిపై సగం పగిలిన మట్టి చిప్ప. దానిమీద రంగు వెలిసిన ప్లాస్టిక్ గ్లాసు. ఆ పక్కనే సొట్టలుపడ్డ రొటెండి పళ్లెం.**

పగలే దోమలు చెవి దగ్గర గుయ్‌మంటున్నాయి.

ఆ జైలు గది గోడల మధ్య రామకృష్ణకి శరీరంలో రక్తం ఉడుకుతోంది. కోపం బుసలు కొడుతుంది.

ముఖ్యంగా వాడు..



# జెర్రి



## ఒక అవినీతి కథ

• కె.వి. నరేందర్

సర్పంచ్ ఉమ్లానాయక్!

ఎంత మోసం.. ఎంతటి దగా..

నమ్మించి వెన్నుపోటు పొడిచాడు.

ఇల్లు.. భార్యాపిల్లలు.. గుర్తొచ్చారు.

సిమెంట్ గద్దెపై కూచొని మోకాళ్ల మధ్యలో తల ఆనించి గట్టిగా ఏడ్చాడు. ఆ ఏడ్పు విని పోలీస్‌స్టేషన్‌లో వున్న ఇద్దరు కానిస్టేబుల్లు పరిగెత్తుకొచ్చారు.

'బాయ్‌సాబ్.. ఏమైందీ..' ఒకాయన లాఠీతో జైలు ఊచల మీద టకటకా కొట్టాడు.

కన్నీళ్లతో తలపైకెత్తాడు రామకృష్ణ.

మసకమసకగా కన్పించారు పోలీసులు.

'ఈ ఏడ్పేదో లంచం తీస్కోంగా వుండాలే' రెండో కానిస్టేబుల్ అన్నాడు.

'ఎనభై వేలంటే మామూలు డబ్బేం కాదు. ఇప్పటివరకు ఎంత సంపాదించావేంటి?' వ్యంగ్యంగా అన్నాడు మొదటి కానిస్టేబుల్.

'ఇంకా నలభై రోజులుండాలె. అప్పటికి జైలుకూడు అలవాటు పడుతుందిలే'.

రామకృష్ణ కానిస్టేబుళ్ల కళ్లలోకి చూడలేకపోయాడు. అయినా తలొంచుకుని 'భయ్యా.. ఒకసారి మీ సెల్‌ఫోన్ ఇస్తారా.. ఇంటికి ఫోన్ చేసుకోవాలి' అన్నాడు.

'ఇస్తాంలే.. రోజూ పది నిమిషాలిస్తాం. రోజుకి అయిదు వందలైతయ్'. ఎలాంటి సిగ్గు, బిడియం లేకుండా అన్నారిద్దరూ.

ఒక కానిస్టేబుల్ మొబైల్‌ని కటకటాల్లోంచి రామకృష్ణ చేతికిచ్చాడు. అవతల్నుంచి భర్త మాట విని లావణ్య భోరున ఏడ్చింది. రామకృష్ణ కూడా ఏడ్చాడు. ఇద్దరి ఏడ్పుతోనే పది నిమిషాలు గడిచిపోయాయి. ఒక కానిస్టేబుల్ వచ్చి సెల్‌ఫోన్ లాక్కెళ్లాడు.. జైలర్ వస్తున్నాడని.

సెల్ దగ్గరికి జైలర్ వస్తూనే.. 'మీరిక్కడేం చేస్తున్నారయ్యా.. వాడితో కబుర్లు చెబుతున్నారా.. ఇట్లాంటి లంచగొండుల్ని పురుగుల్ని ఏరిపారేసినట్లు పారెయ్యాలి' గుర్రుగా చూస్తూ అన్నాడు.

కానిస్టేబుల్లు ఇద్దరూ భయపడినట్లు నటించారు.

అయనంటే జైల్లో అందరికీ హడల్. మళ్లీ రోజుకి వెయ్యి రూపాయల వరకూ ఇంటికి తీసికెళ్లకపోతే వాళ్ల ఆవిడ వీడికి అన్నం పెట్టదని కానిస్టేబుల్లందరికీ తెలుసు. రామకృష్ణని ఉద్దేశించినట్టుగా 'రంగరాజూ.. పాపం ఈయన జైలుకూడు తినేట్టు లేడు. పాపం రేపట్నించి వాళ్లావిడని ఇంటినించి లంచ్‌బాక్స్ పట్టుకు రమ్మని చెప్పు' అన్నాడు నవ్వుతూ.

'ఒకే సార్' రంగరాజు కానిస్టేబుల్ సెల్యూట్ చేసి చెప్పాడు.

బాక్స్‌కి అయిదు వందల చొప్పున తీసుకుంటాడు వెధవ.. మరో కానిస్టేబుల్ కనకయ్య మనసులో కసిగా అనుకున్నాడు.

వాళ్లు వెళ్లిపోయాక సిమెంట్ గద్దెమీద వెలికిలా పడుకున్నాడు రామకృష్ణ. ఒక్క రోజులోనే జీవితం ఎంత తలకిందులైపోయింది.

నిన్నటి రోజున పొద్దున్నే బ్రష్ చేసుకుంటున్నాడు. బోరగూడెం సర్పంచ్ ఉమ్లానాయక్ ఫోన్ చేశాడు.

'సార్.. ఆ స్కూల్ బిల్డింగ్ కట్టడానికి ఎనిమిది లక్షలు ఖర్చయ్యాయి. అంగన్‌వాడి బిల్డింగ్‌కి అయిదు లక్షలయ్యాయి. అందులో మూడు లక్షలు నా భార్య పుస్తెలతాడు అమ్మి తెచ్చాను. రెండు లక్షల రూపాయలు ఐదు పైసల మిత్తికి తెచ్చాను సార్'.

రామకృష్ణ ఫోన్ కట్ చేశాడు.

మళ్లీ రింగయింది.

ఈసారి కూడా ఫోనెత్తలేదు.

పావుగంట తర్వాత విసుక్కుంటూనే ఫోనెత్తాడు.

'పెళ్లాం పుస్తెలు నా కోసం అమ్ముతున్నావా.. లక్షకి ఇంతని కమీషన్ ఉంటుంది. పై ఆఫీసర్ గాడికి రెండు లక్షలు పోతాయి. సూపర్నెంటెకి యాభైవేలు ఇవ్వాలి. జూనియర్ అసిస్టెంట్‌కి ఇరవై వేలివ్వాలి. అటెండర్ చేతిలో అయిదు వందలైనా పెట్టాలి. అయినా పట్టుమని పది రూపాయలు లేనోడివి నీకెందుకురా ఈ సర్పంచ్ పదవి? హాయిగా ఇప్పపువ్వు అమ్ముకొని బతకక'.

'మా గూడెం జనాలకి ఇన్నేళ్లయినా ఒక బడిలేదన్న అసంతృప్తి వుంది. నేను కూడా సర్కార్ బడి శాంక్షన్ చేయిస్తేనే ఓట్లేయండి అని చెప్పి గెలిచాను సార్' చెప్పాడు ఉమ్లానాయక్.

'నువ్వెలా గెలిస్తే నాకేంట్రా, పెళ్లాం పుస్తెలమ్ముకున్నాను. నా కిడ్నీలమ్ముకున్నాను.. సొల్లు కబుర్లు చెప్పకు. కోట్లిచ్చినట్టు మాట్లాడుతున్నావ్, ఆర్నెల్ల కింద లక్ష రూపాయలిచ్చావ్. నెలకింద యాభై వేలిచ్చావు. ఇంకా ఎనభై వేలు ఇవ్వాలి. ఇంకా తగ్గించమంటే నా వల్ల కాదురా..' అన్నాడు రామకృష్ణ.

'సరే సార్.. బిల్స్ మీద సంతకాలు పెట్టి వుంచండి. అరగంటలో మీ దగ్గరుంటా' ఫోన్ పెట్టేశాడు ఉమ్లానాయక్.

'ఏమండీ కాఫీ తాగండి. చల్లారిపోయేటట్లుంది' భార్య లావణ్య హాల్లోకి వచ్చింది.

రామకృష్ణ ముసిముసిగా నవ్వుకొని కప్పు తీసుకొని 'ఆ లంబాడోడు ఇప్పటికి దారికొచ్చాడు. ఎనభై వేలివ్వడానికి చస్తున్నాడు' అన్నాడు.

'ఓ నెలకింద మనింటికి వచ్చాడే.. వాడే నా? వాన్ని చూస్తే కొంచెం డిఫరెంట్‌గా వున్నాడండీ. మన ఇంటిని కన్నార్పకుండా అలాగే చూస్తున్నాడు' అన్నది.

రామకృష్ణ పక్కనే కూచుంటూ లావణ్య మళ్లీ అంది.

'సరే కాని నిన్న రాత్రి ఆ జూబ్లిహిల్స్ సంబంధం వాళ్లు ఫోన్ చేశారు. ముత్యాల నెక్లెస్ పెడుతున్నారా లేదా అని. నేనైతే పెడతామనే చెప్పాను' అంది.

'రితిక ఈమధ్య ఇంటికి అర్ధరాత్రి వస్తోంది. గమనించావా అప్పుడప్పుడూ ఈ సెల్‌ఫోన్ చెక్ చేయి..' అని చెప్తుండగానే..

అప్పుడే ఉమ్లానాయక్ వచ్చి 'సార్' అని పిలిచి.. బ్యాగులోంచి ఎనభై వేలు రామకృష్ణ చేతిలో పెట్టాడు.

అంతలోనే ఆరుగురు వ్యక్తులు ఇంట్లోకి వేగంగా వచ్చారు. అందులో ఇద్దరు ఆడవాళ్లున్నారు. ఒకరు కదలకుండా రామకృష్ణని పట్టుకున్నారు. ఒకామె లావణ్య సెల్‌ఫోన్ లాక్కొని గట్టిగా పట్టుకుంది. పనివాళ్లని కదలకుండా కూచోమన్నారు.

రామకృష్ణ చేతిలో నోట్ల కట్టలు అలాగే వున్నాయి..

ఒకతను ఇంగ్లీష్‌లో చెప్పాడు. మేం యాంటీ కరప్షన్ బ్యూరో (ఏసీబీ) నుండి వచ్చాం. ఉన్నచోటు నించి ఎవరూ కదలొద్దు. మీ సెల్‌ఫోన్లన్నీ మాకిచ్చేయండి. ముగ్గురు పనిమనుషులు భయంభయంగా కూచున్నారు. ఒకాయన రామకృష్ణ చేతిలోని డబ్బు తీసుకొని.. అతడి చేతుల్ని నీళ్లతో కడిగాడు. పింక్ కలరొచ్చింది. లావణ్య, రితిక, పనివాళ్లు, రామకృష్ణ అంతా హతాశులయ్యారు.

అప్పుడే పదిహేను, ఇరవై మంది వరకు న్యూస్ పేపర్ రిపోర్టర్స్, టీవీవాళ్లు తోసుకుంటూ వచ్చారు. అంతా మైకులు పట్టుకొని వచ్చి ప్రశ్నల వర్షం కురిపించారు.

రామకృష్ణకి అంతా అయోమయంగా అనిపిస్తోంది. ఉమ్లానాయక్ చిరునవ్వులు నవ్వుతున్నాడు.

ఏసీబీ అధికారి ఒకరు ఇంట్లోనే ప్రెస్‌మీట్ పెట్టారు.

“ మీ పెద్దన్నయ్య ఇంటికి వచ్చి పెద్దగా గొడవపడ్డాడు. మీ చుట్టాలు, ఫ్రెండ్స్ అందరి ఇళ్లల్లోనూ సోదాలు చేశారట. మీ వల్ల మాకు ఒరిగింది ఏమీలేదు. మా ఇండ్లను ఎందుకు సోదా చెయ్యాలి, తల కొట్టేసినట్లయింది అని బాగా తిట్టిపోయాడు. చుట్టుపక్కల వున్న వాళ్లు కూడా నన్ను చూడగానే ముసిముసిగా నవ్వుకుంటున్నారు అంది ఏడుస్తూనే. ”

'ఇతను రామకృష్ణ. ప్రభుత్వ ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఉమ్లానాయక్ అనే సర్పంచ్ నుంచి ఎనభై వేల లంచం తీసుకుంటుంటే పట్టుకున్నాం. ఇతడి పేరుమీద ఎనిమిది కోట్ల విలువైన బంగళా, తొమ్మిది కార్లు, ఈ సిటీ శివార్లలో నూట ఇరవై కోట్ల విలువైన 40 ఎకరాల భూమి, భార్య పేరు మీద మూడు ఫ్లాట్స్, కూతురి పేరుమీద రెండు విల్లాలు, 150 తులాల బంగారు ఆభరణాలు, ఆదాయానికి మించిన ఆస్తులుండటంతో ఏకకాలంలో వారి బంధుమిత్రుల ఇళ్లపై కూడా దాడిచేస్తున్నాం'.

లావణ్య బుర్ర వేగంగా స్పందించింది.

ఇల్లుని జల్లెడ పడుతున్నారు.

వాళ్లింకా తమ మాస్టర్ బెడ్ రూంలోకి వెళ్లలేదు. ఆ లాకర్‌లో ఇంకా బంగారం వుంది. అదయినా దక్కించుకోవాలి.

'మేడమ్ టాయిలెట్' అంది.

ఆమె ఆఫీసర్‌ని చూసింది. అతడు పంపించు అన్నట్టుగా సైగచేశాడు. బెడ్ రూంలోకి వెళ్లి తలుపులేసుకుంది. ఏ శబ్దం రాకుండా బీరువా లాకర్ ఓపెన్ చేసి నగలన్నీ తీసుకుని బీరువా పక్కనున్న వాషింగ్ మిషన్‌లో విడిచిన బట్టల కింద దాచి మళ్లీ బాల్కనీలోకి వచ్చింది.

అప్పుడే టీవీల్లో బ్రేకింగ్స్ వస్తున్నాయి.

ఏసీబీ వలలో చిక్కిన తిమింగలం.

లంచం తీసుకుంటూ పట్టుబడిన అనకొండ.

రామకృష్ణని పింక్ వాటర్‌ని, పట్టుబడిన నోట్లని, బంగారాన్ని పదేపదే చూపిస్తున్నారు. అన్ని సోదాలు పూర్తయ్యాక వ్యాన్‌లో రామకృష్ణని చర్లపల్లె జైలుకి పంపించారు. టీవీల్లో చూస్తున్న బంధుమిత్రులంతా సంతోషంగా నోరెళ్లబెట్టి చూస్తున్నారు.

***

ఆ రాత్రి..

జైలులో దోమల్తో, వెగటుగా వస్తున్న వాసనతో రామకృష్ణకి నిద్రపట్టలేదు. మర్నాడు ఉదయాన్నే వచ్చిన లావణ్య కొంగు అడ్డంపెట్టుకుని ఏడ్చింది. కటకటాల వెనక నించి రామకృష్ణ కూడా ఏడ్చాడు.

అయిదు వందలిస్తేనే జైలు తలుపుల దగ్గర కూచున్న వ్యక్తి లోపలికి పంపించాడని చెప్పింది.

'మీ పెద్దన్నయ్య ఇంటికి వచ్చి పెద్దగా గొడవపడ్డాడు. మీ చుట్టాలు, ఫ్రెండ్స్ అందరి ఇళ్లల్లోనూ సోదాలు చేశారట. మీ వల్ల మాకు ఒరిగింది ఏమీలేదు. మా ఇండ్లను ఎందుకు సోదా చెయ్యాలి, తల కొట్టేసినట్లయింది అని బాగా తిట్టిపోయాడు. చుట్టుపక్కల వున్న వాళ్లు కూడా నన్ను చూడగానే ముసిముసిగా నవ్వుకుంటున్నారు' అంది ఏడుస్తూనే.

లావణ్య వచ్చినప్పుడల్లా సెల్ ఇచ్చిన పోలీసులకు, టిఫిన్ బాక్స్‌లు లోపలికి పంపిన జైలర్‌కు వేలకు వేలు సమర్పిస్తూనే వుంది.

రామకృష్ణ ఓరోజు సెల్ తీసుకుని భార్యకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా రింగయింది కానీ ఫోనెత్తలేదు.

అలా రెండు మూడు రోజులు జరిగింది.

రామకృష్ణకి భయం పట్టుకుంది.

ఎవరికేమై వుంటుంది? మనసేదో కీడు శంకించింది.

లావణ్యకి ఏమై వుంటుంది అని బెంగపడుతుంటే 4వ రోజు వచ్చింది. తల వెంట్రుకలు మాసిపోయి నిద్రలేక కళ్లకింద నల్లగా అయిపోయి.. పీక్కుపోయిన మొహంతో మాసిన చీరతో వుంది లావణ్య.

ఆమెను చూడగానే ఆందోళన.. ఆతృత ఎక్కువయ్యాయి. భర్తని చూడగానే లావణ్య భోరుమని ఏడ్చింది.

వెక్కిళ్ల మధ్య చెప్పింది.

'మనమ్మాయి.. మనమ్మాయి.. రితిక.. ఎవడినో ప్రేమించి, రిజిస్ట్రార్ ఆఫీసులో పెళ్లి చేసుకొని ఇంట్లోంచి వెళ్లిపోయింది'.

రామకృష్ణ బిత్తరపోయాడు.

'కులం, ఉద్యోగం, ఆస్తులు ఏమీలేని ఆ అబ్బాయిని చేసుకోకే అని నేనెంత కాళ్లావేళ్లా పడ్డా విన్లేదు..'

కటకటాల వెనక నించి లావణ్యని చెంపదెబ్బ కొట్టాడు రామకృష్ణ. లావణ్య బిత్తరపోయింది.

'నీకు వందలసార్లు చెప్పాను. అది రాత్రి ఇంటికి ఆలస్యంగా వస్తుందని ఆడపిల్లని కాపాడాల్సింది తల్లి బాధ్యత. నాలుగు గంటలకు కాలేజీ నుంచి రావాల్సిన అమ్మాయి రాత్రి పదింటికి వస్తుంటే తెలుసుకోవాల్సిన బాధ్యత తల్లిదే' అని కోపంగా అరిచాడు. లావణ్య పెనుదుఃఖంతో జైలు బయటికి వచ్చింది.

***

నలభై రోజులు.. నలభై రోజులు..

సర్పంచ్ ఉమ్లానాయక్ తన ముందు 'ఆత్మ'లాగా కన్పిస్తూ దీనంగా బతిమిలాడుతున్నాడు.

'సార్.. సార్ మాకు తీజ్ పండుగ మరో పది రోజుల్లో వస్తుంది. డబ్బులవసరం చాలా వుంది' అని. ఆ రోజు ఆఫీసుకి వచ్చి ఏడ్చినంత పనిచేసాడు. కానీ వాడొక్కడినే అడిగానా?

జాబ్‌లో జాయినయిన మూడో నెల నుంచే లంచాలు తీసుకున్నాను. వేరే డిపార్ట్‌మెంట్ వాళ్లని గమనించి.. ఏ పనికి ఎంత కమీషనో నిర్ణయించి 30 ఏళ్ల నుంచి తీసుకుంటున్నా. కానీ ఈ దారుణాన్ని ఎన్నడూ వూహించలేదు.

రామకృష్ణ ఆలోచనలు కందిరీగల్లా మెదడ్ని తొలుస్తున్నాయి. తనకు లంచాలిచ్చిన వాళ్లు వందలాది మంది కళ్లల్లో తిరుగుతున్నారు. ఇచ్చేటప్పుడు వాళ్ల కళ్లలోకి చూడాలనిపించకపోయేది. ఆడవాళ్ల దగ్గర తీసుకుంటున్నప్పుడైతే కన్నీళ్లు కన్పించేవి. తన మనసేం బండరాయి కాదు. పై ఆఫీసర్స్ నుంచి ఇంత పర్సంటేజ్ కావాలని ఒత్తిడి బాగా వుండేది. ఒక్కోసారి తీసుకోవటం పాపం అన్పించినా.. 'గాడిదలు లంచాలు తీసుకోవు' లాంటి కొలీగ్స్ మాటలు తన మనసుని కూడా బండరాయిలా మార్చాయి.

ఎసిబిలోనే లంచం తీసుకున్న అధికార్లు పట్టుబడ్డారు కదా. ఎసిబి ఆఫీసులో పనిచేసే ఒక సూపర్నెంట్ ముందుగానే ఏ ఆఫీసర్ మీద దాడి చేస్తున్నారో వారికి ఇన్ఫర్మేషన్ అందించి లక్షలు గుంజేవాడు. అలాంటి వాడింట్లో వెయ్యి కోట్లు దొరికాయి.

అంత డబ్బుని ఎక్కడ దాయాలో తెలియక పడుకునే పరుపుల్లోను.. చివరికి బాత్‌రూం పైపుల్లో దాచుకున్నాడు.

వారం పదిరోజులు గడిచాయి.

ఆ గది ఊడ్చేవాళ్లే లేరు. అంతా ముక్కిపోయిన వాసన.

“ లంచం అన్నది ఓ వెయ్యికాళ్ల జెర్రి సార్. మనమంతా దాని వీపు పైకెక్కి స్వారీ చేస్తున్నాం. జనాలు దాని కాలు నరుకుతున్నారు కానీ ఇంకా తొమ్మిది వందల తొంభై తొమ్మిది కాళ్లున్నాయి. నరకాల్సింది దాని కాళ్లను కాదు. దాని మెడ నరకాలి. ”

లావణ్య తప్ప.. ఒక్కరూ తనని చూడటానికి రాలేదు. తను ఆస్తి పెరిగాక గర్వంగా ఫీలయ్యాడు. అందర్నీ దూరం చేసుకున్నాడు. ఇప్పుడు దూరమైన బంధుమిత్రులు గుర్తొస్తున్నారు.

తను జైల్లోకి వచ్చిన ఈ ఇరవై రోజుల్లో ఎసిబికి చిక్కిన మరో ఆరుగురు వచ్చారట.

రామకృష్ణకి దేవుడే 'లంచావతారం' ఎత్తాడా అనిపించి నవ్వుకున్నాడు. అది చూసి ఓ కానిస్టేబుల్ 'ఏంట్సార్.. ముసిముసి నవ్వులు నవ్వుకుంటున్నారు.. ఇల్లాలు గుర్తొచ్చిందా..' అని అడిగాడు.

రామకృష్ణ నవ్వీ.. 'దేవుడు గుర్తొచ్చాడు' అని చెప్పాడు.

'దేవుడిని దశావతారాలుగా ఒక్కొక్కళ్లకీ ఒక్కో రూపం ఇచ్చినట్టు.. లంచావతారాన్ని కూడా గీయించి.. మన కరెన్సీ నోట్లపై ముద్రిస్తే బావుండేదని అన్పిస్తుంది..' కానిస్టేబుల్‌తో అన్నాడు.

జైలుకి వచ్చిన వాళ్లలో ఒక ఎస్సయి, ఒక జడ్జి కూడా వున్నాడని తెల్సుకుని ఈసారి బిగ్గరగా నవ్వాడు రామకృష్ణ.

ఇంకా బిగ్గరగా నవ్వుతూనే వున్నాడు.

***

రామకృష్ణకి నలభై రోజులు నలభై యుగాలుగా గడిచింది.

మిమ్మల్ని రేపు వదిలేస్తున్నాం అని చెప్పాడు ఓ పోలీసు.

అవమానంతో సిగ్గుతో బయటపడ్డాడు.

వాడలోళ్లు.. ఫ్రెండ్స్.. బంధువులు.. కొలీగ్స్.. వాళ్ల రియాక్షన్ ఎలా ఉంటుందోనన్న భయం.

తాను ఇంట్లో లేని సమయంలో రితిక పెళ్లి చేసుకుంది. దాని మొహం ఇంక చూడకూడదు.

నువ్వీ కేసునించి బయట పడాలంటే ఒక్కటే మార్గం. ఆ సర్పంచ్ ఇంటికెళ్లి నీ భార్యతో సహా వాడి కాళ్లమీద పడు. వాడ్ని కేసు వెనక్కి తీసుకోమని. పరామర్శించడానికి వచ్చిన ఓ మిత్రుడు సలహా ఇచ్చాడు.

మర్నాడే ఆ తండాకి వెళ్లాడు.

ఉమ్లానాయక్‌ది ఓ గుడిసె. రామకృష్ణ ఒక్కడే వెళ్లాడు. నాయక్ కాళ్ల మీద పడ్డాడు.

ఏడ్చాడు..

నన్ను క్షమించమని అడిగాడు.

ఉమ్లానాయక్ ఏమాత్రం చలించలేదు.

కుర్చీలోంచి లేవలేదు.

చివరికి 'నన్నేం చేయమంటావ్?' అనడిగాడు.

'కోర్టులో కేసు వాదనకొచ్చే రోజు నువ్వు అటెండ్ కావద్దు. ఇలా ఓ నాలుగు కేసుల వరకూ నువ్వు హాజర్ కాకపోతే చాలు. నీ అడ్వకేటుని నేను మేనేజ్ చేసుకుంటాను'.

'సరేకానీ.. ఒక షరతు.. కేసు పూర్తయ్యేవరకు నెలనెలా నాకు ఇరవై వేలివ్వు' అన్నాడు కఠినంగా.

రామకృష్ణ ఆలోచనలో పడ్డాడు.

'ఏంది ఆలోచిస్తున్నావు. ఇప్పుడు నువ్వు నిల్చున్నట్లు నీ ఇంటి ముందు కొన్ని వందలసార్లు నిలుచున్నాను' అన్నాడు కోపంగా.

'సరే. ఎల్లుండి ఫస్ట్ కదా. మీ ఇంటికి రావాలా. నువ్వే తెచ్చిస్తావా?' అన్నాడు మళ్లీ.

'నేను.. నేనే తెచ్చిస్తాను' అన్నాడు రామకృష్ణ.

అక్కడే వుంటే ఇంకా ఏమైనా అడుగుతాడేమోనని గూడెం నించి బయటపడ్డాడు.

***

ఇంటికి కూడా మునుపటిలా బంధుమిత్రులు ఎవరూ రావట్లేదు.

అన్నింటికన్నా తన కూతురు ఎక్కడుందో, ఎలా వుందోనన్న గుండె బెంగపడుతోంది. నిద్రలో ఉలిక్కిపడి లేచి కూచుంటున్నాడు.

ఏదో నిరాశ.

మరేదో భయం.

ఇంకేదో అలజడి.

లావణ్య పక్కనే ఉన్నా ఏదో ఒంటరితనం.

కూతురు పెళ్లి చేసుకున్నా.. తనని ఇంటికొచ్చాకనైనా కలుస్తుందని ఆశపడ్డాడు.

రీపోస్టింగ్ ఇస్తారో ఇవ్వరోనన్న అనుమానం.

అన్ని విషయాలు పిచ్చి లేపుతున్నాయి. ఓ కాంట్రాక్టర్ ఇచ్చిన ఫారిన్ విస్కీ తాగుతున్నాడు.

నెల రోజుల తర్వాత రీపోస్టింగ్ కోసం తమ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెడ్‌ని కలిశాడు. ఎవరూ అంతగా పట్టించుకోలేదు. ఒక మంత్రి లెటర్ తీసుకుని, ఒక ఎమ్మెల్యేని కూడా తీసుకుని వెళ్లి ఆఫీసు సూపర్నెంటుని కలిశాడు.

'నీకు తెలుసు కదా రామకృష్ణ. ఫైలంతా క్లియర్ చేయాలంటే ఆర్నెళ్ల వరకూ నీ శాలరీ నించి 30 పర్సెంట్ తెచ్చివ్వాలి. లేకుంటే ఆ మొత్తం ఒకేసారి ఇవ్వండి. నీక్కూడా భారం తగ్గుతుంది'.

'సార్ ఇప్పటికే కింది వాళ్లకు దాదాపు లక్ష వరకు ఇచ్చాను' అంటూ నసిగాడు.

“ ఇకనించీ లంచాలు తీసుకునే అధికారుల్ని ప్రభుత్వం సస్పెండ్ చేయదు. ఏకంగా ఉద్యోగంలోంచి తీసేందుకు అంటే జాబ్‌లోంచి డిస్మిస్ చేయాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. ఇదే వార్త పదేపదే వేయటంతో పాటుగా స్క్రోలింగ్ వేసి చూపెడుతున్నారు. ”

## రచయిత

కె.వి.నరేందర్ స్వస్థలం జగిత్యాల జిల్లాలోని చిల్వాకోడూర్ గ్రామం. కథా రచనలో అందె వేసిన చేయి. తెలంగాణ పల్లె జీవితాలను తన రచనల్లో బలంగా చిత్రించారు. సాహిత్య రంగంలోని బహు శాఖల్లో కూడా ఆయన కృషి కొనసాగింది. 13 కథా సంపుటాలు, 5 నవలలు, 4 నాటికలు, ఒక కవితా సంపుటి ప్రచురించారు. ఇటీవల రాసిన బర్రె నవల బాగా ప్రాచుర్యం పొందింది. ఆయన కొన్ని కథలు హిందీ, తమిళ భాషల్లోకి అనువాదమయ్యాయి. 35 వరకు ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలచే పురస్కారాలు అందుకున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి రిటైర్ అయ్యారు.



94404 02871

'తప్పదు రామకృష్ణ. ఈ మినిస్టర్స్ లెటర్స్.. ఎమ్మెల్యేలు.. ఎవరూ పనికిరారు..' ఎమ్మెల్యే ముందే సూపర్నెంట్ అన్నాడు కొంచెమైనా భయంలేకుండా.

ఎమ్మెల్యే అన్నాడు 'ఒక్కసారి ఇవ్వటమే మంచిది. కాకపోతే సార్ మంచి ప్లేసున్న చోటుకి పోస్టింగ్స్ ఇవ్వండి'.. కుర్చీలోంచి లేస్తూ అన్నాడు.

'రామకృష్ణ ఓకేనా! నాలుగు లక్షలిస్తే పనవుతుంది. నువ్వెప్పుడిస్తే అప్పుడే రీపోస్టింగ్' అని ఫైలులో తలదూర్చాడు.

***

రామకృష్ణలో ఏదో కసి.. అసహనం..

మరీ లక్షల్లోనే లంచాలు.

ఇప్పటివరకు ఖర్చయిన పది లక్షల రూపాయలు మళ్లీ సంపాదించాలి. మళ్లీ సంపాదించాలి. నిండా మునిగిన వాడికి చలెక్కడిది అనుకున్నాడు.

ఈ ఆఫీసులో అంత డబ్బు పంచుకునే ఆ నలుగురిని ఏసీబీకి పట్టిస్తే?? తన ఆలోచనకి తనే నవ్వుకున్నాడు.

అది కాదుగాని.. తనే సంపాదించుకోవాలి

నాలుగు లక్షలు కాదు కాదు.. నాలుగు కోట్లు సంపాదిస్తా అనుకున్నాడు.

పది రోజుల తర్వాత రీపోస్టింగ్ ఆర్డర్ తీసుకున్నాక.. ఆఫీసు వాళ్లు ఆ రాత్రి రామకృష్ణని పార్టీ అడిగారు. ఆ నైట్ పార్టీ ఖర్చు లక్షా ఇరవై ఆరు వేలు అయింది. పార్టీలో బాగా తాగాక అటెండర్ పరంధాములు అందరికీ మందు పోస్తూ ఒక ఉపదేశం చెప్పాడు.

'సార్.. రామకృష్ణ సార్ ఇంత పెద్ద పార్టీ ఎందుకిస్తున్నారు. పోయిన ఉద్యోగం మళ్లీ వచ్చిందని. మరి సారు ఉద్యోగం ఎందుకు పోయింది. లంచం..! అదో పదకొండవ అవతారం అయింది. లంచం అన్నది ఓ వెయ్యికాళ్ల జెర్రి సార్. మనమంతా దాని వీపు పైకెక్కి స్వారీ చేస్తున్నాం. జనాలు దాని కాలు నరుకుతున్నారు కానీ ఇంకా తొమ్మిది వందల తొంభై తొమ్మిది కాళ్లున్నాయి. నరకాల్సింది దాని కాళ్లను కాదు. దాని మెడ నరకాలి..

రామకృష్ణ గారూ! మీకు తెలియంది కాదు. రేపు అందరం బొందల గడ్డకు పోయేటోళ్లమే. ఇది తెలిసి కోటానుకోట్లు సంపాదిస్తాం. మనకు కనబడని ఇంకా పుట్టని ముని ముని మనవల కోసం. సంపాదించాలనుకోవడం ఎంత పచ్చి స్వార్థం.. వాళ్లెవరూ మనం కట్టిన ఇళ్లలో కనీసం మన ఫొటోలైనా గోడకి తగిలించరు సార్..'

'పరంధాములూ నీకు బాగా ఎక్కినట్టుంది. సోడా అందుకో' అన్నాడు ఒక అధికారి.

ఆ అధికారికి సోడా పోస్తూ.. 'మందు తాగాలి సార్. కానీ దానికి బాగా అలవాటు పడకూడదు సార్. డబ్బు సంపాదించాలి సార్. కానీ వ్యసనంగా మారకూడదు. మనందరం కూడా రేపోమాపో బలరామ నర్సయ్యో బలరామ నర్సయ్యో అని పాడుకుంటూ వెళ్లాల్సిందే కదా సార్'.

'ఒరే పరంధాములూ. నీతులు చెప్పకురా ఐసు పీసులు వెయ్యి' మరో అధికారి అన్నాడు.

పరంధాములు అవేవీ పట్టించుకోలేదు.

ఆ అధికారి కోపంగా సీసా భళ్లున పగలగొట్టాడు. ఆ శబ్దంతో అందరూ సైలెంటయ్యారు.

ఆ నిశ్శబ్దంలోనే.. టీవీలో వార్తలు చదువుతున్న యాంకర్ నోటినుంచి ఉద్యోగస్తులు అనే పదం వినిపించడంతో ఇంకా సైలెంటయిపోయి తలలు టీవీవైపు తిప్పారు.

టీవీలో యాంకర్ చెప్పేది విని ఒక్కసారిగా మత్తు దిగిపోయింది. మొహాలు నల్లబడ్డాయి. తాగటం మర్చిపోయారు.

పరంధాములు రిమోట్ తీసుకుని వాల్యూం పెంచాడు.

'ఇకనించీ లంచాలు తీసుకునే అధికారుల్ని ప్రభుత్వం సస్పెండ్ చేయదు. ఏకంగా ఉద్యోగంలోంచి తీసేందుకు అంటే జాబ్‌లోంచి డిస్మిస్ చేయాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది'. అదే వార్త పదేపదే వేయటంతో పాటుగా స్క్రోలింగ్ వేసి చూపెడుతున్నారు.

డిస్మిస్ అనే పదం విని అందరికీ చెమటలు పట్టాయి.

రామకృష్ణ ఇంకా వణికిపోయాడు.

రీపోస్టింగ్ ఆర్డర్లు ఎల్లుండి వస్తాయని చెప్పారు.

అప్పుడే ఫోన్ రింగయింది.

పేరు చూసి పక్కకి పడేశాడు.

మళ్లీ రింగయింది.

మళ్లీ మళ్లీ రింగవుతూనే వుంది. విసుగ్గా ఎత్తాడు.

అవతల్నుంచి 'అబేహో.. ఈ నెల్లో ఇరవైవేలు ఇంకా రాలేదు. నా నంబర్‌కి ఫోన్‌పే చెయ్యి' అన్నాడు సర్పంచ్ ఉమ్లానాయక్.

రామకృష్ణ బిగ్గరగా అరుస్తూ ఖరీదైన తన సెల్‌ఫోన్‌ని బయటికి విసిరేశాడు. 'ఏమైందీ?' అంతా ఒకేసారి అడిగారు.

'ఏముంది సార్. జెర్రి కాలు కాదు.. ప్రభుత్వం దాని తలకాయనే పగులగొట్టింది' నవ్వుతూ చెప్పాడు పరంధాములు.

బయట అప్పుడే భారీవర్షం మొదలైంది.

ఆ వర్షపు నీళ్లు అక్కడున్నందరికీ పింక్ కలర్‌లో కన్పడుతున్నాయి. ✽

## ఆధునిక మానవుడి ఆందోళనని ప్రతిఫలించిన చిత్రం

తెలుగుప్రభలో ఆగస్టు 23న ప్రచురించిన వాడ్రేవు చినవీరభద్రుడు గారి కథ ఫ్యూచర్ సిటీలో 'చరిత్ర పునరావృతమైంది. అవుతూ ఉంటుంది' అని ఒక మాట ఉంది. ఆ కథలో పునరావృతమౌతున్న మన చరిత్ర కళ్ళ ముందు కనిపించి, దిగులు మేఘం కమ్మేసింది. కళ్ళు చెమ్మగిల్లాయి. మనం ఆపలేని సునామి కళ్ళ ముందు కనిపిస్తూంటే సరే.. ఏదైతే అది కానీ అనే ఒక నిర్లిప్తత ఆవహించింది.



'ఫ్యూచర్ సిటీ' కథ చదివిన వెంటనే గుర్తొచ్చిన పెయింటింగ్ ఎడ్వర్డ్ మంచ్ చిత్రించిన The Scream. ఆధునిక మానవుడి ఆందోళన ఆ చిత్రం చూపించినంతగా మరేదీ చూపించలేకపోయిందని విమర్శకులంటారు. పురోగమనం ఎంత కోరుకున్నా కనీసం పాతికేళ్ల వెనక్కి అయినా వెళ్లగలమా అనిపిస్తుంది అప్పుడప్పుడు. మరి 130 ఏళ్లు వెనక కూడా, ఎడ్వర్డ్ మంచ్ లోపల్నుంచి అంతటి ఆక్రందన చిత్రంలోకి ప్రవహించిందంటే అతడి మనసులో ఏ తడి కల్లోల సముద్రమై పొంగిందో! ప్రపంచ మానవాళి అంతటినీ ఆ ఒక్క ఆకారంలోకి దింపి ఒక నిశ్చల చిత్రంలో వేదన విశ్వరూపాన్ని చూపించాడంటే ఎలాంటి ఆందోళన అతన్ని కుదిపేసిందో!

మనిషి ఆశపోతు మనస్తత్వం ప్రపంచపు వినాశనానికే దారితీస్తుందని తెలిసినా, దాదాపు 99 శాతం మనుషులు ఆశల వలయంలోనే పరిభ్రమిస్తూ ఉంటారు! సంతృప్తి అనే చిత్రం అంత అద్భుతంగా ఎవరైనా గీయగలిగితే బాగుండును. అలాగే గీసే పరిస్థితులు అధిక శాతం మనుషులకి అనుభూతిలోకి వస్తే బాగుండును. విచిత్రం ఏమిటంటే ఆ చిత్రం ఎన్నోసార్లు దొంగతనానికి గురవడం!! దానర్థం దుఃఖాన్ని కూడా సొంతం చేసుకోవాలనుకోవడం కాకపోతే ఏమిటి?? చినవీరభద్రుడుగారి కథ ఈనాటి The Scream. దీన్ని దొంగలించేవాళ్ళు కూడా ఉంటారు!

• వారణాసి నాగలక్ష్మి

ప్రతి ఆదివారం ఒక పూర్తి పేజీ కథ అందించాలనే మా నిర్ణయానికి మంచి స్పందన వస్తోంది. వస్తుపరంగా బలమైన కథలు అందించాలనుకున్న ఈ ప్రయత్నానికి కథకుల సహకారం అవసరం. అట్టడుగు వర్గాల నుంచి, అన్ని మూలల నుంచి కథలను ఆహ్వానిస్తున్నాం. అనువాద కథలు పంపేవారు మూల రచయితల అనుమతి తప్పక తీసుకోవాలి. కథ నిడివి 2000 పదాల వరకు ఉండవచ్చు. మెయిల్: kathateluguprabha@gmail.com –సంపాదకులు

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



# తెంపుకోలేని బంధం

కథ

మోచర్ల అనంత పద్మనాభరావు
98486 07127

'నేనింక చదవను టీచర్!'

రత్న వాట్సప్ మెసేజ్ చూసి మాధురి విస్తుపోయింది. 'ఇప్పుడు చదువు మానేసి ఏం చేద్దామని?' అసహనంగా తిరిగి మెసేజ్ చేసింది.

'నాకోసం నాన్న చాలా కష్టపడుతున్నాడు. నేనేదైనా ఉద్యోగంలో చేరి నాన్న కష్టం తగ్గిస్తాను.'

'నువ్వు పాసైంది పదోతరగతి మాత్రమే. నీకేం ఉద్యోగం వస్తుందనుకుంటున్నావు? నువ్వు చదువు మానేస్తే మీ నాన్న కష్టం తీరుతుందా? ఆటో తోలడం మానేస్తాడా? అసలు మీ నాన్న గురించి నీకేం తెల్సు? నా బిడ్డకు చదువు చెప్పు టీచర్! నీ కాల్మొక్కుతా అనేవాడు. నువ్వు బాగా చదువుకుని, పెద్ద నౌకరీ తెచ్చుకోవాలని ఆశిస్తున్నాడు. అందుకే నువ్వు చదువుకోవాలి.' రత్నకు హితబోధ చేసింది.

● ● ●

ఎవరి ప్రమేయం లేకుండా కాలం తన పని తను చేసుకుంటూ పోతుంది. రత్న ఇంటర్, డిగ్రీ ఫస్ట్ క్లాసులో పాసైంది. అవరోధాలను దాటుకుంటూ ఒక్కొక్క మెట్టు రత్న అధిగమిస్తూంటే, ఆమెను మొదటిసారి చూసిన సంగతి గుర్తుకొచ్చి మాధురి ఆలోచనలు గతంలోకి జారుకున్నాయి.

● ● ●

ఆటోలో నిద్రపోతున్న పిల్లను చూసి, 'యాదగిరి! ఎవరీ అమ్మాయి?' అడిగింది టీచర్ మాధురి.

'నా బిడ్డమ్మా. ఊకే మాయమ్మను సతాయిస్తుంటే ఆమె పేనం ఇసిగిపోయి నాతో తోడ్కపొమ్మంది. జర సివరగా అది కూసొంటాది. మరేమనుకోకు తల్లీ.'

'పర్లేదులే. ఏం పేరు?' అడిగింది. జవాబివ్వకుండా దిక్కులు చూస్తున్న ఆ పిల్లను మళ్ళీ అడిగింది.

'అది సెవిటిది టీచరమ్మ.' ఆటో స్టార్ట్ చేస్తూ అన్నాడు యాదగిరి.

'చెవిటిదా? పుట్టుక నుంచా?' ఆశ్చర్యపోతూ అంది.

'లేదమ్మా. గప్పుడు లుంబినీ పార్కులో బాంబులు పేలినాయి నీకెరుకనే గదా. ఆ దినాన నా పెండ్లాము, ఈ పిల్ల ఆడనే ఉన్నారు. ఒల్లంతా గాయాలతో, పేనాపాయ స్తితిలో ఇద్దరినీ పోలీసులు దవాకానలో సేర్పింద్రు. నా రాత బాలేక నా పెండ్లాం సనిపోయింది. సీకటైపోన బతుకులో నా కంటిదీపం నా బిడ్డ బతికితే సాలనుకున్నా. నెల దినాలపాటు దీన్ని దవాకానాలో వైద్దెం సేసాక బతికింది. గానీ, మెడలోనో, మెదడ్లోనో నాకెరుక లేదుగాని నరాలు దెబ్బతిని, దాని రెండు సెవులు ఇనిపించకుండా పోయినయి. ఇది సెవిటిదై పోయింది. అయిదు వరకు సదువుకుందని మల్లీ ఇస్కూలుకి పంపితే, తోటి పిల్లలు ''సెవిటిది...సెవిటిద'' ని గేలి సేస్తున్నారని ఇక పోనని మానేసింది. తర్వాత ఇంటికాడే పుత్తకాలట్టుకుని దేవుల్లాడుతాది. ఈమె మీద ఎన్నో ఆసెలు పెట్టుకున్నా. బాగా సదివింసాలి. పేద్ద నౌకరీ సంపాయించాలని అనుకున్నా. ఇట్టా జరిగినాక ఏంసేయ్యాలో పాలుపోతల్లె.' గోల్లుమన్నాడు. సీటు కింద దాచిన న్యూస్ పేపర్ ఆమెకు చూపిస్తూ తన కలను చెప్పాడు.

దానిలో వార్తను చూసి, 'నువ్వనుకుంటోంది కష్టమైన పనే. అసాధ్యం మాత్రం కాదు. రత్నకు చదవడం రాయడం వచ్చు, తనని నేను తీర్చిదిద్దుతాను, దిగులు పడకు. రత్న పేరు పెట్టినందుకు నీ బిడ్డ రత్నంలా రాణిస్తుంది. నీ కలను నిజం చేస్తుంది' అనునయంగా అంది మాధురి.

ఇప్పుడు యాదగిరి కలను రత్న నిజం చేసింది.

● ● ●

'టీచరమ్మా...! టీచరమ్మా...!' అన్న పిలుపుతో వర్తమానంలో కొచ్చింది మాధురి. ఎదురుగా కన్నీళ్ళతో నిల్చున్న యాదగిరిని చూసి, 'నీ కష్టం, కలలు ఫలించి రత్నకలక్టర్ అయ్యింది. మీ బస్తీలో అందరూ సంబరాలు చేసుకుంటున్నారు. ఈ సమయంలో ఆ కన్నీళ్ళేమిటి?'

'ఏం సెప్పనమ్మా! ఆమె లోపమే సేపంగా మారిందమ్మా.' ఓ కాగితాన్ని మాధురి చేతికిచ్చాడు. వినికిడి లోపమున్న రత్న అయ్యేయస్ హోదాకు అనర్హురాలని, ప్రత్యామ్నాయంగా వేరే ఉద్యోగానికి ఆమెను సెలెక్ట్ చేసినట్టు అధికార ఉత్తర్వును చదివి నివ్వెరపోయింది. న్యాయనిపుణులను సంప్రదించింది. సివిల్ సర్వీసెస్ నియమావళి, నిబంధనల ప్రకారం బధిరులకు అవకాశమియ్యాలన్న వారి సలహాతో రత్న చేత కమీషన్ కి విజ్ఞాపన పంపింది. ఆమె విజ్ఞాపనను అంగీకరించిన అధికారులు ఆమె లోప నివారణకున్న అవకాశాల కోసం వైద్య పరీక్షలకు ఆదేశించింది. రత్నకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్ ద్వారా కోక్లియర్ ఇంప్లాంట్ అమర్చి,ఆమె వినికిడి లోపాన్ని సరిదిద్దవచ్చని వైద్యులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. ఆ మాటకు కొండంత దిగులు, కొనగోటితో పోయినట్టు సంతోషించాడు యాదగిరి. ఆపరేషన్ కు ఎనిమిది లక్షలు ఖర్చు అవుతుందని విని దిగులుపడ్డాడు. అంత డబ్బును పోగుచేయడం తన శక్తికి మించిన పననుకున్నాడు. తరిగిపోయిన దిగులు కొండలా పెరిగి తనకో సవాలుని విసిరిందనుకున్నాడు. ఏదేమైనా ఎవరెస్ట్ ఎదురొచ్చినా ఢీ కొట్టడానికి నిశ్చయించుకున్నాడు. అంతేకాని రత్న శ్రమ మాత్రం కొండెక్కకూడదని అనుకున్నాడు. ఆటో అమ్మేశాడు. ఇల్లు తనఖా పెట్టాడు. దొరికనచోటల్లా అప్పు చేసాడు. డబ్బు పోగు చేయడానికి యాదగిరి పడిన కష్టం దేవుడికే తెల్సు. రత్న చెవి ఆపరేషన్ విజయవంతమయ్యింది. కోక్లియర్ ఇంప్లాంట్స్ తో ఆమెకు పాక్షికంగా వినికిడి శక్తి వచ్చింది. సంయమనంతో ఆమె చేసిన పోరాటం ఫలించింది. వినికిడి లోపాన్ని అధిగమించిన రత్నను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఐఎఎస్ అధికారిగా ప్రకటించారు.

● ● ●

'యాదగిరి నీ కష్టం గట్టెక్కింది. నీ బిడ్డ అయ్యేయస్ అయ్యింది. 'కృషితో నాస్తి దుర్భిక్షం' అని మీరిద్దరూ నిరూపించారు.' మాధురి ఆనందాన్ని వ్యక్తపరిచింది.

'ఇది కలా...! నిజమా...! తెల్వటలేదమ్మా. సంతోసం ఎక్కువై మతిలేనోడ్నయ్యాను. ఈ ఇజియం నిజంగా నాకే సెందుతుందా? మరి జనమనిస్సిన ఆ పిచ్చితల్లికి సెందదా?' ఆవేదనగా అన్నాడు.

'పిచ్చి తల్లా ? ఆమె ఎవరు?' ఆశ్చర్యపోతూ అడిగింది.

'అందరూ సంబురాలు సేసుకుంటున్న యేల రత్న కన్నతల్లిని యాది సేసుకోకపోతే అన్నేయం కదామ్మా. నీకో నిజం సెప్పనా, నా రత్నం నా కన్నబిడ్డ కాదమ్మా. ఆ రోజు... దిల్సుక్ నగర్ బస్టాండ్ కాడ ఉన్నానమ్మా. టైం రాత్రి తొమ్మిది. ఓ బస్సు వచ్చి ఆగింది. 'దిగు... జల్దీ... మేం ఎమ్జీబికి పోయి రిటర్న్ పోవాలా దిగమ్మా.' కండక్టర్ అరుస్తున్నాడు

మిగతా 16 లో

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# తెంపుకోలేని బంధం

4వ పేజీ తరువాయి

ఎవరి మీదో.

ఇంతలో 'అమ్మో...! ఆ..ఆ...! ఓలమ్మా...!' బాధతో అరుస్తూ గర్భంతో నున్న ఓ ఆడమనిషి బస్సు దిగడానికి రాక పోతోంది. సంకలో ఓ మూటట్టుకున్న ముసలమ్మ ఆమెకు సాయం సేస్తోంది. అక్కడ సేరినోల్లందరూ సోద్దెం సూస్తున్నారు. పురిటినొప్పులు కామోసు గుండెలదిరేలా అరుస్తోంది. ఎవరో తోసినట్టు బస్సు లోంచి పడిపోయిందా ఆడమనిషి. ఆమె సీర రగతంతో తడిసిపోయింది. అలా ఓ ఆడమనిషి నడి రోడ్డుమీద సోయ లేకుండా పడుంటే నిమ్మకు నీరెత్తినట్టు జనం సూస్తున్నారు. ఫోనుల్లో ఈడియోలు తీసేస్తున్నారు. నేనిక ఆగలేక ఆమెను ఎత్తి ఆటోలో పండుకోపెట్టినా. ఆ ముసలమ్మను కూడా తీస్కోని దవాకానాకి తోల్కుపోయా. ఎమర్జెన్సీలో అగుపడ్డ నర్సమ్మాతో, 'అమ్మా జర ఈమెను కాస్త సూడండమ్మా! నిండు గర్భిణీ, రగతం పోతోంది. జల్దీ సూడండమ్మా' అంటూ దేవుల్లాడా. నర్సమ్మ నాడి సూసి. 'చాలా బలహీనంగా, ప్రాణాపాయస్థితిలో ఉంది. డ్యూటీ డాక్టరమ్మ లేదంటూ ఓ సూది మందిచ్చింది. ఓ కాగితమిచ్చి, 'ఇది పూర్తిచేసి తెల్ల కార్డు, ఆధార్ కార్డు కాపీలు జత సేసి అక్కడివ్వు.' అంటూ కౌంటర్ ను సూపింది. నాకేం పాలు పోలా. ముసలమ్మ కోసరం సూసా. ఆమె అక్కడెక్కడా అగుపల్లా. బయటకు పోయి సూసాను. ఓ సెట్టుకింద మూటెట్టుకుని ఆమె నిదురోతోంది. ఆమెను తట్టి 'నీ బిడ్డను దవాకానాలో సేర్సుకోడానికి ఇవరాలు కావాలి. నీ రేషన్ కార్డు, ఆధార్ కార్డు ఇయ్యి.' అడిగాను.

"ఏమంటుండావ్...? అడుక్కునేటోదాన్ని నాకా పోరెవరో ఎట్లా తెలుస్తది."

'ఆమె నీ బిడ్డ కాదా? మరెవరు?' అన్నాను.

"అదో పిచ్చిది. మా వూల్లె ఉంటాది. దానికెవురూ నేరు. ఎవుడో అగాయిత్తెం సెసిండు. కడుపొచ్చింది. నొప్పులతో అరుత్తా వుంటే ఆడ దవకాన నేక బస్సెక్కిపించి ఈడకొచ్చా. కారుడులసుమంటివి నాకేడవి. లేవ్. దేవున్ని లెక్కన అగుబడ్డావ్. పాపం పిచ్చిముండ పొద్దుగాల్నుంచి యాస్తు పడ్తోంది. దాని పేనం కాపాడు బిడ్డా. నీ కాల్మొక్కుతా.' అన్నాది. ఆ మాటలకి బిత్తరపోయిన నేను ఎంటనే లోపలికురికాను. అక్కడ స్ట్రెచర్లేదు, అమ్మాయి నేదు. నర్సమ్మ కన్పడితే, "నర్సమ్మా.. ఆ అమ్మాయి?" నా గొంతు పెగల్లా.

'చచ్చి పోయింది. ఆమె బాడీ బయటుంది. ఇదిగో ఈ పసిగుడ్డు ఆమెకు పుట్టింది. ఫార్మాలిటీస్ పూర్తి చేసి ఆళ్ళను తీసుకుపోవాలి. ఆ గదికి పో. అక్కడ మా వాళ్ళుంటారు' అంది. గొంతులో దుక్కం. గుండెల్లో గుబులు. ఆ గది దిక్కెల్లాను. ఆల్లు అయిదేలడిగేరు బిడ్డను తల్లిని అప్పసెప్పడానికి. అంత సొమ్ము నాకాడ యాడుంది. ఇరవైయేళ్ళ ఈ ఆడమనిషి ఎవరికి పుట్టిందో, ఇక్కడో పసిగుడ్డుకి జన్మనిచ్చి తనమానాన తను తరలిపోయింది. ఋణానుబంధమంటే ఇదేనా? ఏ సంబంధంలేని తనకు తెంపుకోలేని బంధమై చుట్టుకుంది. యాడేడనో దేవుల్లాడి. దోస్తుల సాయంతో పోగుసేసిన ఐదేలిచ్చి పసిగుడ్డును తీసుకున్నా. చూడు టీచరమ్మ ఆడొ ముసల్ది సంబురాల్ని సూస్తా ఉండింది అది మాయమ్మ...! ఆరోజున ఈ పసిగుడ్డుని...అదేనమ్మ రత్నాన్ని ఇంటికి తోడ్కొనొచ్చి నా పెండ్లాం సేతిలో పెట్టి జరిగిందంతా సెప్పా. అపుడీ ముసిల్ది ఏమందో తెల్సా, ''ఒరి యాదిగా! నీకు పిల్లలు లేనంత మాత్రానా తల్లిని సంపి పుట్టిన ఇసుమంటి ముదనట్టపు పిల్లను తెస్సుకో కూడదరా. ఇదింకా ఎన్ని అనర్దాలు తెస్సిపెడుతుందో నీకు తెలీదు. నా మాటిని ఏడనుండి తెస్సినావో ఆడనే ఇడిసిరా. పో...'' అంది. ఇంకా కళ్ళు కూడా ఇడవని అనాథ పసిగుడ్డు ముదనట్టప్పిల్ల ఎట్టవుతుందని నేను, నా పెండ్లాం మా యమ్మ మాటినలేదు. కానీ, ఆ బాంబు పేలుళ్ళలో నా పెండ్లాం సనిపోయినపుడు ఇది ముదనట్టపుపిల్లే ననుకున్నానమ్మా. అసుమంటిది ఇయ్యాల రత్న కలకటేరయ్యిందని సంతోసిన్చలా, లేక ఆమెను కన్నతల్లి గాని, పెంచిన తల్లీ గాని లేదని దిగాలు పడాలో తెల్వటలేదమ్మా. ' అని తన జీవితంలో జరిగిన కథ అంతా యాదగిరి చెప్పాడు. 'నీకెటువంటి సంబంధం లేని ఓ అనాథబిడ్డను పెంచి ఇంత గొప్పదాన్ని చేసావు. ఈ బంధాన్ని ఏమంటారో నాకైతే తెలీదు.' ఆశ్చర్యంగా అంది మాధురి. 'ఈ పిల్ల వల్లనే నా పెండ్లాం సనిపోయిందని మా యమ్మ సెప్పినపుడు సత్తెమనిపించి దీన్ని ఇడిసిపెట్టాలనుకున్నా. కానీ, మెడకు సుట్టుకున్న బంధం కాల్ల కడ్డుపడి నన్నా పని సేయ్యనీలేదమ్మ. పేగులు కలవకపోయినా బందం కలిసిందమ్మా. అది తెంపుకోలేని బంధమేనమ్మా! పెంచుకున్న బిడ్డ రత్నమై. మా కంటిదీపమై, కలకటేరై బస్తీకే ఎలుగైంది. అసుమంటప్పుడు కల్లమట్ట నీరు రాకమానదమ్మ ?' యాదగిరి గొంతు దుఃఖాతిశయంతో వణికింది. తెంపుకోలేని మానవతా బంధానికి తెరచాపలా నిలిచిన యాదగిరి ఔన్నత్యానికి చేతులు జోడించి నమస్కరించింది మాధురి.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి





# అనుబంధం

కథ

చింతపట్ల సుదర్శన్
సెల్: 9299809212

నీటుగా తయారై నవ్వు ముఖంతో ఆఫీసుకు వచ్చిన బాసులా కనబడుతున్నాడు సూర్యుడు. గోల్నాకా బ్రిడ్జి దగ్గర చిన్న డబ్బా దుకాణం ఉంది. అవసరమైతే తప్ప దాన్ని ఎవడూ కంటితో చూడడు. ఎర్రటి ఎండలో ఖాళీ చెప్పు ఉంగరం ఊడిపోతేనో పట్టీ తెగిపోతేనో తప్ప ఎవరి కళ్లు దాన్ని వెతకవు.

పెద్ద అట్టపెట్టెలా ఉండే చిన్నషాపులో ఓ వైపు పది పదిహేను చెప్పుల జతలు మేకులకు వేలాడుతుంటాయి. మరోపక్క ఉర్దూలో రాసున్న అద్దాల ఫ్రేములు రెండు, వంకీకి వేలాడే చొక్కా, ముందు వైపు గోనె పట్టా కనిపిస్తయి. రింగులూడిన చెప్పులు అడుగులు చిరిగిన బూట్లు పక్కన రేకు డబ్బాలో తోలు ముక్కలు, మేకుల డబ్బా, సుత్తి, మైనం పూసిన దారం, కత్తి, జిగురు, పాలిష్ డబ్బాలు, బ్రష్, నీళ్లతొట్టి, చెప్పుల్ని సుత్తితో కొట్టి సరి చేసే దాగలి, మేకులు ఊడ తీసే ఆరె వెనుక చిన్న చెక్కస్టూలు మీద సాజిద్ కనిపిస్తాడు. ఎవరైనా చెప్పుల రిపేరు కోసం వస్తారని ఆశగా ఎదురు చూస్తుంటయి అతని కళ్లు.

దుకాణం వెనకవైపు నుంచి ముందుకు వచ్చాడు అచ్చయ్య. అచ్చయ్యని చూడగానే లోపలఉన్న మరో చిన్న స్టూల్ తెచ్చేశాడు సాజిద్. స్టూలు మీద కూర్చుంటూ...

'ఇవాళ గిరాకీ లేనట్టుంది' అన్నాడు అచ్చయ్య.

'ఇప్పుడే కదా అన్న దుక్నం తెరిచిన. నాష్త చేసినవా?' అనడిగాడు సాజిద్.

'ఏం నాష్తన్నా! చప్పటికూడు తినితిని నాలుక సచ్చిపోయింది'

'ఫికర్ చెయ్యకు. కౌసు కూరతోటి అన్నం తిందం ఇద్దరికి తెచ్చిన ఇయ్యాల' అన్నాడు సాజిద్.

'చికెనా, మటనా? ఏదయితేంది? పానం గుంజుతున్నది' అన్నాడు అచ్చయ్య నోరు చప్పరిస్తూ.

ఒక ఆడ మనిషి కాలు ఈడ్చుకుంటూ నడిచి వస్తున్నది చూసి, 'గిరాకీ వస్తున్నది' అన్నాడు సాజిద్.

'చెప్పు ఇడిచి చేతుల పట్టుకొని రావచ్చు కద ఎవరన్న చూస్తరనేమో' అని నవ్వింది అచ్చయ్య.

సాజిద్ ఆడమనిషి తెగిన చెప్పు కుట్టి దాగలి మీద సుత్తితోకొట్టి సరిచేసిఇచ్చి డబ్బులు తీసుకునే వరకు షాపులోఉన్న ఫోటో ఫ్రేముల వైపు చూస్తూ కూర్చున్నాడు అచ్చయ్య. ఆమె వెళ్లి పోయాక అడిగాడు 'ఆ ఫోటోల ఏం ఉన్నది?' అని.

'ఏముంటది బిస్మిల్లా, అల్హందులిల్లా అని ఉంటది అంతే! అల్లాదువా ఉంటేనే కద మనం బతికేది' అంటూ నవ్వాడు సాజిద్.

'అన్న ఉర్దుల ఏమో అంటున్నవ్ నాకేం అర్థమైతది' అన్నాడు అచ్చయ్య నుదురు కింద కనుబొమ్మలను ముడివేసి.

'నువ్వు ఇట్ల అంటవు గాని ఈ హైద్రబాదుల మా వాళ్లకు తెలుగు మాట్లాడ నీకె రాదు. నేనంటే పాలమూరు కాంచి వచ్చి ఈడ బతుకుతున్న. అందుకే తెలుగు మాట్లాడుత లేకపోతే నీకు నాకు దోస్తాన ఎట్ల అయితుండె' అన్నాడు సాజిద్ ఆరె తోటి రిపేర్‌కు వచ్చిన ఓ బూటు మేకులు ఊడదీస్తూ.

సాజిద్, అచ్చయ్యల స్నేహం వయసు నెల కూడా దాటలేదు. అచ్చయ్య హైదరాబాదులో గోల్నాక దగ్గర కొడుకు దగ్గరికి వచ్చి కూడా నెల దాటలేదు. వచ్చిన కొత్తలో కొడుకు కోడలు ఉద్యోగాలకు పోగానే ఒక్కడు ఇంట్లో కూర్చోలేకపోయేవాడు. ఊరు, ఇల్లు, ఇల్లాలు జ్ఞాపకం వచ్చేది. ఇంటి తాళాలు కోడలు దగ్గర ఒకటి, కొడుకు దగ్గర ఒకటి ఉండేవి. తను ఎప్పుడైనా అలా బయట తిరిగి రావాలని ఉందని కొడుకుతో చెప్పుకున్నాడు. జాగ్రత్త నాయన మన వీధి దాటిపోవద్దు నీకు ఇక్కడ ఏమీ తెల్వదు అంటూ తండ్రికి ఓ తాళంచెవి చేయించి ఇచ్చాడు కొడుకు. మొదట్లో ఇంటికి తాళం వేసి వీధి దాటడానికి ధైర్యం చేయని అచ్చయ్య క్రమంగా ధైర్యం తెచ్చుకొని రోడ్డుమీదికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్లే దారి గుర్తుపెట్టుకున్నాడు.

ఒకనాడు అలా రోడ్డంట తిరుగుతున్నప్పుడు తన కోడలు టీచర్‌గా పని చేసే స్కూలు కనిపించింది. స్కూలు ఎదురుగా నిలబడ్డ అచ్చయ్యకు తమ ఊరి నుంచి నాగర్ కర్నూలుకు నాలుగు మైళ్ల దూరం సైకిల్ మీద కొడుకుని స్కూల్‌కి తీసుకుపోయి తీసుకురావడం గుర్తొచ్చింది. వాడు తనలాగా చెట్టు కింద చెప్పులు కుట్టేవాడు కాకూడదు అని ఎంత కష్టపడ్డాడో.

పట్టణంలో పై చదువులు చదివించడానికి తనకున్న కొద్ది పొలాన్ని తెగ నమ్మడం గుర్తొచ్చింది. కళ్ళల్లో నీళ్లు నిండినయి. కష్టపడితే కష్టపడ్డాను కానీ వాడు బాగుపడ్డాడు తన కులవృత్తి తనతోనే ముగిసిపోతుంది. రాబోయే తరాల వారు బాగుపడతారు అని ఆనందపడుతూ అడుగులు వేగంగా వేస్తూ మెయిన్ రోడ్డు మీదకు వచ్చిన అచ్చయ్య దేనికోసమో వెతకసాగాడు. అచ్చయ్య కళ్ల ఎదుట తనకు ఇష్టమైన చోటు, తను చిన్నప్పుడు తండ్రి వెంట వెళ్లి పని నేర్చుకున్న చోటు కళ్ల ముందు కదలాడింది. తండ్రి పోయాక ఆయన కూచునే చెట్టు కింద కూర్చుని మొట్టమొదటిసారి కొడుకు బడికి పోవడానికి కుట్టిన చెప్పుల జత గుర్తుకొచ్చింది. వాడు కాలేజీకి వెళ్లే వరకు తను కుట్టిన చెప్పులే వేసుకునేవాడు అని ఆలోచిస్తున్న అచ్చయ్య కళ్లు మాత్రం దేనికోసమో వెతుకుతూనే ఉన్నాయి.

రోడ్డు ఈ చివర నుంచి ఆ చివరి దాకా తను వెతుకుతున్నది కనిపించక నిరాశ పడ్డాడు. తన పిచ్చిగాని అది ఈ సిటీలో ఎందుకు ఉంటది అని అనుకుంటున్న సమయంలో అచ్చయ్య కళ్లముందు మెరుపులా మెరిసిందది. ఎర్రటి ఎండలో దాహంతో తపించిపోతున్న వాడికి మంచి నీళ్లు అందించే చలివేంద్రంలా కనిపించింది. ఎన్నో ఏళ్లుగా కనిపించకుండా పోయిన ఆప్తమిత్రుడు ఎదురుగా వచ్చి కౌగిలించుకోవడానికి చేతులు చాచినట్టు అనిపించింది. రోడ్డుమీద కరెంటు స్తంభం చాటున నిలబడి దాని వైపే తదేకంగా చూస్తూ నిలబడిపోయాడు. తను తయారు చేసిన చెప్పులకి రంగు వేస్తున్న సాజిద్ ఎందుకో తలెత్తి చూస్తే స్తంభం దగ్గర కనిపించాడు అచ్చయ్య. 'దగ్గరికి రా' అన్నట్టు చేయి ఊపాడు. తన ముందుకు వచ్చి నిలబడ్డ అచ్చయ్యను పరీక్షగా చూస్తూ.

'ఎవరు నువ్వు? ఏం కావాలె? చెప్పు గిట్ల తెగిందా తే కుట్టిస్తా' అసలే హైదరాబాదు ఆపైన కొత్త మనిషితో మాట. భయము, సిగ్గు ముంచెత్తినవి అచ్చయ్యని.

'మాది నాగర్ కర్నూల్ కాడ పల్లెటూరు నాగనూలంటరు. ఈడ మా కొడుకు కోడలు ఉంటరు. రా రమ్మని కొడుకు పోరు పెడితె వచ్చిన. నా పెండ్లం సచ్చి యాడాది దాటిపాయె. ఒక్కనివి ఊర్లఎందుకు ఉంటవు అంటే వచ్చిన' అంటూ బళ్లో పిల్లాడు పాఠం ఒప్ప చెప్పినట్టు చెప్పాడు.

'మొత్తం కతంత చెప్పబడ్తివి. మల్ల ఈడ ఎందుకు నిలబడ్డవ్?' అన్నాడు సాజిద్.

'నా చెప్పేం తెగలేదు. బాగనే ఉన్నది. నేను కూడ ఊర్ల చెప్పులు కుడుతుండె. నువ్వు కూడ నా లెక్కనే చెప్పులు కుడుతుంటె చూస్తున్న''

సాటి వృత్తి చేసేవాడు అంటే అభిమానం అనిపించిందేమో రారమ్మని పిలిచి అచ్చయ్యను

(మిగతా 5వ పేజీలో)

'నేను మా ఊరు పోతున్న!'

సాజిద్‌కు విషయం అర్థమైంది. జేబులో నుంచి కొంత డబ్బు తీసి అచ్చయ్య చేతిలో పెట్టాడు.

'ఊరికి పోయి ఏం చేస్తావ్? ఒక్కనివే ఎట్లుంటవు?'

'ఇన్ని దినాల సంది లేనా? చెప్పలు కుట్టే పని మాత్రం వదిలేది లేదు. అది మా నాయన నాకు నేర్పిండు. నా కొడుకు చదువుకున్నడు. వాన్ని చేయమని అడగను, కానీ నేను చేయకుండ బతకలేను' అంటూ కన్నీళ్లు అరచేత్తో తుడుచుకుంటూ సాజిద్‌ని కౌగలించుకున్నాడు. అచ్చయ్య భుజంమీది నుంచి పైకి చూసిన సాజిద్‌కు అచ్చయ్య కోడలు కొడుకు షాపు వైపు వస్తూ కనిపించారు.

'భాయ్ నీ కొడుకు కూడా వస్తున్నాడు. నీకు నాకు తిట్లు తప్పవు. దోస్తీ చేసినప్పుడు అన్ని మొయ్యాల్సిందే. ఏం మాట్లాడకుండా ఉండు. ఈడికి ఇగ రానని, చెప్పలు కుట్టే పని చేయను అని ఒట్టు పెట్టుకో అంతే!' అన్నాడు సాజిద్.

కొడుకు కోడలు వస్తున్నారన్నమాట వినీ వినగానే ఒక ఉదుటున సాజిద్‌ను విడిపించుకుని నేను ఇంక సచ్చినా బతికినా నా ఊర్లనే, నా పని చేసుకుంటనే అనుకుంటూ రోడ్డుకు అడ్డంగా పరిగెత్తాడు అచ్చయ్య. ఎక్కడినుంచి వచ్చిందో ఓ లారీ వేగంగా వచ్చి అచ్చయ్యని గుద్ది గాల్లోకి లేపి కింద పడేసింది.

ఉరుకులు పరుగులుగా వచ్చి జనం మూగారు. రోడ్డుమీద అచ్చయ్య నెత్తురు గోనెపట్టాలా వెడల్పుగా పరుచుకుంది.



# అనుబంధం

(కథ-4వ పేజీ తరువాయి)

స్టూల్ మీద కూర్చోమన్నాడు సాజిద్. అలా మొదలైంది కులమతాలకు అతీతమైన వాళ్ల స్నేహం. అచ్చయ్యకు ప్రతిరోజు షాప్‌కి వెళ్లడం సాయంత్రం దాకా ఉండి రావడం అలవాటయింది. అప్పుడప్పుడు అచ్చయ్యకు కూడా చెప్పులు కుట్టడం, కొత్తవి తయారు చేయడంలో సాజిద్‌కు సాయపడటం, తనకి ఇష్టమైన తను ఏళ్ల నుంచీచేస్తూ వచ్చిన వృత్తిని కొనసాగించడం సంతోషం కలిగించేది.

× × ×

తన కింద పని చేసే వాళ్లపట్ల చిరాకు, కోపము ఎక్కువైన బాసులా మండిపడుతున్నాడు సూర్యుడు. ఎండ చురుక్కుమంటున్నది. లోపలికి వచ్చేయమని వెనకవైపు ఉన్న పరదాచాటుకు అచ్చయ్యను పిలిచాడు సాజిద్. ఇద్దరూ కలిసి భోజనం చేశారు. చాలా రోజుల తర్వాత తనకి ఇష్టమైన భోజనం తినడంతో తృప్తిపడ్డాడు అచ్చయ్య. కొడుకు ఓ పెద్ద కులం అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడని ఆ సంగతి తమకు చాలా రోజుల తర్వాత గాని తెలియలేదని, ఆమె ఇంట్లో మాంసం వండనీయదని సాజిద్‌కు చెప్పాడు అచ్చయ్య. భోజనం అయినాక బయటకు వచ్చిన సాజిదును కాసేపు పడుకోమని తను షాపు



చూసుకుంటానన్నాడు.

సాజిద్ గుర్రు కొడుతూ నిద్ర పోతుంటే, పగటి నిద్ర అలవాటు లేని అచ్చయ్య రోడ్డు వైపు చూస్తూ కూర్చున్నాడు. ఈ రోడ్డుమీద కుడివైపు గల్లీలో కోడలు పనిచేసే స్కూలు ఉంది. ఆమె ఇంటికి వచ్చేలోపు ఇంటికి వెళ్లిపోవాలని, పొరపాటున కూడా ఆమె కంట పడకూడదని, తన భర్త తండ్రి చెప్పులు కుట్టేవాడని ఆమెకు తెలియకూడదని అనుకునేవాడు.

ఆరోజు ఎందుకో స్కూలు తొందరగా వదిలినట్టున్నారు. పిల్లలు రోడ్డంట వెళ్తున్నారు. తన ఊరు, ఊరి బయట తను చెప్పులు కుట్టే చోటు, చివరి క్షణాల్లో తన భార్య రూపం గుర్తుకు వచ్చి నీళ్లు నిండిన కళ్లతో ఏదో ఆలోచిస్తున్న అచ్చయ్య ఉలిక్కిపడ్డాడు. టీచర్లు రాకముందే సాజిద్‌ని నిద్రలేపి అక్కడనుంచి వెళ్లిపోవాలని అనుకుంటుంటే దాదాపు అతన్ని తాకుతూ నేల మీద పడింది ఒక చెప్పు. దాని ఉంగరం ఊడిపోయింది. ఏం చేయాలో అర్థమైంది. చెప్పు అందుకుని సూదిలోకి దారంఎక్కించి ఉంగరం కుట్టాడు. చెప్పులో నుంచి పైకి లేచి గుచ్చుకునేలా ఉన్న మొలుకుల్ని దాగలి మీద ఉంచి సుత్తితో కొట్టి సరిచేశాడు. తను పనిచేస్తున్నంత సేపు ఫోన్ చూస్తున్న ఆమెను తలెత్తి చూశాడు. అచ్చయ్య గుండె దడదడమంది. కళ్లు చీకట్లు కమ్మేయి. చటుకున్న తలవంచుకొని చెప్పులు ఆమె ముందు పెట్టాడు. ఆమె పర్సులో నుంచి పదినోటు తీసి అచ్చయ్య మీదకు విసిరేసి చెప్పు తొడుక్కుని వెళ్లిపోయింది. సాజిద్ నిద్ర లేచాడు. 'ఎవరైనా వచ్చింఁద్రా' అని అడిగాడు. ఒక్కలు వచ్చిన్రు అని పది నోటు గోనెపట్టాకింద పెట్టి అచ్చయ్య 'నేను పోతా' అంటూ లేచాడు అచ్చయ్య. 'అదేంటీ స్కూల్ విడిచిపెట్టనే లేదు' అన్నాడు సాజిద్.

'ఇయాల బడిఎందుకో ముందే మూసినట్టుంఁద్రు ఒక ఆమెకు చెప్పుకుట్టిన, ఆమె మా కోడలు' అన్నాడు అచ్చయ్య దిగులు పడుతూ.

'అవునా! నిన్నుచూసి ఏమనలే'

'ఏమో చూడనట్టే అనిపించింది. ఫోన్ చూస్తుండె ఇంటికి పోతే గాని ఎరుక కాదు'

'చూడకుండొచ్చు. అందుకే ఏమనలే' అని సమాధానపరిచాడు సాజిద్. కాళ్లు చేతులు



వణుకుతుంటే గుండె లబ్‌డబ్ చప్పుడు చేస్తుంటే ఇంటి తలుపు ముందు తటపటాయిస్తూ నిలబడ్డాడు అచ్చయ్య. తన దగ్గర ఉన్న తాళంచెవితో కోడలు ఇంట్లోకి వెళ్లినట్టుంది. లోపలి నుంచి కొడుకు మాటలు వినబడ్డాయి.

'చూస్తే చూశావుకానీ ఆ ప్రసక్తితేకు ఆయన బాధపడతాడు అయినా నీకు ఈసంగతి తెలిసిందే కదా'

'తెలుసు మహానుభావా! తెలుసు మీ నాన్న ఏం చేసేవాడో నాకు తెలుసు. కానీ అది మీ ఊర్లో. ఇక్కడ చెప్పుల దుకాణంలో చూసి నా తల ఎక్కడ పెట్టుకోవాలో అర్థం కాలేదు. స్కూల్లో ఈ విషయం తెలిస్తే నా పరిస్థితి ఏమిటి?' అని అరిచింది కోడలు.

'అర్థం చేసుకో! ఆయన ఎన్నో ఏళ్లు చేసిన పని కదా అందుకే ఆ షాపు వాడితో ఫ్రెండ్షిప్ కుదిరిందేమో!'

'అదేం కుదరదు. మన పరువు పోతుంది. మనిద్దరం కలిసి ఉండాలంటే మీ నాన్న ఇక్కడ ఉండడానికి వీల్లేదు.' ఈసారి ఆమె అరుపు వీధిలోకి కూడా వినిపించింది.

'అంటే నీకోసం మానాన్నని వదులుకోవాలా?'

'నేను వదులుకోలేదా? మా కులం, సంప్రదాయం, తల్లి తండ్రి బంధువులు, అందర్నీ వదులుకోలేదా? ఒక్కళ్లన్నా వచ్చి తొంగిచూస్తారా?'

'అది వాళ్లఇష్టం. వస్తే రావద్దని నేను అనలేదే. నాన్నకు మనం తప్ప ఎవరున్నారు చెప్పు. కోపం తగ్గించుకొని శాంతంగా ఆలోచించు.'

'నో! నావల్ల కాదు మీ నాన్న ఆ షాప్‌కి వెళ్లకుండా ఆపగలవా? నలుగురు నవ్వకుండా ఆపగలవా? నేను శాంతంగానే చెప్తున్నా ఆయనని పంపించేయ్'

ఇంట్లోకి అడుగుపెట్టలేకపోయాడు అచ్చయ్య. గాలి వాటానికి కొట్టుకుపోతున్న గాలిపటంలా వచ్చి సాజిద్ ముందు నిలబడ్డాడు.

'నేను మా ఊరు పోతున్న!'

సాజిద్‌కు విషయం అర్థమైంది. జేబులో నుంచి కొంత డబ్బు తీసి అచ్చయ్య చేతిలో పెట్టాడు.

'ఊరికి పోయి ఏం చేస్తావ్? ఒక్కనివే ఎట్లుంటవు?'

'ఇన్ని దినాల సంది లేనా? చెప్పులు కుట్టే పని మాత్రం వదిలేది లేదు. అది మా నాయన నాకు నేర్పిండు. నా కొడుకు చదువుకున్నడు. వాన్ని చేయమని అడగను, కానీ నేను చేయకుండ బతకలేను' అంటూ కన్నీళ్లు అరచేత్తో తుడుచుకుంటూ సాజిద్‌ని కౌగలించుకున్నాడు. అచ్చయ్య భుజంమీది నుంచి పైకి చూసిన సాజీద్‌కు అచ్చయ్య కోడలు కొడుకు షాపు వైపు వస్తూ కనిపించారు.

'భాయ్ నీ కొడుకు కూడా వస్తున్నాడు. నీకు నాకు తిట్లు తప్పవు. దోస్తీ చేసినప్పుడు అన్ని మొయ్యాల్సిందే. ఏం మాట్లాడకుండా ఉండు. ఈడికి ఇగ రానని, చెప్పులు కుట్టే పని చేయను అని ఒట్టు పెట్టుకో అంతే!' అన్నాడు సాజిద్.

కొడుకు కోడలు వస్తున్నారన్నమాట వినీ వినగానే ఒక ఉదుటున సాజిద్‌ను విడిపించుకుని నేను ఇంక సచ్చినా బతికినా నా ఊర్లనే, నా పని చేసుకుంటనే అనుకుంటూ రోడ్డుకు అడ్డంగా పరిగెత్తాడు అచ్చయ్య. ఎక్కడినుంచి వచ్చిందో ఓ లారీ వేగంగా వచ్చి అచ్చయ్యని గుద్ది గాల్లోకి లేపి కింద పడేసింది.

ఉరుకులు పరుగులుగా వచ్చి జనం మూగారు. రోడ్డుమీద అచ్చయ్య నెత్తురు గోనెపట్టాలా వెడల్పుగా పరుచుకుంది.

## దుఃఖపు వర్షం

అతడి
హృదయం
మేఘావృతం అయింది
లోలోపల దుఃఖపు
వర్షం కురుస్తుంది
కళ్లల్లో కన్నీళ్లు
సుడులు సుడులుగా
తిరుగుతున్నాయి

అర్ధరాత్రి
కురిసిన వర్షానికి
కునుకుపట్టని అతడు
తెల్లవారుజామునే
చేనుగట్టుకు చేరాడు

చేతికొచ్చిన పంట
దోసిట్లోకి తీసుకున్న నీరులా
జారిపోయింది

అకాల వర్షాలు
అతడి గుండెల్లో
పిడుగులయ్యాయి

నిండా మునిగిన
వరిచేను గట్టుపై
చేతికర్ర పట్టుకుని
దుఃఖాన్ని
గడ్డిమోపులా మోస్తూ
భారంగా నడుస్తున్నాడు

మునిగిన
పంటను చూస్తూ
మెడకు గుదిబండ వేసిన ఆవులా...
అడుగులు వేస్తున్నాడు

ఆరుగాలం



పడిన కష్టాన్ని
పెట్టిన పెట్టుబడిని
కొండలా పెరిగిన అప్పుల్ని...
చేయవలసిన
కూతురు పెళ్లిని
తలుచుకుంటూ
కన్నీటి వానై నడుస్తూ...
అడుగులు తడబడి
గట్టుపై కూలబడ్డాడు

నల్లని మేఘాల్లాంటి
రేపటి గురించిన ఆలోచనలు
అతడి గుండెల్ని
మెలిపెడుతున్నాయి

లోపల కురుస్తున్న
దుఃఖపు వర్షంలో
చిగురుటాకులా
వణుకుతున్నాడు

నిండా నీటమునిగిన
వరి చేనులా...
అతడూ
దుఃఖంలో
మునిగిపోయాడు

పొనుగుమట్ల అశోక్ కుమార్,
9959379709

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

కథ

# గెంటీలు?

- రామ్ పెరుమాండ్ల, 9542265831

నిశ్శబ్దంగా క్షణం కుప్పకూలింది. కోడికూతనే లేపే పొద్దు అస్తమించినట్టు చీకట్లనే ముసల్ది నిద్దురలోనే కన్ను మూసింది. అందరున్నా ఒంటరి జీవితాన్ని గడుపుతూ గాలిలో దీపమైంది. తెల్లారేసరికి లచ్చవ్వ అస్తమించిందని తెలిసేసరికి అందరూ చివరి చూపు



సూద్దానికి అవ్వ ఇంటికి బయలుదేరుతున్నారు. వస్తూ వస్తూ బాటలోనే అవ్వ జ్ఞాపకాలు కూడలిలో కలిసినట్టుగా ఏకమైతున్నయి. ఆడబిడ్డలు కొంగు సేతపట్టుకొని దుఃఖ క్షణాల్లో కదలలేక ఒకరినొకరు ఓదార్చుకుంటున్నరు. అయినా ఆడబిడ్డకు కన్నీటికి విడదీయని బంధం ఉన్నట్టుంది. కష్టాలను కడుపులో దాచుకుని మోయలేని బాధలను భరిస్తరు. అందుకే కన్నీటితో ఓదార్చుకుంటరు. అవ్వలేదనే విషయం తెల్సిన ఊరోళ్ళందరు అక్కడకు రావట్టే.

అందరికీ ఆప్తురాలు కనుక ఈ సంగతి ఇంకా తెల్వని వారికి సమాచారం చేరుటకు సదువుకున్న పోరగాళ్ళు సెల్లులు సేతవట్టి సుట్టరికానికి కబురు పెడ్తున్నరు.

నిజానికి సావు ఎవరిని ఎపుడు పిలుస్తదో ఎవరికి ఎరుక. అవ్వ కన్నమ్మ కష్టాలు పడి సంసారాన్ని నడిపేది. తన పెనిమిటి తన కంటే ముందే పోయిన దిగులు కొంత ఉన్నా ధైర్యం జేసుకొని పిల్లల మీదనే పాణం పెట్టుకొని, పూటకు లేకున్నా శాతనైన కాడికి రెక్కల కష్టం చేస్తూ సంసారాన్ని నెట్టుకొచ్చేది. కానీ జీవితంలో చివరి క్షణాలు గడ్డు పరిస్థితి ఇచ్చింది. ఇరుకు బతుకులు ఒద్దని ఇడి ఇడి కాపురాలు విసిరేసినట్టు పెట్టుకున్నరు కన్న బిడ్డలు. ఒక్కతే ఎలాంటి ఆసరా లేకుండ పాత మట్టింట్ల చీకటిని భరిస్తూ గాలి దీపమైంది. కానీ ఒకప్పుడు గీ పాతింటికాడ అందరూ కలిసి ఉన్నపుడు ఉన్నదంట్లనే తృప్తిగా మసులుకుంట పెంపుడు జంతువులతో, పాడి పశువులతో ఉండేటోళ్లు.

''గంజిబువ్వ, రోకలి తొక్కు రొట్టెలు తింటూ బైట వాకిల్ల మంచం ఏసుకొని బతుకు పాఠాలు సెప్పుకుంటూ, కష్టాలను పంచుకుంటూ వేపసెట్టు గాలికి గడిపేటోళ్ళు. కానీ లేవలేని దినాల్లో పట్టించుకోక బెంగతోనే పోయిన్నట్టుంది'' అంటూ అవ్వ పినుగకాడ ఎక్కెక్కి ఏడుస్తూ కొంగుతో కండ్లల్ల నీళ్ళను తుడుచుకుంటు దుఃఖాన్ని దిగమింగే మాటలు కదులుతున్నాయి.

పాలోల్లు, అవ్వపై అభిమానం ఉన్నోళ్లు అందరూ బాధలో మునిగారు. ఇంకా ఎవరికైనా సంగతి ఎరుకకాలేదోనని సత్తిగాడు లచ్చవ్వ పెద్దకొడుకును ఆకా తీయవట్టే. "ఇంకా అందని సంగతి ఐతివ అమ్మా .." అంటూ ఏడ్వవట్టే.

అవ్వకు నలుగురు సంతానం. తొలుచూరు సంతానం ఆడబిడ్డ పురిట్లనే ప్రాణమిడిసింది. తర్వాత తొలిచూరు యాదగిరి, తర్వాత బిడ్డ అలివేలు, ఆఖరికి చిన్నోడు మల్లేశం. తొలిచూరు తర్వాత పుట్టిన పెద్దోడు అంటే పాణం. అందుకే అవ్వ స్పర్శను తాకుతూ ఏడుస్తున్నడు. తల్లికోసం పరితపించే లేగదూడలా అలివేలు అమ్మ కోసం వెతకవట్టే. కనపడ్డ వెంబడే శోకరాగంతో అవ్వ మీద పడ్డది ... ఇది చూసిన ఊరి ఆడబిడ్డలంతా బోరున ఏడ్వవట్టే. ఎందుకంటే తల్లిబిడ్డలు ఏగిన బాధలన్ని యాదికొస్తున్నయి ఆ క్షణం. మనవళ్ళు మనవరాళ్లు నాయనమ్మ ఇక లేదని నమ్మలేకపోతున్నరు. లచ్చవ్వ కూలికొయి రేగుపళ్ళు, కలింకాయలు కొంగుల ఎరుకొచ్చేది. అలాగే ఆకుల సంచిల పైపల కోసం కొట్లాడుతుంటే సెరిసమానం జేసి ఇచ్చేది. కానీ ఇగ అవ్వలేకపోతే ఎట్లని పసిప్రాయం అందరి శోకరాగంలో కలిసిపోయారు. ఎదురుంగ సిలుకొయ్యకు ఏలాడుతున్న పెనిమిటి దప్పు దరువునై ఏడుస్తనటుంది.... కానీ చిన్నోడేమో ఇంకా ఆ మాయదారి మత్తులోనే ఒడ్డుకు రాపాయే. కానీ అమ్మ లేదని సెప్పినాక కండ్లల్ల నిప్పురాయి పడ్డంత పనైంది. ఇంత పరిస్థితుల్లో ఊరంతా పదావు పడ్డట్టు నిశబ్దంగా కాలం నెమ్మదిగా కదులుతున్నది.

ఇంతలోనే ఇదంతా జరిగే పనే పదా. అయ్యే కార్యం కానియ్యాలి అంటూ పెద్ద మనుషుల ఓదార్పుతో కూడిన జరంత ధైర్యం నింపే ప్రయత్నం. అవ్వ పార్థీవదేహం వద్ద కాలంతో పాటె అగరొత్తులు కూడా బూడిదవుతున్నాయి. ఎదురుంగ పెనిమిటి దప్పు శిలుకొయ్యకు ఏలాడుతూ దీనంగా చూస్తున్నది... మిగతా కార్యంకై పెద్దమనుషుల ధైర్యపు మాటలు... కదులుతున్నాయి

•••

అందరికి సమాచారం ఇస్తున్నట్టు వాట్సప్‌లో సత్తిగాని స్టేటస్ లచ్చవ్వ చూస్తూ ఒక్క క్షణంలో గుండెపలిగినంత పనాయే సూరికి. వెంబడే సత్తికి కాల్ కొట్టాడు ...''హల్లో లచ్చవ్వకు ఏమైందిరా మొన్ననే ఫోన్ మాట్లాడితి ...హల్లో ...హల్లో ఏమాయెరా'' అంటూ కంగారు మాటలు. అక్కడ సిగ్నల్ కంటే శోక రాగాలు డప్పు సప్పుల నడుమ ఏమి వినోస్తలేదు. అక్కడున్న ఆంతర్యం అర్థం చేసుకొని బయలు దేరిండు. తనకు కొంతసేపు సూపు ఆగినంత పనయింది. ఈ బాధను మోస్తూ వెలితిగా కదిలాడు తన చుట్టూ పరిళమించే పలకరింపులున్న వాడిపోయాడు ఎందుకంటే అవ్వతో ఉన్న అనుబంధం అలాంటిది. తను తల్లిలేని బిడ్డ

తండ్రి చేవలేని స్థితిలో ఉంటే అవ్వ చెట్టునీడల ఆదుకునేది. నాకు మరో తోడు లేకుండ అయే తను ఎంతో సంపాదించి తన బిడ్డలను సదువనియలేదని అంతో కొంతో నన్ను సదవమనేది అవ్వ లేకపోతే నేను లేను.

నేను లచ్చువ్వ తో కలిసి పరిగెపత్తి ఎరుటకు, కల్చుటకు వెళ్ళేవాడిని నా సాలు వెనకబడితే నాకు ఎదురు సాలు పట్టేది. నా పేదరికంలో అవ్వ బువ్వ అయేది అందుకే అందరున్న ఇట్టి పేదరికం పోదని ఎట్లనన్న సదువుకోరా అంటూ ఎప్పుడు సెప్తుండేది. అవ్వ కొడుకులు వేరుబడ్డంక పాత ఇంటికి దూరంగా ఇళ్లు కట్టుకున్నరు. దాంతో ఒక్కతే చీకటిలో చిన్న దీపమోలే ఒంటరిగా ఉండేది. మేము ఇరుగు పొరుగు కావడం కూడా నాకు తల్లి లేని లోటు లేకున్నది. కొన్నిసార్లు అవ్వ కూలికొయిన పైసలు నా వద్ద దాచుకునేది. లోకం బ్రతుకుటకు డబ్బు అవసరమే కానీ డబ్బునే నమ్ముకుంటుంది అందుకేనేమో అవ్వ పిల్లలు కూలినాలి చేసుకునే అవ్వ డబ్బులకు వాళ్లు ఎపుడు కొట్లాడుకునే వారు. అవ్వ మనువళ్ళకు ఇచ్చేది. కానీ ఊళ్లకు చిన్న చిన్న వ్యాపారం చేసుకొనేటోళ్లకు ఇన్ని నీళ్లు ఇచ్చి వాళ్ళ కష్ట సుఖాలు పంచుకుంటూ బతుకుపాఠం చెప్పేది. సావు ఎపుడోస్థాదో అని అందరికి శెతనైన సాయం చేసేది అంతటి గొప్ప మనసు నేడు విడిపోతదని అనుకోలే అనుకుంటూ తన బ్యాగులో మరచి పోకుండా దాచుకున్న జ్ఞాపకాలన్నీ పెట్టుకొని బస్సులో రోతను మననం చేసుకుంటూ కదిలాడు ఎందుకంటే అక్కడ అవ్వను చివరి చూపు కోసం ఉంటదో ఉండదో అని ....

•••

అగరొత్తులు ఆరిపోతూ బూడిదను ఇస్తున్నాయి కాలం విలువ తెలుపుతున్నాయి లచ్చువ్వ పెనిమిటి డప్పు ఎదురుంగనే శిలుకొయ్యకు వేలాడుతూ దరువుతో తన వద్దకు ఆహ్వానిస్తున్నట్టే.. ఇంతలోనే "అరేయ్ పొద్దు పోవట్టే కట్టే కట్టక తప్పదు ఎవరైనా పోవాల్సిందే కాకపోతే ముందు ఎనకా అంతే ...పదండి పదండి ఇగ శాశ్వతం ఏది లేదు అంటూ దుఃఖ సంద్రం ను మరిసే ప్రయత్నం చేస్తుంది పెద్దరికం" కానీ దహన సంస్కారాలకు ఒక పిలుపు పలకరిస్తుంది గుంతలు తీయుటకు కట్టే కట్టుటకు కూలీ కుదరాలి ఆ పైకం ఇవ్వాలి అంటూ నిర్మోహమాటంగా మాట వచ్చింది. "ఉన్నప్పుడు ఆ ఇంటికే అంత ధార పోసిరు కదా ఇగ ఇప్పుడు ఒగల ఏడ్పులెందుకు ?" అంటూ చిన్న కోడలు మిట్ల కన్నుతో ఏడుపు తన మొగుడు తాగుబోతుడై సంసారం నాశనమైందనే కోపంతో అనవట్టే. అయిన పెద్దొళ్లకు చిన్నచితక పుల్ల అంటూ సేతకాకున్న ప్రేమతో ఇగురం చేసింది అంటూ చిన్నకొడలు. మాకెమి పోసింది దిక్కుతోచక నెట్టుకొస్తున్నాం. మీ ఇంటి దీపానికి నూనె అందించింది మరిచారా అంటూ పెద్ద కోడలు. ఒకరికి ఒకరు వాదించుకుంటున్నారు ఇంతలోనే "గివన్నీ అంటారమ్మ వెలుగు పోయినక చీకటి దాని గొప్పేమి లేదన్నట్టు మన బాధ్యత మనం నిర్వర్థించలే కదా "అంటూ మానవత్వం ను గుర్తుచేసిన పెద్ద మనుషులు ."ఎంత పని అయే అమ్మా నీవు పడ్డ తిప్పలన్ని యాదికొస్తున్నాయి నాకు జరమొచ్చి లేవలేకుండా పడితే కష్టపడి చేసుకున్న కళ్లకడియాలు అమ్మి వైద్యం సేయించినవ్ మాకేమో బలమైన తిండి పెట్టి నీవు మాత్రం పుంటికూర తో సర్దుకున్నావ్ మాయమ్మ. నీ క్షేమం కంటే, కష్టం కంటే ఏడ రాయి కన్పించిన దేవుదంటూ మొక్కినవ్ అన్ని కష్టాలు పడ్డ నీకు ఈ పేద బిడ్డలు ఇపుడు కూడా దిక్కులేని పక్షిగా చేసినం అమ్మా మమ్ముల క్షమించమ్మ ....పది మందికి సాయం చేసిన నీవు ఇట్ల పోవద్దు. ఇంత మాతృమూర్తి కోసం వంతులు చూసుకుంటున్నారు నా వద్ద చిల్లిగవ్వ లేకున్నా నాకు మిగిలిన ఆవుదూడ అమ్మైనా చేస్తాగాని చేయిరయ్యా"అంటూ అమ్మనికే లేస్తున్నాడు. ఇక చిన్నోడికి మాసిన ముఖంతో ఎం చేయాలో తొస్తలేదు తాగి తాగి అప్పుల మునిగి సప్పుడలేని మద్దెల అయిండు కానీ కన్నతల్లి ముందు సంటోనిలెక్క ఎక్కి ఎక్కి ఏడ్వవట్టే .ఇక ఆడబిడ్డ సంసారం కూడా అంతంతనే ఉండవట్టే ఇంతటి పరిస్థితి వచ్చిందని అనుకుంటున్నారు. అదేందో ఆ గల్లీ బతుకుల్లో దినకూలి ఖచ్చితంగా కావాలె .పొద్దు గడవాలి అంటే డబ్బు కావాల్సిందే మానవవిలువలు సైతం నిర్మొహమాటంగా వదిలేసే పరిస్థితి ఎందుకంటే ఇయ్యాల చేస్తేనే రేపు భద్రం అన్నట్టు ....

అయితేవాయే అనుకుంటూ రోతల్లోనే అటు ఇటు వెతుకుతూ నుదుటిరాతను తిట్టుకున్నారు. పెద్దమనుసులు ఈ బాధను చూడలేక మాట్లాడలేక దుఃఖాన్ని మింగుతున్నారు. అది ముందుకే చిల్లరగల్లీ గాడ కొనేటోళ్లు ఎడుంటరు. వాళ్ళ బతుకులు అమ్ముకునుడే తప్ప. కానీ ఒక్కగానొక్క తాకట్టు లింగరాజు గాడు ఉన్నడు వానికి కఠిన పరిస్థితులొస్తే లాభం వాగుతుంది. కానీ శవమంటూ అడిగిన బిత్తరపోతడు. ఈ సమాజం పేదోని పరిస్థితులకు చిన్నచూపు చూస్తే చావక ఏం చేస్తాడు .అవ్వలంటి అమ్మమ్మ, నాయనమ్మల పరిస్థితులు ఎవరూ పట్టించుకోరు వారి అనుభవం అందిపుచ్చు కోరు. ఇగ పెద్ద మనుషుల తొందరపాటు నడుస్తుంది. వీరేమో రోతనలు దహన సంస్కరణలు అగుతుంటే "అయ్యా మానవత్వంగా మేమెందుకు చేయం కానీ సరుకులకైనా కావాలి లేకపోతే గిట్టే మనిషికి విలువలేకుండా పోతుంది. జర గాపని చూడుర్రి తప్పుగా అనుకోకుర్రి "అంటూ వాళ్లలో ఒకరొచ్చి అంటున్నరు. వాళ్ళకు ఎం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది.

•••

ఇక అక్కడ కదిలిన బస్సు ఊరికొచ్చేసరికి నిశబ్దంగ సంగ్దిదంలో మునిగింది. తనను బస్సు సాగనంపుతుంటే తన వెంబడి వచ్చిన వారు ఒంటరి చేసినట్టు అవ్వ బాధను దగ్గరకు తోస్తున్నట్టు అనిపించింది. ఎందుకంటే చివరిగా అవ్వ ను చుదాల్సివస్తాదనుకోలే ...

ఊరు ఊరంతా నిశబ్దంగా ఉంది ఎవరు కానొస్థలే బస్టాండు కాడ జాఫర్ కూడా హోటల్ బందుజేసీ పోయిండు అంతటి సేవ మూర్తి నా లచ్చువ్వ ..

ఇంతలోనే గుమిగూడిన జనంను చూస్తుంటే ఒక్కసారిగా దుఃఖం తన్నుకొస్తుంది అలాగే ఒక చిన్న సందేహం అవ్వ ఉందొ లేదోనని చివరిచూపు లేకుండానే విడిపోయిందే నా ఆత్మబంధువు అనుకుంటూ తన బ్యాగును వదిలేసి గబ గబ తన అవతనికి ఊరికిండు. కిక్కిరిసి జనం మధ్యలో అందర్నీ ఆణిముత్యం కోసం తవ్వుతున్నాడు ప్రక్కకు జరుపుతున్నాడు. అగరొత్తు ఆరిపోతూ శిలుకొయ్యకు వేలాడిన డప్పు రోతగా కదులుతూ ఆడపడుచుల శోక రాగలలో ధీనమైన పరిస్థితుల్లో లచ్చువ్వ ముఖం అగుపించించి. ఇక సూరికి దుఃఖం కట్టలు దెంచుకుంది. దాంతో తన జేబులో దాచుకున్న జ్ఞాపకాన్ని నెమరుకుంటు ఒక్కసారిగా అవ్వపై పడి పసివాడిలా ఏడ్వవట్టే."నా కోసమే ఇంతసేపు ఆగవమ్మా నీ కడుపులో పుట్టకున్నా కాచుకున్నావు నా దోస్తువైనవు నిన్ను నీ జ్ఞాపకాలను ఇంకా పదిలంగ దాచుకున్న తల్లీ!! నన్ను కూడా ఒంటరి చేసి పోతివి .....! నాకున్న ఒక్కగానొక్క ధైర్యం పోతే నేనేట్ల అమ్మా..."అంటూ బాధను మింగలేక పోతున్నాడు.

అవ్వ బిడ్డలు కూడా ఒకరిని పట్టుకొని ఒకరు ఎదర్చుకునే ప్రయత్నం జేస్తున్నారు.

పొద్దు పోతుందని పెదమనుషుల ఆత్రం కానీ ఇంకా కార్యానికి కుదరని సరుకులు దాంతో అపుకోలేని దుఃఖం తో పెద్దోడు అవుదూడను అమ్మనికే లింగరాజును బ్రతిమాలనికే పోతుండు కానీ మనుషులే బ్రతికేది చెప్పలేం గొడ్డు ఎలా నమ్మశక్యం అయిన అది బక్కచిక్కిపోయింది రేపో మాపో పోతది తీసుకుంటాడో తిరస్కరిస్తాడో అనుకుంటూ తాడు ఇప్పుతున్నాడు. చిన్నోడు పెదొడు ఇది కుదరని పని అని అనుకుంటనే ఉండరు. పెద్ద మనుషులు కడు పరిస్థితి దీని వల్ల కాదని నచ్చాచెప్పే ప్రయత్నం. ఇంత శోక యుద్ధాని భరిస్తూ తన జేబులో దాచుకున్న జ్ఞాపకాలను దువ్వుతున్నడు. తను చదువుకొనికే డబ్బులు లేకపోతే అవ్వ తను మోకాళ్ళ నొప్పులతో కూలికొయి సంపాదించుకున్న సొమ్మును ఇచ్చింది. అది జీవితాన్ని ఇచ్చింది అనే కృతజ్ఞతతో తను పట్నంలో చదువుకుంటూ చిన్న చితక పనులు చేసుకుంటూ వాటిని తిరికి తెచ్చుకొని

భద్రంగా దాచుకున్నాడు అవ్వను చూసుకున్నాడు దంట్లో ..అందుకే తిరిగి అవ్వకు ఇతమనుకున్నాడు. అందుకే ఎంత కష్టమొచ్చినా తనతో చిల్లిగవ్వ లేకున్నా వాటిని మాత్రం తీసేటోడు కాదు ఎందుకంటే పోయిన నెలలోనే నాన్న చనిపోతే కూడా తియ్యలే. ఆ సొమ్ములను చూసుకుంటూ ఇంకా ఏడ్వవట్టే

కానీ అవ్వ అన్నే ఆగిపోయే అవ్వకు సంతోషంగా ఇద్దమని భద్రంగా పెట్టుకున్నాడు. వీళ్ళు కొట్లాటలో ఎంతకు కదల్లేదు బహుశా అవ్వ దీని కోసమే ఆగినట్టుంది. నన్ను పాణంగా చూసుకున్న అవ్వనే పోయినక ఇక నేనేమి చేసుకొను వీళ్లేమో పడని పాట్లు పడుతున్నారు ఇది ఆగని కార్యం అందుకేనేమో అవ్వ నాతో ఈ రోజు కోసమే ఇచ్చింది బహుశా రేపు నేను సస్తే ఇవే నన్ను సాగనంపుదయని కావొచ్చు. అందుకే నాతో దాపెట్టింది అని పట్టింద్రు అన్న అంటూ తన జ్ఞాపకాన్ని సైతం ఇచ్చేసి బోరున ఏడుస్తున్నడు .

ఇక వాటిని పెద్ద మనుషులు తీసుకొని తాకట్టు లింగరాజుకు కొంత సొమ్ముతో సంస్కరణ సామాను తీసుకొచ్చి మిగతా కార్యం చేస్తున్నారు. అవ్వ కాటికి పోతుంటే సతిగాని ఇదేదో గొప్ప అనుభవ పాఠం అన్నట్టు దోస్తులకు చెబుతుండు "అరే అవ్వ ఇంత సంపాదించిన అక్కర రాలేదు కానీ కాళ్ళ నొప్పుల వయసులో కూడా భూమిని పాకుతూ కూలికిపోయి గా గెంటీలు చేపించుకున్నది అదే కాటికి తీసుకుపోతున్నది. అందుకేనేమో గీ ముసలోళ్లు అందరూ సంసారంను ఎత్తుకుంటే బరువు కాదు కానీ దింపుకుంటే కరువు అన్నట్టు వృద్ధ కాలం నేర్పుతుంది. అందుకేనేమో బక్క పలుచని ప్రాణాలను సేతులకు, కాళ్ళకు కడియాలు, సొమ్ములు ఆస్థులుగా పెట్టుకుంటారు... కొన ప్రాణానికి కొసరు విలువ అన్నట్టు మానవత్వం తెలియజేస్తుంది.

# దుండిగల్ జైనబసది దానశాసనం

**పరిశోధన**



మేడ్చల్ జిల్లా, దుండిగల్ గండిమైసమ్మ మండలానికి చెందిన గ్రామం దుండిగల్‌లోని లక్ష్మీనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో అగుపించిన శాసనాన్ని గురించి తెలుసుకోవడానికి నర్సగారి జగన్ కొత్త తెలంగాణ చరిత్రబృందం అధ్యక్షుడు శ్రీరామోజు హరగోపాల్‌కు పంపించాడు. ఈ శాసనస్తంభాన్ని దిండిలోని చిన్నచెరువు దగ్గర నుంచి తెచ్చారని ఆలయపూజారి చెప్పాడు. స్తంభం సరిగా మధ్యలోకి విరిగిపోయివుంది. శాసనస్తంభానికి మూడువైపులలో 11వ శతాబ్దాపు తెలుగన్నడలిపిలో, కన్నడభాషలో, 41పంక్తులలో శాసనం చెక్కివుంది. శాసనం మొదట చంద్రుడు, సూర్యుడు, జైన తీర్థంకరుడు, ఆవు, దూడలు చెక్కివున్నాయి.

కళ్యాణీచాళుక్య చక్రవర్తి త్రిభువనమల్లదేవ 6వ విక్రమాదిత్యుడు(పాలనాకాలం-క్రీ.శ.1076-1126) కళ్యాణీపురం నెలవీడు(తాత్కాలిక శిబిరం)లో ఉన్నపుడు వేయించిన శాసనమిది. అనేక ప్రశస్తులున్న అతని మహామండలేశ్వరుడు, సోమవంశానికి చెందిన వాడు దేవేం(ద్రుడు...పేరున్నచోట రాయి పగిలిపోయింది) చెక్కించిన దానశాసనం. జినపాద భక్తితో ''శ్రీలలన(శ్రీలక్ష్మిని)బోలు నాలమ'' జైన శాసనదేవతకు బసది నిర్మాణం చేయించింది. మండలేశ్వరునిచే ఎన్నో మర్తురుల(మర్తురు=ఒకటిన్నర ఎకరం)భూమి దానం చేయబడ్డది. ఈ కార్యక్రమంలో ముప్పన పాల్గొన్నాడని శాసన పరిష్కారం చేసిన శ్రీరామోజు హరగోపాల్ వివరించాడు. గతంలో చరిత్రబృందానికి వరంగల్ జిల్లా చింతనెక్కొండ మండలంలోని గ్రామంలో ఇట్లే సగం విరిగిన స్తంభశాసనం లభించింది. తెలంగాణాలో జైనమతప్రాభవానికి నిదర్శనంగా జైనశాసనాలు ఇప్పటికి అక్కడక్కడ లభిస్తున్నాయి.

**దుండిగల్ శాసనం**

1వ వైపు చంద్రుడు, సూర్యుడు కాలాముఖగురువు ఆవుదూడ, శ్రీశ్రీ,

1.స్వస్తి సమస్త భువనాశ్రయ శ్రీప్రిథ్వీవల్లభ మహారాజాధిరాజ (రాజ)

2.పరమేశ్వర పరమభట్టారక సత్యాశ్రయకులతిలకం చాళుక్యాభరణం,

3.శ్రీమత్రిభువనమల్లదేవ(ర) విజయరాజ్యముత్తరొత్తరాభి,

4.వ్రిద్ధి ప్రవర్ధమానమాచంద్రార్కతారంబర సలుత్తు కళ్యా,

5.ణపురద నెలవీడ... సుఖసంకతావినోదదిం రాజ్యంగెయ్యు(త్త)

6.మిరేతత్పాదపద్మోపజీవి11 స్వస్తి సమధిగత పంచమహా(శ)

7.బ్ద మహామండలేశ్వరం రిపుహరత్రిపుర మహేశ్వరం సమస్త వి..

8.పారావార పారాయణ(సు) భటనారాయణం సకళ లక్ష్మినివా(స)

9.కీర్తివిలాసం సంగ్రామరామం పరాక్రమభీమం మండలీక మ.....

10. దర్పణం విబ్ధ సంతర్పణం కలిగలంకు సంపుర్ణము..ద్దేసంకొ....

11. యాం గణగ్రిహ మంగళతోరణం పంపనగంధవారణం....మా..

12. స్వామిద్రోహరగండం సోమవంసాపిరసరశ్శ శ్రీమండలికదేవేం

13. ..తి..హ్రిదయసేల్లం సమలకమల్లం నిజిశా....దంత

2వ వైపున

1..... దిప్పువరూమగు...

2.....ణము యాప్పుదునినగేం

3.దు లోకమెల్లం పొగల్వరు తప్పి

4...ద చరిత్రం ముప్పనయు

5.దాంగలశ్మి నాలమ జగదొప్ప

6.శాసనదేవత నాలమకాగ

7.ఱణ దొలగె నెగల్దదుందుమిగడ

8...ఱు(లే)సాగిభక్తియందం శాగ..

9.వానిప్పె బసదియం మాడిసిదలె

10.శ్రీలలనంబోలు (భూ)మిన భూ

11.లలనంబొలు తాల్పి హిద్వినివాకు

12.శ్రీలలనబోలు నాలమబొల

13.రు పొల్పగ సతులు భువన

14...లోన..జినపదభక్తియందన

3వ వైపున

1.మూడణ కరంబమ

2.(త్ర)రదుయల్లియ ఇప్పే

3...ల్పత్తేరదు బసదియ

4...తొంటం మత్తరొడు మ

5..తొవొందు దేవమానం గ..

6.ఆవల్లియొబ్బలబత

7...యమదుందు మిగడల..

8...త్తియాగికొట్టురుమ..

9.హిదం నాగలూరలు సో

10...దియుంయల్లియ ప్ర...

11.మిగదలా సోమ జెస...

12.వ్రిత్తిబెట్టిదకుం....

13....యుదుం పలా..

14....తరొం మయా...

15. ...........

**శాసనం గుర్తింపు: నర్సన్నగారి జగన్, దుండిగల్**
**శాసన పరిష్కారం: శ్రీరామోజు హరగోపాల్, అధ్యక్షులు, కొత్త తెలంగాణ చరిత్రబృందం-**
**9949498698**

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సాప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

కథ

# పండిన పసిడి కల

పాలగుమ్మి జ్యోతి

"రామయ్యా! వచ్చే నెల మా అమ్మాయి పెళ్ళి! పెళ్ళికూతురుని పెళ్లి పీటలు దాకా మేనమామ మోసుకెళ్ళే బుట్ట నువ్వే చేయాలి. ఇదిగో..! మామూలుగా అందరికీ చేసినట్టే చేసేవు! బుట్ట చూసి అందరూ ముచ్చట పడిపోవాలి!" జారిపోతున్న కండవా తీసి దులిపి భుజం మీద వేసుకుంటూ అన్నారు నాయుడు గారు.

"అట్టాగే బాబు గారు! సాలా అందంగా సేత్తాను! మీరే సూత్తారుగా నా పనితీరు ఏంటో!" తన పనితనం మీద నమ్మకం అతని కళ్ళల్లో మెరుస్తోంది.

"ఇదిగో..! అలాగే అమ్మాయి సారె పంపడానికి కూడా ఓ ఇరవై బుట్టలు కావాలి! అన్నీ అయ్యాక ఇంటికి తెచ్చి ఇచ్చేయ్! ముందుగా ఈ డబ్బులు ఉంచు!" అంటూ జేబులోంచి కొంత డబ్బు తీసి రామయ్యకి ఇచ్చారు నాయుడు గారు.

"సంతోషం బాబు! పని అవగానే తెచ్చి ఇచ్చేత్తానండి!" వినయంగా వంగి ఆ డబ్బులు తీసుకుంటూ అన్నాడు రామయ్య.

"రత్తాలు! ఓ రత్తాలు! ఎక్కడున్నావే? ఎప్పుడూ ఒక్క పిలుపుకు పలకవు కదా!" రామయ్య పిలవగానే "ఆ ఒత్తన్నా! ఏంది ఒక్కటే అరుపు! ఏమైంది?"

"నాయుడు గారి అమ్మాయి గారి లగ్గం అంట! వచ్చే నెల బుట్టలు కావాలని డబ్బిచ్చెళ్లారు!"

"ఏందీ? సిన్నమ్మ గారి లగ్గమా మామా! అమ్మాయి గారి పెళ్లికూతురు బుట్ట బాగా సేయాలే!" డబ్బులు తీసుకుంటూ చింకి చాటంత మొహంతో అంది రత్తాలు.

"సరేగాని! మన రంగడేడే?"

"ఆడు సదువుకుంటున్నాడు"

"ఆ! సదువుకుంటున్నాడంట! మనకెందుకే ఈ సదువులు? ఆడిని కూడా నా దగ్గర పని నేర్సుకోమను!"

"ఇదిగో మామా! ఇంకోసారి ఆ మాట అంటే ఊరుకునేది లేదు.. నా బిడ్డ కూడా నీలాగే బతకాలంటావ్! ఆడు సదువుకుని పెద్ద ఉద్యోగంలో ఉండాలి!"

"నీ పిచ్చి నీదే! నేను సెప్పిన మాట ఇనవు కదా!"

"సదివించడానికి నువ్వేం కట్టబడుతున్నావా? సర్కారోళ్ల బడిలో ఏత్తే ఆళ్ళే కూడెట్టి సదివిత్తున్నారు కదా!"

"సరేలే! కాత్త మంచినీళ్ళు తెచ్చిపొయ్యి ముఖాన!"

రత్తాలు నీళ్ళు తేవడానికి లోపలికి వెళ్ళగానే "ఏంటో దీని పిచ్చి! నాలుగు బుట్టలల్లినా ఆడి బతుకు ఎట్టాగో అట్టాగ ఎళ్ళి పోద్ది అంటే వినదు కదా!" అంటూ చుట్ట నోట్లో పెట్టుకుని ఊదుకుంటూ వెదురు బద్దలు ముందేసుకొని కూర్చున్నాడు రామయ్య.

రంగడు చాలా చురుకైన పిల్లాడు. పాఠశాలలో చెప్పినది చెప్పినట్టుగా గ్రహిస్తాడని వాళ్ళ మాస్టారు గుర్నాథం గారికి కూడా వాడంటే వల్లమాలిన అభిమానం.

పాఠశాలలో రంగడిని చూస్తూ "ఏరా రంగా, నిన్న చెప్పిన పాఠం బాగా చదువుకున్నావా?"

"ఓ! బాగా చదువుకొచ్చాను మాస్టారు గారు!" అంటున్న వాడిని ముచ్చటగా చూస్తూ "బాగా చదువుకో, నీకు ఏ సందేహం ఉన్నా నన్ను అడుగు.. సరేనా!" గుర్నాథం మాస్టారు హెడ్మాస్టర్ గది వైపు వెళుతూ అన్నారు.

"అలాగే!" అన్నట్టుగా తల ఊపి రంగడు తన క్లాస్ రూమ్‌లోకి వెళ్లిపోయాడు.

బుట్టలయ్యాక ఇవ్వడానికి వెళ్లిన రత్తితో నాయుడు గారి భార్య కమలమ్మ "ఏమే రత్తీ! మీ రంగడు భలేగా చదువుతాడటగా?" అని అడుగుతుంటే–

కాస్త గర్వంగా ఉన్నా సిగ్గుపడిపోతూ రత్తాలు "ఏవోల్నేండి అమ్మగారు! మావన్ని వానాకాలం సదువులు!" అంది.

"సరేలే! మిగతా డబ్బులు మీ అయ్యగారిని అడిగి రామయ్యని తీసుకోమను!" కమలమ్మ గారు అనగానే–

"అట్లాగే! ఉంటాను అమ్మగారు!" అని ఇంటికి వెళుతున్న రత్తాలుకి ఒకసారి పాఠశాలకు రమ్మని గుర్నాథం మాస్టారు చెప్పింది గుర్తొచ్చింది.

రత్తాలును చూడగానే "రా రత్తాలు బావున్నావా?" అడిగారు గుర్నాథం మాస్టారు.

"బాగానే ఉన్నాను మాట్టారు! మా రంగడు ఏమైనా అల్లరి సేసాడా? బాగా సదవడం లేదా? రమ్మన్నారు!" ఆత్రంగా అడుగుతున్న రత్తాలును చూసి పకపకా నవ్వుతూ,

"మీరంగడికేంటే బంగారం!



మొత్తం పాఠశాలలో వాడికే ఎక్కువ మార్కులు వస్తాయి! వాడిని బాగా చదివించు!"

"అట్లాగే బాబు! మీరు రమ్మన్నారంటే కంగారు పడిపోయాను!" అంటూ మాస్టారు కాళ్ళకి దండం పెట్టబోతూ ఉంటే–

గురునాథం పక్కకు తప్పుకుని "ఎందుకే ఇవన్నీ! వద్దు! వాడిని సర్కారు చదివిస్తోంది! నేను కాదు. మీ రంగడు బాగా చురుకైనవాడు, చదువుకుంటున్నాడు! మధ్యలో నేనేం చేశాను? పిల్లలకు చదువు చెప్తున్నాను, నా కర్తవ్యం నేను చేస్తున్నాను! రంగడిని చదువు మానిపించద్దని చెబుదామని నిన్ను రమ్మన్నాను! సరే మరి! నాకు క్లాసుకు టైం అయింది నేను వెళుతున్నాను!" గుర్నాథం మాస్టారు క్లాస్ రూమ్‌కి వెళ్ళిపోగానే రత్తాలు "ఎలాగైనా రంగడుని సదువు మాన్పించకుండా సదివించా!" అని నిర్ణయించుకుంది.

రంగడు టెన్త్ క్లాసులో పాఠశాలలోనే అత్యధిక మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు. పెద్ద కాలేజీలలో సీటు ఇస్తామని ముందుకు వస్తే, గుర్నాథం మాస్టారు మంచి కాలేజీ చూసి అన్నీ మాట్లాడి రంగడిని చేర్పించారు.

రంగడు కాలేజీలో కూడా మంచి విద్యార్థిగా పేరు పొందడం చూసిన ప్రిన్సిపాల్ గారు ఒకరోజు తన రూముకి రంగడిని పిలిచి "రంగా! కాలేజీలో నీ అంత శ్రద్ధగా చదివేవాళ్ళు చాలా తక్కువ మంది ఉన్నారు. నువ్వు ఇలాగే శ్రద్ధగా చదువుకో! మంచి ఉద్యోగం సంపాదించి మీ అమ్మా, నాన్నలని బాగా చూసుకోవచ్చు! వాళ్ళు నిన్ను చాలా కష్టపడి చదివిస్తున్నారు! రంగడిని మెచ్చుకుంటూ అనగానే–

"అలాగే సార్! తప్పకుండా చదువుకుంటాను!" అన్నాడు.

"సరే! అది చెబుదామనే పిలిచాను క్లాసుకు టైం అవుతోంది వెళ్ళు!" కుర్చీలోంచి లేచి మెచ్చుకుంటూ రంగడు భుజం మీద తట్టి అన్నారు. హాస్టల్ రూములో పుస్తకాలు చదువుకుంటున్న రంగడు దగ్గరికి వచ్చి "అరే రంగా! అందరం సినిమాకి వెళ్తున్నాం! నువ్వు కూడా రారా!" అని భానుమూర్తి అడగగానే–

"అదేంటి ఇవాళ కాలేజీకి సెలవు కూడా కాదుగా!" "సెలవుల్లో అందరూ వెళతారు.. కాలేజీ ఎగ్గొట్టి వెళితేనే మజా!" కాలర్ ఎగరేస్తూ అన్న భాను మూర్తితో– "వద్దురా భానూ! మా అమ్మ వాళ్ళు చాలా కష్టపడి నన్ను చదివిస్తున్నారు! స్కాలర్‌షిప్ డబ్బులు సరిపోవని వాళ్ళు కూడా కొంత పంపిస్తున్నారు! నేను బాగా చదువుకుని వాళ్ళని సుఖపెట్టాలి! నేను రాను!"

"ఒక్కరోజు కాలేజీ ఎగ్గొడితే ఏమి కాదు రారా!"

"ఒరేయ్ భానూ! నీకేంరా! పెద్దింటి బిడ్డవు! నేను అలా కాదు! మా నాన్న బుట్టలల్లి నన్ను చదివిస్తున్నాడు. నేను చదివే ప్రతి పేజీలోనూ వెదురుకి కోసుకుపోయిన మా నాన్న వేళ్ళు, బుట్టలు అల్లి, అల్లి నొప్పులతో మూలుగుతున్న మా నాన్న బాధ కనిపిస్తాయి! నన్ను చదువుకోనివ్వరా!"

"సరే బాబూ! నువ్వు చదువుకో! నేను సినిమాకి వెళ్తా!" అంటూ భానుమూర్తి వెళ్ళిపోయాడు.

కాలేజీ చదువు అవగానే ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్న రంగడికి మంచి మార్కులతో పాస్ అవడంతో ఎక్కువ కష్టపడక్కర్లేకుండానే మంచి ఉద్యోగం వచ్చింది.

తనకు ఉద్యోగం వచ్చిన విషయం తల్లి తండ్రికి చెప్పగానే రామయ్య "ఒరేయ్ రంగా! నువ్వు పెద్ద ఉద్యోగంలో సేరుతున్నావ్! అక్కడ మంచి పేరు తెచ్చుకోవాలి! రామయ్య కొడుకు రంగడు ఎంత గొప్పోడో!" అని అంతా అంటుంటే నేను పొంగి పోవాలా!" రంగడిని గుండెలకి హత్తుకుని ఆనందంగా అంటున్న రామయ్య కళ్ళల్లోంచి పొంగిన ఆనంద భాష్పాలతో రంగడు చొక్కా తడిసింది.

రంగడు ఆఫీసులో పనిచేస్తూ అక్కడ పని అయ్యాక కొన్ని కోట్లల్లో పద్దులు కూడా రాసి ఓవర్ టైం చేస్తున్నాడు.

"సార్! మిమ్మల్ని ఎం.డి గారు పిలుస్తున్నారు!" ఆఫీస్ పనిలో నిమగ్నమైన రంగడు ప్యూన్ చెప్పడంతో.... పని ఆపి ఎం.డి. గదికేసి నడిచాడు, రంగడు.

**"మే ఐ కమిన్ సార్!" తలుపు తట్టి అడిగాడు. "ఎస్!" లోపలి నుంచి వినిపించింది. "మీరు పిలిచారని ప్యూన్ వీరన్న చెప్పాడు!" చేతుల రెండు వినయంగా కట్టుకుని ఒద్దికగా నిలబడి అడిగాడు. "రా! రంగా కూర్చో!" కుర్చీ చూపిస్తూ అన్నారు ఎం.డి.**

"మే ఐ కమిన్ సార్!" తలుపు తట్టి అడిగాడు.

"ఎస్!" లోపలి నుంచి వినిపించింది.

"మీరు పిలిచారని ప్యూన్ వీరన్న చెప్పాడు!" చేతుల రెండు వినయంగా కట్టుకుని ఒద్దికగా నిలబడి అడిగాడు.

"రా! రంగా కూర్చో!" కుర్చీ చూపిస్తూ అన్నారు ఎం.డి.

రంగా కూర్చున్నాక "మన కంపెనీలో నువ్వు చేరాక మంచి లాభాలు వస్తున్నాయి! చాలా కష్టపడి పని చేస్తున్నావ్! అందుకే నీకు ఒక నెల జీతం బహుమతిగా ఇవ్వాలనుకుంటున్నాను!" అనగానే–

"మీరు నాకు చెప్పిన పనిని చాలా శ్రద్ధగా నిజాయితీగా చేయమని మా నాన్న చెప్పాడు! మా నాన్న కూడా ఎప్పుడు బుట్టలు అల్లినా డబ్బున్న వాళ్ళకైనా, లేనివాళ్ళకైనా అంతే శ్రద్ధగా పనిచేస్తాడు! నాకు ఉద్యోగం వచ్చిందని చెప్పగానే మొదటిగా మా నాన్న నాకు చెప్పింది అదే సార్!"

వినయంగా చెబుతున్న రంగాని చూసి "ఇలాగే శ్రద్ధగా పనిచేసుకో! కంపెనీలో ఇంకా ఉన్నత స్థానాలకు వెళ్లొచ్చు!" టేబుల్ సొరుగులోంచి ఒక కవర్ తీసి "ఇదిగో! నీకు గిఫ్ట్‌గా ఇస్తానన్న ఒక నెల జీతం!" రంగడు చేతికి అందిస్తూ అన్నారు ఎం.డి

"థాంక్యూ సార్!" ఆనందంగా అంటూ కవర్ తీసుకొని "సార్! మీరు ఏమి అనుకోకపోతే ఒక రెండు రోజులు మా ఊరికి వెళ్లి రావచ్చా?"

"ఏం పర్వాలేదు వెళ్లి రా!" ఎం.డి గారికి నమస్కరించి తన టేబుల్ వద్దకు వెళ్ళిపోయాడు. రంగడు వాళ్ళ ఎం.డి గారు ఇచ్చిన ఒక నెల గిఫ్ట్ డబ్బుతో పాటు తను కోట్లలో పద్దులు రాసి సంపాదించిన డబ్బులు అన్నీ పోగేసి బజారుకు వెళ్లి, రాత్రికి వాళ్ళ ఊరు బస్సు ఎక్కాడు.

"అమ్మా! అమ్మా!" ఇంట్లోకి అడుగు పెడుతూనే గట్టిగా అరుస్తూ పిలిచాడు రంగడు.

"ఏందిరా రంగా! ఎప్పుడొచ్చావ్? ఆశ్చర్యంగా అడిగింది రత్తాలు. "కళ్ల

మూసుకో!" "ఎందుకురా!"

"అబ్బా! మూసుకోవే! "సరే!' కళ్ళు మూసుకున్న రత్తాలుకి చేతులో ఏదో బరువుగా పెట్టినట్టుగా అనిపించగానే కళ్ళు తెరిచి చూస్తే మెరిసిపోతూ కనిపించాయి జత బంగారు గాజులు.

"ఒరేయ్ రంగా! బంగారు గాజులు! ఎక్కడివిరా?" ఆశ్చర్యం, అనుమానంతో అడిగింది. "అమ్మా! నేను పని చేసే కంపెనీకి బాగా లాభాలు తెచ్చిపెట్టానని మా యజమాని ఒక నెల జీతం నాకు బహుమతిగా ఇచ్చారు. అది కాకుండా కోట్లల్లో పద్దులు రాసి కూడా కొంత డబ్బులు సంపాదించి దాచాను. అవన్నీ పెట్టి నీకు బంగారు గాజులు తీసుకొచ్చాను!"

"నిజంగానా రంగా! ఒరేయ్ రంగా! నాకు బంగారు గాజులు ఏసుకోవాలని ఉందని మీ అయ్య సెప్పాడా నీతో? నీకెట్టా

"మీ అయ్య సెయ్యలేని పని నువ్వు సేసావురా! నిన్న సదివిత్తానని మీ అమ్మ పట్టు పట్టింది. లేకపోతే నాలాగే ఉండేటోడివి!" కొడుకుని గర్వంగా గుండెలకి హత్తుకుని నుదుటిపై ముద్దు పెట్టుకుంటూ అన్నాడు రామయ్య.

తెలుసురా?" ఆశ్చర్యంగా అని తల్లి అడుగుతూ ఉంటే–

"నేను కాలేజీ సెలవులకు ఇంటికి వచ్చినప్పుడు రాత్రి నిద్రలో దోమలు కుడుతున్నాయని లేచాను. అప్పుడు నువ్వు, నాన్న గాజుల గురించి ఏం మాట్లాడుకున్నారో గుర్తుందా?

...........................

"మామా! ఇయాల కమలమ్మ గారు కొత్త బంగారు గాజులు సేయించుకున్నారు! సూడవే రత్తి! మీ అయ్యగారు సేయించారు! అని సూపించారు" అని రత్తి చెప్పగానే– "ఏమన్నావ్?"

"ఏమంటాను? సానా బాగున్నాయి అమ్మగారు! అన్నాను మనం ఈ జన్మలో అట్టాంటి గాజులు ఏసుకోగలమా ఏంది?"

"సాల్లే! ఆశకైనా హద్దులుండాలి! ఆల్లు ఎక్కడ! మనం ఎక్కడ! అయినా నీ సేతులకి ఈ మట్టిగాజులు ఎంత బాగున్నాయో సూడు!" రంగి చేతికున్న మట్టి గాజులు అటు ఇటు కదుపుతూ అన్నాడు.

"అంతేలే! బంగారం కొనిపెట్టలేవు! అందుకే మట్టి గాజులే బావున్నాయ్ అంటావ్! ఒక్కసారి అయినా జీవితంలో అట్టా పచ్చగా మెరిసిపోయే బంగారు గాజులు సేతికి ఏసుకోవాలని ఆశగా ఉంది మామా!" రత్తాలు ఆశగా అడుగుతూ ఉంటే బంగారం కొనివ్వలేని తన ఆర్థిక పరిస్థితులు తలచి కన్నీళ్ల వచ్చాయి రామయ్యకి.

"అయ్యో! ఏంది మామా ఆ కన్నీళ్లు! నేను ఏదో ఊరికే తమాషాకి అడిగాను. అయినా ఈ మట్టి గాజులు సూడు ఎంత బాగా సప్పుడు సేత్తన్నాయో! నేను వత్తన్నానని నీకు ముందే తెలిసి ఆ ఎదురింటి సోమిని సూత్తున్న వాడివి మానేత్తావు!" రామయ్యని నవ్వించాలని అంది.

"పోవే! నీ మామ అట్టాంటోడు కాదు అని నీకు తెలుసు! నన్ను నవ్వించడానికి అంటున్నావ్! నేను సచ్చేలోగా నీకు ఆ బంగారు గాజులు సేయిత్తాను!" అన్నాడు కళ్ళు తుడుచుకుంటూ.

.......................

రత్తికి ఆ రోజు తను రామయ్య మాట్లాడుకున్న విషయం గుర్తుకొచ్చింది.. "ఒరేయ్ రంగా! ఆ ఇసయం గుర్తుపెట్టుకుని నా కోసం ఇంత కట్టబడి డబ్బులు సంపాదించి గాజులు తెచ్చావా?" అంటూ చేతిలో ఉన్న బంగారు గాజులు చూస్తూ ఉంటే ఆ బంగారం మెరుపు రత్తాలు కళ్ళల్లో నీళ్ళకి మసగబారిపోయింది.

"అమ్మా! చెయ్యి ఇయ్యవే తొడుగుతాను!" తల్లి కన్నీళ్ల తుడిచి చేతికి బంగారు గాజులు తొడిగాడు రంగడు.

బంగారు గాజులు చూసుకుంటూ "ఒరేయ్ రంగా! సిన్నప్పుడు నువ్వు ఏడుత్తా ఉంటే నా గాజులు సప్పుడు సేత్తే విని కిలకిల నవ్వేటోడివి! ఇప్పుడు నువ్వు తొడిగిన ఈ పచ్చని గాజులతో నా కల నెరవేరిందిరా! ఒరేయ్ రంగా! ఈ జన్మలో నేను బంగారు గాజులు ఏసుకుంటాను అని అనుకోలేదురా!" బక్క చేతులకి ధగధగా మెరుస్తున్న గాజులు చూసుకుంటూ ఉంటే ఎండిపోయిన చెంపల నుంచి జలజలా కారిన నీరు గాజుల మీద పడి బంగారం కూడా మెరుస్తూ తన ఆనందాన్ని తెలియజేసింది.

తల్లి పసిడి కలను నిజం చేసిన రంగడు "అమ్మా! గాజులు చప్పుడు చెయ్యవే! నీ రంగడు మళ్ళీ కిలకిలా నవ్వుతాడు!" అంటూ కళ్ళనిండా నీళ్లతో అడుగుతున్న రంగడు కన్నీళ్ళు తుడుస్తూ, గాజుల చెయ్యి ఆడించిన రత్తాలు "ఒరే రంగా! ఇవి ఆ మట్టి గాజుల్లా సప్పుడు సెయ్యట్లేదు ఈటి సిగతరా!" అనగానే ఇద్దరూ నవ్వుకున్నారు.

వాళ్ల నవ్వులకి లోపలికొచ్చిన రామయ్యని చూడగానే రత్తాలు "మామా! సూడు నీ కొడుకు నా పచ్చటి కలని నిజం సేసాడు! చేతికి ఉన్న బంగారు గాజులు చూపిస్తూ అంది రత్తాలు.

"మీ అయ్య సెయ్యలేని పని నువ్వు సేసావురా! నిన్ను సదివిత్తానని మీ అమ్మ పట్టు పట్టింది. లేకపోతే నాలాగే ఉండేటోడివి!" కొడుకుని గర్వంగా గుండెలకి హత్తుకుని నుదుటిపై ముద్దు పెట్టుకుంటూ అన్నాడు రామయ్య.

"అయ్యా! అలా అనకు! కులవృత్తి ఎప్పటికైనా మనని ఆదుకుంటుంది. చదువుకుని ఉద్యోగం దొరకక నిరాశపడి ఆత్మహత్యలు చేసుకుంటున్న యువకులు చాలామంది ఉన్నారు! అలాంటి వాళ్ళ కోసం నేను బ్యాంకులో లోన్ తీసుకుంటాను. నువ్వు వాళ్ళకి బుట్టలు అల్లడంలో శిక్షణ ఇవ్వు, మనం అల్లిన బుట్టలు దళారీలు లేకుండా అమ్ముకునే ఏర్పాటు చేద్దాం! దాని వల్ల నలుగురికి ఉపాధి దొరుకుతుంది!" అన్నాడు.

అన్నట్టుగానే రంగడు బ్యాంకులో లోన్ తీసుకుని ఒక చిన్న ట్రైనింగ్ సెంటర్ లాగ పెట్టాడు. రామయ్య నిరుద్యోగ యువకులకి బుట్టలు అల్లడం నేర్పిస్తే, వాళ్ళు అల్లిన బుట్టలు దళారీలు లేకుండా వాళ్లే అమ్ముకునే ఏర్పాట్లు చేశాడు రంగడు. ఉద్యోగం చేసుకుంటూనే తన కులవృత్తి ద్వారా కొంతమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించాడు, రంగడు.

"రామయ్య మాస్టారూ! అన్న పిలుపు వినగానే రత్తాలు "ఏందయ్యోయ్! బుట్టలు అల్లే రామయ్య కాత్త రామయ్య మాట్టారయ్యాడే!" బుగ్గలు నొక్కుకుంటూ అంటున్న రత్తితో, "నీ కొడుకు నేను సదవకుండానే నన్ను మాట్టారిని సేసాడే!" అనగానే ఇద్దరు పకపకా నవ్వుకున్నారు.

■


ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



కథాకళి | FEED ME A STORY

● మల్లాది వెంకట కృష్ణమూర్తి

# తలుపు



పగడాలు కుటుంబం తూర్పు గోదావరి జిల్లా నుంచి హైద్రాబాద్‌కి వలస వచ్చింది. వారిది కొంకుదురు అనే చిన్న పల్లెటూరు. పగడాలు, ఆమె భర్త వ్యవసాయ కూలీలుగా పనిచేసేవారు.

పగడాలు తమ్ముడు కొంకుదురు వచ్చినప్పుడల్లా 'హైద్రాబాద్‌కి వెళ్తే బాగుపడని వారు లేరు. ఇక్కడ ఉంటే ఇలాగే ఉంటాం' అని ఆమెతో పదేపదే చెప్పడంతో, పగడాలు ఓ రోజు తన భర్తతో చెప్పింది.

''వెళ్ళి చూద్దాం. నచ్చకపోతే మళ్ళీ కోతల సమయానికి వచ్చేద్దాం.''

''సరే, ఇక్కడ ఎటూ మనకి సంవత్సరం పొడుగూతా పని దొరకటం లేదు కదా.'' అతను ఒప్పుకున్నాడు.

అతని బావమరిది ఓ బిల్డర్ దగ్గర పని చేస్తున్నాడు. తన సూపర్‌వైజర్‌తో మాట్లాడి అక్కా బావలకి పని ఇప్పించాడు. ప్రతి శనివారం ఆ వారానికి చేసిన పనికి డబ్బు ముట్టడం ఆ దంపతులు ఇద్దరికీ నచ్చింది.

వాళ్ళు ఓ స్లమ్‌లోని చిన్న గుడిసె అద్దెకి తీసుకుని దిగారు. రెండు సంవత్సరాల తర్వాత ఆ దంపతులకి సొంత ఇల్లు నిర్మించుకోవాలనే ఆలోచన వచ్చింది. స్వంత స్థలం కొనేంత డబ్బు వారికి లేదు. మిగిలిన కూలీలు చేసే పనే వాళ్ళూ చేశారు. ఓ రౌడీకి నెల నెలా అద్దె చెల్లిస్తున్నంత కాలం ఓ పోరంబోకు స్థలంలో యాభై చదరపు గజాల మేర ఏదైనా కట్టుకోవచ్చు. రైలు పట్టాల పక్కనే కొత్తగా విస్తరించిన పట్టణంలో, అపార్ట్‌మెంట్స్ బాగా అభివృద్ధి చెందే చోటది. అది పనికి కూడా దగ్గర్లోనే ఉంటుంది.

పగడాలు, ఆమె భర్త కాగితాలు లేని, నోటి మాట మీద నడిచే ఓ యాభైమంది గల చిట్టీలో చేరి, అవసరమైన సొమ్ముని తీసుకున్నారు.

తనకున్న నైపుణ్యంతో పగడాలు భర్త, అతని బావమరిది ఆ ఇంటి నిర్మాణాన్ని చేపట్టారు. సిమెంట్ ఖర్చు కాబట్టి బంక మట్టిని ఉపయోగించి గోడలని లేపారు. పైన నల్లటి టార్పాలిన్‌ని కప్పుగా వేశారు. ఆ ఇంటికి ఇంకా ఎంతో చేయాల్సి ఉంది. తలుపుకి డబ్బు చాలక తెర కట్టారు. ఓ శుభముహూర్తంలో గృహప్రవేశం చేశారు.

స్వంత ఇల్లు అనేది వారికి ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. క్రమంగా వాళ్ళు ఆ ఇంటిని అభివృద్ధి చేసుకోసాగారు. ముందుగా పగడాలు భర్త లోపలి మట్టి నేల మీద గచ్చు చేశాడు. తర్వాత వర్షాకాలంలో గోడలని కాపాడటానికి బయటివైపు సిమెంట్ చేశాడు. ఆ తర్వాత పైన టార్పాలిన్ స్థానంలో సెకండ్ హేండ్ ఇనుప రేకులను కొని కప్పాడు. వాటికున్న చిల్లుల్లోంచి వర్షం కారకుండా వాటిని సీసంతో మూసేశాడు.

ఆ తర్వాత గోడల లోపలి వైపు సిమెంట్ చేశాడు. వారు కూలీకి వెళ్ళి చేసే ఈ పనులన్నీ తమ స్వంతానికి చేస్తూండటంతో ఆ పనులు మునుపు ఇవ్వని ఆనందాన్ని ఇవ్వసాగాయి.

పగడాలు ఆ ఇంట్లోకి ప్రవేశించినప్పటి నుంచి తన భర్తని ఇంటికి తలుపు పెట్టించమని అడుగుతూనే ఉంది. తెర తీసుకుని ఎవరైనా, ఎప్పుడైనా లోపలికి రావచ్చు. రాత్రి తాము నిద్రలో ఉండగా దొంగ చొరబడొచ్చు. కాని ప్రతిసారి తలుపు కన్నా చేయాల్సిన ఇతర పనులే ముఖ్యం అవడం వల్ల అది వాయిదా పడుతూ వచ్చింది.

'ఫన్‌డే'లో ప్రచురితమయ్యే
ఈ శీర్షికలో మల్లాది కథలు రాయడమే కాదు, మిమ్మల్ని కూడా భాగస్వాములను చేస్తున్నారు. మీరైతే ఈ కథకు ఏ పేరు పెడతారో ఈ కింది మెయిల్‌కు పంపండి.
kathakalisakshi@gmail.com

ఇంట్లోని మట్టి నేలలో జెర్రులు తిరుగుతూండటంతో ఆ నేలని గచ్చు చేయించాల్సి వచ్చింది. వర్షాకాలంలో ఇటుకల మధ్య ఉన్న మట్టి కారి గోడలు కూలకుండా సిమెంట్ చేయాల్సి వచ్చింది. అరబస్తా సిమెంట్ మిగలడంతో అది వృథా కాకుండా దాంతో ఇంట్లో వంటకి ఓ చిన్న గట్టుని కట్టాడు. వర్షానికి కప్పు మీంచి గోడల మీదకి కారే నీటిని ఆపటానికి పైకప్పు వేయించాల్సి వచ్చింది. ఇలా వాళ్ళా ఇంట్లోకి ప్రవేశించాక తలుపు కన్నా మిగిలినవే ముఖ్యమైనవి అయ్యాయి.

అవన్నీ పూర్తయ్యాక పగడాలు భర్త ముందు గోడకి గుమ్మం తెచ్చి పెట్టాడు. తర్వాతి సంవత్సరం తలుపుని అమర్చాడు.

''నాలుగేళ్లకి ఇది కుదిరింది. ఇంక దొంగలు ఎవరూ చొరబడరు. మన ఇల్లు ఇనప్పెట్టెలా భద్రం.'' పగడాలు ఆ రాత్రి తలుపు లోపల టవర్ బోల్ట్ పెట్టి సంతృప్తిగా చెప్పింది.

తలుపు అమర్చిన నెల రోజులకి పగడాలు భర్త పనిలో జరిగిన ప్రమాదంలో మరణించాడు. అతని మరణం అందరికీ షాక్.

● ● ●

ఆ రాత్రి స్పర్శకి పగడాలుకి మెలకువ వచ్చింది. కళ్ళు తెరచి చూస్తే ఓ మగాడు తనని తడుముతూ కనిపించాడు. ఆమె ఒక్క ఉదుటున బయటికి దూకి, తలుపు బయట గొళ్ళెం పెట్టి దొంగ అని అరవసాగింది. క్షణాల్లో ఆడ, మగ చాలామంది పక్క గుడిసెల్లోంచి లేచి వచ్చారు.

ఆ దొంగ ఆమె పక్కింటివాడు. ఆమె భర్త వయసున్న అతను చిత్తూరు జిల్లా నుంచి వలస వచ్చాడు. అంతా అతనికి దేహశుద్ధి చేసి, ఇల్లు ఖాళీ చేసి వెళ్ళాలని తీర్పు చెప్పారు.

మర్నాడు పగడాలు తన మరదలితో చెప్పింది.

''ఇంతకాలం నేను తలుపే రక్షణ ఇస్తుంది అనుకున్నాను. కాదు. తెర ఉండగా ఎన్నడూ వాడు రాలేదు. అప్పుడు నా భద్రతకి మా ఆయన అనే బలమైన తలుపు ఉందని నాకు తెలీలేదు. ఆడదానికి నిజమైన తలుపు మగాడే.'' ●

14 వ పేజీలో..
23-8-2026 సంచిక
'కథాకళి'కి పేరు సూచించిన
పాఠకుల పేర్లు



06/09/2026 | Funday | Page : 6
Source : https://epaper.sakshi.com/

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్స్అప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# పెద్దల మాట చద్ది మూట

పెద్దలను గౌరవించవలెను, పెద్దలను ఎదిరించరాదు, పెద్దల మాటలను ఆచరించవలెను...

ఈ విధంగా -

పెద్దల గురించి మన సనాతన ధర్మం ఎంతో గౌరవంగా పలికింది.

కాని ఆ మాటలకు ఇప్పుడు విలువే లేదు.

ఇప్పుడే కాదు... మహాభారత కాలం నాడు కూడా పెద్దల మాటలను ఎదిరించడం తెలిసిందే.

కురుగురు వృద్ధుల మాటలను, శ్రీకృష్ణుడి సందేశాన్ని అన్నిటినీ పెడ చెవిన పెట్టాడు దుర్యోధనుడు.

కురువృద్ధుడైన భీష్ముడిని అనేకమార్లు నిష్ఠూరంగా కూడా మాట్లాడాడు.

కురుపాండవుల మధ్య కురుక్షేత్ర యుద్ధం జరుగుతోంది. ఎనిమిది రోజులు గడిచిపోయినా పాండవులలో ఒక్క మహారథుడూ నేల కూలలేదు. దానితో దుర్యోధనుడికి కోపం వచ్చింది, 'తాతా! దేవదానవులు కూడా నిన్ను ఎదిరించలేరు కదా. ఎనిమిది రోజులు గడుస్తున్నా పాండవ పక్షంలో ఒక్క మహావీరుడిని కూడా చంపలేదు. నువ్వు తప్పుకో. కర్ణుడి సహాయంతో నేను యుద్ధం చేస్తాను' అని పలికాడు. అనుభవజ్ఞుడు, శాస్త్రాలలో ఆరితేరినవాడు అయిన భీష్ముని అహంకారంతో తూలనాడాడు దుర్యోధనుడు. అప్పుడు భీష్ముడు -

"తలకొని నీకుం ప్రాణంబులు దాపక
యోపినట్లు పోరగ నిమ్మై
బలుక దగునె యక్కట నా వలనం గల
భక్తి యెల్ల వమ్మున గలయన్"

(తిక్కన రచించిన మహాభారతం భీష్మ పర్వం, తృతీయాశ్వాసంలోని 175 వ పద్యం)



ఇన్ని రోజులుగా నా ప్రభు భక్తిని ప్రదర్శించి, నేను ప్రాణాలకు తెగించి పోరాడితే, నన్ను ఈ విధంగా తూలనాడతావా' అని పలికాడు భీష్ముడు.

అంతటితో ఆగకుండా అర్జునుడి పరాక్రమం గురించి -

'ఇంద్రుని అమర గణాలను తరిమి, ఖాండవ వనాన్ని దహనం చేశాడు. శివునితో యుద్ధం చేసి, ఆయనను మెప్పించి అనేక ఆయుధాలు సాధించాడు. కర్ణుడితో పాటు నీ సోదరులను గంధర్వుల చెర నుంచి విడిపించాడు. ఉత్తర గోగ్రహణం సమయంలో.. ద్రోణాచార్యుడు, ఆయన కుమారుడైన అశ్వత్థామ, కృపుడు, కర్ణుడు మొదలైన వీరులతో ఒంటరిగా పోరాడి విరాట రాజు గోవులను కాపాడాడు. అంతటి శక్తివంతుడైన అర్జునుడితో ఇన్ని రోజులు పోరి, నిలబడిన నేను నీతో ఇన్ని మాటలు అనిపించుకోవలసి వచ్చింది' అని పలికాడు భీష్ముడు.

కురుక్షేత్ర యుద్ధం ప్రారంభం కావడానికి ముందే విదురుడు, సంజయుడు, భీష్ముడు వంటి పెద్దలంతా 'పాండవులతో యుద్ధం తగదు. ధర్మం వారి పక్షాన ఉంది. యుద్ధం జరిగితే కౌరవులు అపజయం పాలవుతారు' అని పలికారు. వినాశ కాలే విపరీత బుద్ధి అన్న చందాన దుర్యోధనుడు వారి మాటలు వినలేదు. ఇక్కడ మనం అర్థం చేసుకోవలసింది ఒక్కటే - ఎంతో జీవితానుభవం కలిగిన భీష్మాచార్యుని వంటి వారు ఇంటింటా ఉంటారు. వారు పలికే మంచి మాటలను కొత్తతరం వారు వినడానికి సుముఖత చూపరు. ఫలితం అనుభవించిన తరువాత పశ్చాత్తాపం చెందుతారు.

పంచతంత్రం కథలో బోయవాడు పావురాలు కథ తెలిసిందే. ఒక అడవిలో ఒక బోయవాడు పావురాల కోసమని నేల మీద కొన్ని నూకలు చల్లి, ఆ నూకల మీద వల పన్ని ఉంచాడు. ఆకాశంలో ఎగురుతున్న పావురాలు ఆ నూకలు చూశాయి. అందులో చిన్న వయసు పావురాలు, 'ఇవిగో, ఇక్కడ చాలా నూకలు ఉన్నాయి. మనం ఈ రోజు ఈ నూకలు తిందాం' అంటూ ఉత్సాహంగా పలికాయి. పావురాల గుంపులో ఒక ముసలి పావురం కూడా ఉంది. ఆ ముసలి పావురానికి ఇటువంటి నూకలు చల్లిన ప్రదేశంలో బోయవాడు తప్పనిసరిగా వాటి మీద వల పన్ని ఉంటాడని తెలుసు. అందువల్ల అది చిన్న పావురాలతో, 'మీరు తొందరపడకండి. ఆ గింజల మీద వల ఉంటుంది. అందువల్ల మనం ఆ గింజలకు ఆశపడొద్దు. అనవసరంగా వలలో చిక్కుకుని, ఆ బోయవానికి ఆహారం అయిపోతాం' అని పలికింది. చిన్న పావురాలకు ఆ మాటలు నచ్చలేదు. 'నీకు అన్నీ అనుమానాలే. అక్కడ వల ఏమీ ఉండదు. హాయిగా కడుపు నిండుగా ఆహారం దొరికితే, తినొద్దు అంటావేంటి' అని ఎదురు ప్రశ్నించాయి. చేసేది లేక ఆ పావురాలతో వృద్ధ పావురం కూడా గింజల మీద వ్రాలింది. అంతే అన్నీ వలలో చిక్కుకున్నాయి. చిన్న పావురాలు ముఖం చిన్నబుచ్చుకున్నాయి. అప్పుడు... వృద్ధ పావురం తన అనుభవంతో ఇచ్చిన సలహాను పాటించిన పావురాలు, బోయవాని వల నుండి తప్పించుకున్నాయి.

అందుకే పెద్దల మాట చద్దిమూట అన్నారు.

- డా. పురాణపండ వైజయంతి

వెలుగు దినపత్రిక



# తెల్ల కాగితం

జి. వి. శ్రీనివాస్
77024 55559

తలుపు తోసుకొని గదిలోనికి వచ్చిన గౌతమ్ ను చూసి, ఆశ్చర్యపోయినా తేరుకొని 'రా.. కూర్చో' అంటూ నా టేబుల్ కి ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చోమన్నాను. గౌతమ్ నా అసిస్టెంట్ రాము కొడుకు. నాలుగో తరగతి చదువుతున్నాడు. ఉదయం ఆఫీస్ లో ముభావంగా ఉన్న రామునూ 'ఎందుకలా ఉన్నావ్' అని అడిగితే.. 'గౌతమ్ ఇంట్లో టి. వి. చూస్తూ, ఫోన్లో ఆడుకుంటూ ఉంటున్నాడని, నిన్న కూడా స్కూల్ నుంచి ''కడుపునొప్పి'' అని ఫోన్ చేయిస్తే, గాబరాపడి ఇంటికి తీసుకొని వెళ్తే మొబైల్లో గేమ్స్ ఆడుకుంటూ ఇంట్లో కూర్చున్నాడు' అని బాధపడుతూ చెప్పాడు.

ఈరోజు కూడా స్కూల్ నుంచి అదే ఫోన్ అన్నాడు. 'అందరి ఇళ్లలోనూ ఇదే స్థితి' అని నచ్చచెప్పి, ఇప్పుడు స్కూల్ నుంచి తీసుకొని వస్తే, గౌతమ్ ను నా దగ్గరకు పంపమని చెప్పాను. గౌతమ్ కి వాడు పుట్టినప్పటి నుంచి నాతో చనువు ఎక్కువ. అందుకే చొరవగా నా ఆఫీస్ గదిలోనికి వచ్చాడు.

'ఏంటీ! కడుపు నొప్పా?'

'అవును అంకుల్! చాలా నొప్పి, వామిటింగ్స్' మాటల్లో నొప్పి ముఖంలో లేకపోవడం చూసి, నవ్వుకున్నాను.

'అసలు కడుపునొప్పి, వాంతి ఎందుకు వస్తాయి గౌతమ్?' ఏమో అన్నట్లు పెదవి విరిచి, టేబుల్ మీద ఉన్న పేపర్ వెయిట్ ను గుండ్రంగా తిప్పసాగాడు.

'మీ ఇంట్లోనికి ఏదైనా కుక్కగాని, ఆవుగాని వచ్చేస్తే నువ్వేం చేస్తావు?'

'మరేమో.. కర్ర పట్టుకుని బయటకు వెళ్లగొడతా' నవ్వుతూ ముద్దుగా చెప్పాడు.

'ఏం.. ఇంట్లోనే ఉంచొచ్చు గా'

'ఛీ ! బాత్రూం ఎల్లేస్తాయి. ఇల్లంతా కంపు, అమ్మ తిడుతుంది కూడా'

'అవునా! అంటే అవి మన ఇంట్లోనికి రాకూడదు అన్నమాట. మరి అలాగే మన పొట్టలోనికి ఏదైనా చెడు పదార్థం వస్తే, శరీరం కూడా వాటిని బయటకు పంపే ప్రయత్నమే వాంతి. తెలుసా!?'

కళ్ళు పెద్దవి చేసి, అర్థమయినట్లు తలవూపుతూ 'నిన్న పానీపూరి తిన్నాను. అది నా బాడీకి ఇష్టం లేనట్లు ఉంది. అందుకే కడుపునొప్పి, వామిటింగ్స్. మరి తిననయితే'

'అవునా! ఆకాశం నీలంగా ఎందుకు ఉంటుందో నీకు తెలుసా?' అడిగాను. తల అడ్డంగా వూపాడు.

'మరి పిల్లి కళ్ళు చీకట్లో మెరుస్తాయి కదా, ఎందుకో తెలుసా? పాలు తెల్లగా ఎందుకుంటాయి?' టపటపా అడిగాను.

'నాకే కాదు, మా స్కూల్లో కూడా ఎవరికీ తెలియదు' చేతులు తిప్పుతూ చెప్పాడు.

'నాకూ చాలా కాలం తెలిసేవి కావు. నేను కూడా మొబైల్లో గేమ్స్ ఆడుతూ ఉండేవాడిని. నాకు ఇలాగే వేరేవారు అడిగితే ఆన్సర్ తెలియక సిగ్గుపడి, మొబైల్ గేమ్స్ పక్కన పెట్టి, పుస్తకాలు చదివితే ఇలాంటి బోలెడు సంగతులు తెలిసాయి. అంతే! నేను మా మీటింగ్స్ లో ఇలాంటి ప్రశ్నలు అడిగేవాడిని. ఎవ్వరూ జవాబు చెప్పలేకపోయేవారు. అప్పుడు నేనే చెప్పేవాడిని. అందరూ నన్ను గ్రేట్ గ్రేట్ అనేవారు తెలుసా!'

'అయితే నాకు ఆ ఆన్సర్స్ తెలిస్తే , మా స్కూల్లో కూడా నన్నూ గ్రేట్ అంటారు కదా' కళ్ళు పెద్దవి చేస్తూ అడిగాడు గౌతమ్.

'ఖచ్చితంగా. మీ టీచర్లు అందరూ 'గౌతమ్ ఇజ్ వెరీ ఇంటలిజెంట్. నైస్ బాయ్ అంటారు. నీ డైరీలో వెరీ గుడ్ అని కూడా రాస్తారు'

'అంకుల్ ! మా ఇంట్లో ఆ పుస్తకాలు లేవు. మా డాడీ కొంటే నేనూ చదువుతాను. అప్పుడు మీరు ఏ క్వచ్చిన్ అడిగినా చెప్తాను' అన్నాడు.

'వెరీ గుడ్! మొబైల్ పక్కన పెట్టి, ఈ పుస్తకాలు చదువు. నా దగ్గర ఉన్నచొప్పదంటూ ప్రశ్నలు, ఎన్ సైక్లోపిడియా ఇచ్చాను. పుస్తకాలు గుండెకు హత్తుకున్న గౌతమ్ ను చూస్తే, మొబైల్ స్థానాన్ని పుస్తకాలు ఆక్రమించుకున్నాయన్న నమ్మకం కలిగింది.

# చెరపకురా... చెడేవు!

డా. సారిపల్లి నాగరాజు
8008370326




ఉదయం పాఠశాల గంట మోగింది. పిల్లలంతా నవ్వుకుంటూ, మాట్లాడుకుంటూ తమ తమ తరగతి గదుల్లోకి వెళ్లిపోయారు. కొత్తగా సున్నం కొట్టిన గోడలు, రంగురంగుల బొమ్మలు, ప్రేరణాత్మక సూక్తులతో పాఠశాల చాలా ఆహ్లాదంగా కనిపిస్తోంది. ఐదో తరగతి చదువుతున్న రాహుల్ ఆ గోడలపై "నా పేరు రాస్తే ఏమవుతుంది?" అని నవ్వేస్తుండేవాడు. మరుసటి రోజు తరగతి గదికి కొత్తగా రంగులు వేశారు. పిల్లలంతా అందంగా ఉన్న గోడలను చూసి మురిసిపోయారు.

'మన స్కూలు ఎంత అందంగా ఉందో!' అని సంతోషపడ్డారు. కానీ మరుసటి రోజు ఉదయం అందరూ ఆశ్చర్యపోయారు. తెల్లగా మెరిసే గోడపై పెద్ద అక్షరాలతో...

'రాహుల్' అని రాసి ఉంది. తరగతి ఉపాధ్యాయురాలు సుజాత ఆ గోడను చూసి ఒక్క క్షణం మౌనంగా నిలిచారు.

'ఈ గోడను అందంగా చేయడానికి రంగుల వేసే వాళ్లు ఒక రోజు శ్రమించారు. చెడగొట్టడానికి మాత్రం ఒక్క నిమిషమే పట్టింది...' అని నెమ్మదిగా అన్నారు.

ఆ మాట విన్న పిల్లలందరూ గోడవైపు చూశారు. రాహుల్ మాత్రం తలదించుకున్నాడు. ఉపాధ్యాయురాలు బ్లాక్‌బోర్డుపై పెద్ద అక్షరాలతో ఒక సామెత రాశారు.

'చెరపకురా... చెడేవు.' అని. 'దీని అర్థం ఎవరు చెబుతారు?' అని అడిగారు. చిన్నారి మేఘనా లేచి, 'మనది కాని వస్తువులను పాడు చేయకూడదు. అందంగా ఉన్న వాటిని చెడగొట్టకూడదు' అంది.

'చాలా బాగా చెప్పావు,' అని ఉపాధ్యాయురాలు చిరునవ్వు నవ్వారు.

'ఈ పాఠశాల మన అందరిది. ఈ గోడలు, బెంచీలు, కుర్చీలు, చెట్లు, పుస్తకాలు... ఇవన్నీ మనకు ఉపయోగపడేవే. వాటిని కాపాడితే మన సంస్కారం తెలుస్తుంది. చెడగొడితే మన నిర్లక్ష్యం బయటపడుతుంది.' ఆ మాటలు రాహుల్ మనసుకి నేరుగా తగిలాయి. మధ్యాహ్నం అతను ప్రధానోపాధ్యాయుల గదికి వెళ్లాడు.

'సార్... గోడపై పేరు రాసింది నేనే. నన్ను క్షమించండి. ఇకపై ఎప్పుడూ అలా చేయను,' అని కళ్లలో నీళ్లతో అన్నాడు.

ప్రధానోపాధ్యాయులు అతని భుజంపై చేయి వేసి, 'తప్పు చేసినవాడికంటే, తప్పు ఒప్పుకుని మారినవాడే గొప్పవాడు,' అన్నారు. మరుసటి రోజు రాహుల్ స్వయంగా తడి గుడ్డ తీసుకుని గోడను శుభ్రం చేశాడు. పాఠశాల ఆవరణలో పడిన కాగితాలను కూడా ఏరి చెత్తబుట్టలో వేశాడు. మారిన రాహుల్ ని చూసి సుజాత టీచర్ అభినందించింది.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# బంగారు మొక్కలు

వీరయ్యకు తండ్రి నుంచి వారసత్వంగా రెండెకరాల నేల, ఉండడానికి ఒక పూరిల్లు వచ్చింది. ఆ రెండు ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ వీరయ్య జీవనం సాగించేవాడు. అతడికి మొక్కలంటే పిచ్చి. ఇంటిముందున్న ఖాళీస్థలంలో రకరకాల మొక్కలు పెంచుతూ ఆనందించేవాడు. ఒకసారి తన పొలంగట్ల మీద కొత్తరకం ఆకులు గల మొక్కలను కొన్నింటిని చూశాడు. ఆశ్చర్యం వేసింది. ఎక్కడినుంచో వచ్చిన పక్షులరెట్ట వల్ల ఆ విత్తనాలు పడి ఆ మొక్కలు మొలకెత్తి ఉండవచ్చనుకున్నాడు. వాటిని అక్కడ నుంచి తీసుకొచ్చి ఇంటిముందు ఖాళీస్థలంలో నాటాడు.

‘‘ఎందుకండి? పిచ్చిమొక్కలు ఎక్కడ కనపడ్డా తీసుకొచ్చి ఇంట్లో నాటుతారు?’’ అని విసుక్కుంది అతని భార్య. నవ్వి ఊరుకున్నాడు వీరయ్య. త్వరలోనే ఆ మొక్కలు పెద్దవయ్యాయి. వీరయ్యకు ఒక కుమార్తె, ఒక కుమారుడు. కుమార్తె పెళ్లీడుకు వచ్చింది. సంబంధం కుదిరింది. పది సవర్ల బంగారం అమ్మాయికి పెట్టమన్నారు పెళ్లికొడుకు తరపువారు. వీరయ్యకు ఏమి చేయాలో తోచలేదు. ఏ ఏడుకాఏడు వచ్చే వ్యవసాయ ఫలితం తిండికి, గుడ్డకి సరిపోతున్నది. దాచిపెట్టింది ఏదీలేదు. ఇది ఇలా ఉండగా ఒకరోజు కాశీకి వెళ్తున్న సాధువుల బృందం ఒకటి విశ్రాంతికని ఊరి బయట సత్రంలో దిగింది. సాధువులంటే వీరయ్యకు అమితభక్తి. సత్రానికి వెళ్లి వారిని సాదరంగా తీసుకొచ్చి అతిథి మర్యాదలు చేశాడు. భోజనాలు పెట్టాడు వారు తిరిగి వెళ్లే సమయంలో ఇంటిముందు వీరయ్య పెంచిన మొక్కలను గమనించి ఆశ్చర్యపోయారు. హిమాలయాల్లో మారుమూల అడవుల్లో కనిపించే ఈ మొక్కలు ఇక్కడకు ఎలా వచ్చాయో అర్థం కాలేదు. ఆశ్చర్యంలో మునిగి ఉన్నసాధువుల నుంచి వీరయ్య మొక్కల వివరాలు అడిగి తెలుసుకున్నాడు.

‘‘అవి బంగారుమొక్కలు. వాటి ఆకుల చివరలను



పిండి వచ్చే రసాన్ని ప్రత్యేక పద్ధతిలో కాస్తే అందులో నుంచి బంగారం వస్తుంది. భూమి నుంచి బంగారు ఖనిజ రేణువులను నీటితోపాటు గ్రహించి ఆ మొక్కల వేళ్లు కాండానికి అందిస్తాయి. ఆ నీరు ఆకుల చివరి భాగానికి చేరుతాయి. అందువల్ల ఆకుల చివర బంగారు రేణువులు ఉంటాయి. ఇదీ ఈ మొక్కల ప్రత్యేకత’’ అని వారు వీరయ్యతో చెప్పి ఆకుల నుంచి బంగారం తీసిచ్చి అతిథి మర్యాదలకు కృతజ్ఞతలు చెప్పి వెళ్లిపోయారు. వీరయ్య చింత తీరింది. అమ్మాయి పెళ్లి జరిగిపోయింది.

‘‘ఏమే వాటిల్ని పిచ్చిమొక్కలన్నావు గదా! చూశావా అందులో బంగారం ఉన్నది. ఏ మొక్కా పిచ్చి మొక్క కాదు. అన్ని మొక్కలూ ఉపయోగకరమైనవే. అదృష్టవశాత్తూ మనకు నేరుగా బంగారాన్నిచ్చాయి. కానీ మానవుడికి లభించే సంపదలో అధికభాగం మొక్కలనుంచి వచ్చేదే. ఇది ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన సత్యం’’ అన్నాడు వీరయ్య. ఆ తర్వాత ఇంకా ప్రత్యేక శ్రద్ధతో ఆ మొక్కలను వీరయ్య పెంచి వాటి ఆకుల రసం నుంచి బంగారాన్ని ప్రత్యేక పద్ధతిలో తయారుచేయసాగాడు. కాలక్రమేణా వీరయ్య ధనవంతుడయ్యాడు. ఈ విషయం ఆనోటా ఈనోటా రాజుగారికి చేరింది. వీరయ్యను రాజు పిలిపించి ‘‘ఇలాంటి విద్య అందరికీ ఉపయోగపడాలి. అందుకని నువ్వు రాజాస్థానంలో ఉండాలి. నిన్ను ఈ రాజ్యానికి వన సంరక్షణాధికారిగా నియమిస్తున్నాను. ఏ మొక్కా పిచ్చిమొక్కకాదు అని రుజువు చేశావు. నీ జీవితం అందరికీ ఆదర్శం. నీవల్ల లభించే బంగారాన్ని ఖజానాలో ఉంచి ప్రజల బాగుకొరకు వాడతాను’’ అన్నాడు. సంతోషంగా ఒప్పుకున్నాడు వీరయ్య.

- డా. గంగిశెట్టి శివకుమార్

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



# అల్లరి
ALLARI



## చెప్పుకోండి

- ఎర్రని రాజ్యం. నల్లని సింహాసనం. ఒక రాజు ఎక్కితే ఒకరాజు దిగుతాడు?
  - దోసెలు
- వందమంది అన్నదమ్ములు. కట్టి పడేస్తే.. కావలసినప్పుడు కదులుతారు. దుమ్ము, ధూళీ దులుపుతారు?
  - చీపురు కట్ట
- ఇల్లంతా వెలుగు.. బల్లకింద చీకటి?
  - దీపం


## పెద్దల మాట



అన్ని పాములూ విషాన్ని కలిగి ఉండవు. విషపూరితం కాకపోయినా.. పైకి అలా కనిపించే తీరాలి. లేకపోతే ఆ పాములు బతికి బట్టకట్టి.. కుబుసం విడవడం కష్టం.

- చాణక్యుడు

## రంగులేయండి



ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు చిత్రాల్లో 6 తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టండి.

# మార్పు తెచ్చిన కల

నరసింహపురంలో శరభయ్య అనే ఒక వ్యక్తి ఉండేవాడు. అతను ఒంటరి. ఎవరికీ సాయం చేసేవాడు కాదు. పైగా అందరితోనూ గొడవ పడేవాడు. ఒకసారి పొరుగూరిలో ఉన్న తన బంధువుల ఇంటికి వెళ్లాడు శరభయ్య. అక్కడ రాత్రి అతనికి నిద్రలో ఒక కల వచ్చింది. ఆ కలలో అతను ఆ గ్రామ పరిసరాలకు వెళ్లాడు. ఇంతలో వెనుకనుంచి అతణ్ని కాటేయడానికి ఒక పెద్దపాము వచ్చింది. శరభయ్య దాన్ని గమనించలేదు. వెంటనే అక్కడున్న తోటమాలి వచ్చి.. శరభయ్యను పక్కకునెట్టి, ఒక కర్రతో ఆ పామును దూరంగా విసిరేశాడు. శరభయ్యకు త్రుటిలో ప్రమాదం తప్పింది. ఇంతలో అతనికి మెలకువ వచ్చింది. 'ఓహో! ఇది కలనా!' అని అనుకున్నాడు. మరునాడు అతను ఆ గ్రామంలో తమ బంధువుల పొలం చూడటానికి ఒంటరిగా బయల్దేరాడు. అతని ముందు నడుస్తున్న ఒక ముసలి తాత జారి పడ్డాడు. ఆ తాత అచ్చం తనను కలలో కాపాడిన తోటమాలిలాగే కనిపించాడు. వెంటనే శరభయ్య వెళ్లి.. అతణ్ని పైకి లేపి, నెమ్మదిగా నడిపించుకుంటూ వైద్యుని వద్దకు తీసుకొని వెళ్లాడు. ఇంతలో ఆ విషయం తెలిసిన ఆ తాత కుటుంబ సభ్యులు అందరూ అక్కడికి వచ్చి, శరభయ్యకు ధన్యవాదాలు చెప్పి అతని సాయాన్ని కొనియాడారు. మరునాడు శరభయ్య స్నానానికని నదికి వెళ్లాడు. అక్కడ ఒక బాలుడు ఆ నీటిలో మునగసాగాడు. అతని తల్లిదండ్రులు చూసి ''కాపాడండి! కాపాడండి'' అని అరిచారు. వెంటనే శరభయ్య నీటిలోనికి దూకి.. ఆ బాలుణ్ని కాపాడి ఒడ్డుకు తీసుకొని వచ్చాడు. ఆ తల్లిదండ్రుల ఆనందానికి అంతులేదు. వారి కళ్లల్లోని ఆనందాశ్రువులు చూసిన శరభయ్యకు.. 'సాయంలో ఇంత ఆనందం ఉంటుందా!' అని అనిపించింది. నిద్రలో వచ్చిన ఆ కల తనను ఎంతో మార్చేసిందని ఆశ్చర్యపోయాడు. ఆ సంగతి విన్న గ్రామస్తులు వచ్చి.. శరభయ్యను అభినందించారు. ఈ విషయం విన్న నరసింహపురం గ్రామస్తుడు ఒకాయన.. పొరుగూరిలో శరభయ్య చేసిన సాయం గురించి అందరికీ చెప్పాడు. వారు శరభయ్య ప్రవర్తనలో మార్పు వచ్చినందుకు ఎంతో సంతోషించి, అతను తమ గ్రామానికి రాగానే అందరూ అభినందించారు.

... సంగనభట్ల చిన్న రామకిష్టయ్య



## కనుక్కోండి



_acon




_each_all

బొమ్మల ఆధారంగా ఖాళీలను పూరించండి.

## టంగ్ ట్విస్టర్స్

Are you copper-bottoming 'em my man? No, I'm aluminuming 'em ma'am.

## పూరించండి



పైబొమ్మ సరైన నీడ ఏదో కనుక్కోండి.

## పద్యం - భావం

**పట్టు పట్టరాదు పట్టి విడవరాదు**
**పట్టెనేని బిగియ బట్టవలయు**
**బట్టి విడుటకన్నఁబరగఁజచ్చుట మేలు**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**


**తాత్పర్యం:** ఏదైనా పని మొదలు పెట్టేముందు ఎలాంటి పట్టుదల చేయకూడదు. పట్టు పట్టిన తర్వాత.. ఆ పని పూర్తయ్యే వరకూ వదిలేయకూడదు. పట్టుదల పట్టి విడవడం కన్నా.. చనిపోవడం మంచిదని భావం.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



# గతం గతః!

• ముద్దు హేమలత




ఒక అడవికి రాజు సింహం. సింహం అంటేనే గజగజలాడే భయం. కానీ, ఇప్పుడు ఆ మృగరాజు ఒక చీకటి గుహలో దీనంగా పడి ఉంది. కొద్దిరోజుల కిందటే తన రాజ్యాన్ని కాపాడుకోవడానికి ఒక క్రూరమైన పులితో చేసిన పోరాటంలో సింహం తీవ్రంగా గాయపడింది. ఆ గాయాలు మానినా, ఆనాటి భయంకరమైన దృశ్యాలు సింహం మనసును వదలడం లేదు.

రాజవైద్యుడైన ఎలుగుబంటి ఎన్ని ఔషధాలు ఇచ్చినా ప్రయోజనం లేకపోయింది. సింహం నిరాశతో, 'నా పరాక్రమం ముగిసింది మిత్రమా! ఈ గాయాలే నా మరణానికి దారి తీస్తాయి. నేను మళ్ళీ గర్జించలేను.' అంటూ నిట్టూర్చింది.

అదే సమయంలో, పొరుగు అడవి నుంచి తన మిత్రుడైన ఏనుగును కలవడానికి ఒక కోతి వచ్చింది. ఏనుగు తన రాజు ఆరోగ్య పరిస్థితిని వివరించగా, అంతా విన్న కోతి గంభీరంగా ఇలా అంది: 'మిత్రమా! మృగరాజుకు ఇప్పుడు కావాల్సింది మూలికల వైద్యం కాదు, మానసిక వైద్యం!'

ఏనుగు ఆశ్చర్యపోయి, 'వైద్యం గురించి నీకు ఇవన్నీ ఎలా తెలుసు?' అని అడిగింది. అప్పుడు కోతి తన గతాన్ని వివరిస్తూ, 'నేను ఒకప్పుడు గొప్ప వైద్యురాలిని. కానీ, ఒక చిన్న పొరపాటు వల్ల ఒక జీవి ప్రాణం పోయింది. ఆ అపరాధ భావంతో అప్పటి నుండి వైద్యం చేయడమే మానేశాను. ఎవరికీ ఈ విషయం చెప్పలేదు.' అని కళ్ళల్లో నీళ్లు తిరుగుతుండగా చెప్పింది.

ఏనుగు వెంటనే కోతి భుజంపై తొండం వేసి, 'మిత్రమా! గతాన్ని తలచుకుంటూ కూర్చుంటే ప్రయోజనం లేదు. మన పొరపాట్ల నుంచే మనం పాఠాలు నేర్చుకోవాలి. ఇప్పుడు సింహాన్ని కాపాడటం నీ బాధ్యత. నీలో నిద్రాణమైన వైద్యుడిని నిద్రలేపు!' అని ప్రోత్సహించింది.

ఏనుగు మాటలతో కోతిలో ఆత్మవిశ్వాసం పెరిగింది. కోతి, ఏనుగు కలిసి సింహం గుహకు వెళ్లాయి. అవి రాజవైద్యుడు ఎలుగుబంటికి విషయం చెప్పాయి. ఎలుగుబంటి సంబరపడి, మృగరాజుకు వైద్యం చేయటానికి కోతిని అనుమతించింది. కోతి సింహాన్ని పూర్తిగా పరీక్షించి ఒక నిర్ణయానికి వచ్చింది. తనకు కావలసిన మూలికలు సేకరించడానికి గుహ బయటకు వెళ్ళింది.

ఆ సమయంలో ఏనుగు ఇలా అంది: 'మృగరాజా! గతం గతః. మీ పరాక్రమాన్ని మళ్ళీ చాటే సమయం వచ్చింది. ఈమె సామాన్యమైన కోతి కాదు, గొప్ప వైద్యురాలు.'

మూలికలు సేకరించి తిరిగి గుహలోకి వచ్చిన కోతి, సింహం కళ్ళలోకి సూటిగా చూస్తూ, 'రాజా! మీ వ్యాధి మీ దేహంలో లేదు, మీ ఆలోచనల్లో ఉంది. నాడు మీరు పులిని తరిమికొట్టినప్పుడు తగిలిన ఈ గాయాలు మీ వీరత్వానికి సజీవ సాక్ష్యాలు! అవి మిమ్మల్ని భయపెట్టకూడదు, మీ గుండెను మరింత బలంగా మార్చాలి.' అని నొక్కి చెప్పింది. అనంతరం మూలికలతో ఒక లేహ్యాం తయారుచేసి సింహానికి తాగించింది.

ఆశ్చర్యకరంగా, మరుసటి రోజు ఉదయానికే మృగరాజు తన నిస్సత్తువను వదిలి ఒక్కసారిగా లేచి నిలబడ్డాడు. అడవి మొత్తం దద్దరిల్లేలా గర్జించాడు! నిజానికి కోతి ఇచ్చిన ఆ 'మందు' కేవలం తీపి పండ్ల రసం మాత్రమే. సింహం రోగం నయం కావడానికి కారణం ఆ రసం కాదు; కోతి తన మనసులో నింపిన ధైర్యం, గతాన్ని మర్చిపోవాలనే సంకల్పం మాత్రమే!

సింహం తన తప్పు తెలుసుకుంది. ఆలోచన మారితే ఆరోగ్యం మారుతుందని గ్రహించింది. తనను మళ్ళీ కర్తవ్యోన్ముఖుడిని చేసిన కోతిని ఘనంగా సత్కరించి, తన ఆస్థాన వైద్యురాలిగా నియమించుకుంది. అలాగే కోతిలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన ఏనుగును తన రాజ సలహాదారునిగా నియమించుకుంది.

రాజవైద్యుడు ఎలుగుబంటి కూడా వారి సమయస్ఫూర్తిని చూసి మురిసిపోయాడు.



## హితవచనం

**అసంవిభాగీ దుష్టాత్మా కృతఘ్నో నిరపత్రపః**
**తాదృగ్నరాధిపో లోకే వర్జనీయో నరాధిప**

ఇవ్వవలసిన వాళ్లకు ఇవ్వనివాడు, దుష్టబుద్ధి, కృతజ్ఞత లేనివాడు, సిగ్గులేనివాడు అయిన రాజును పరిత్యజించాలి.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# బాలజ్యోతి

## గర్వభంగం


ఒక పెద్ద మర్రిచెట్టు ఉంది. దాని విస్తారమైన కొమ్మలు ఎంతోమంది బాటసారులకు, జంతువులకు నీడను, పక్షులకు ఆశ్రయాన్ని ఇచ్చేవి. అందరికీ అండగా... అడవికే పెద్దదిక్కుగా ఆ మర్రిచెట్టు ఉంది.

అయితే రానురాను దానికి అహంకారం పెరిగింది. తనంత బలమైనది, గొప్పది మరొకటి లేదని విర్రవీగుతూ, చుట్టుపక్కల ఉన్న చిన్న ప్రాణులను, మొక్కలను చులకనగా చూడటం మొదలుపెట్టింది.

ఆ మర్రిచెట్టు పక్కనే ఒక చిన్న తుంగమొక్క ఒద్దికగా, వినయంగా జీవించేది. మర్రిచెట్టు అహంకారాన్ని గమనించిన తుంగ ఒకరోజు "మిత్రమా! మనకు ఎంత శక్తి ఉన్నా అహంకారం మాత్రం ఉండకూడదు. ప్రకృతే అందరికన్నా గొప్పది, బలమైనది కూడా. ప్రకృతి శక్తి ముందు గర్వం నిలబడదు, వినయమే మనల్ని కాపాడుతుంది" అని హితవు పలికింది.

తుంగ మాటలకు మర్రిచెట్టు పకపకా నవ్వి "నా వేళ్లు ఎంత లోతుగా పాతుకుపోయాయో తెలుసా? నా కాండం ఎంత దృఢంగా ఉందో చూడు! ఎంతటి పెనుతుపానైనా నన్ను ఏమీ చేయలేదు. చిరుగాలికి కూడా వణికిపోయే గడ్డిమొక్కవు నాకే నీతులు చెప్తున్నావా?" అంటూ తుంగను తూలనాడింది. తుంగ బాధపడి నిశ్శబ్దంగా ఉండిపోయింది.

ఒకరోజు ఆ ప్రాంతంలో పెను తుపాను వచ్చింది. ఉరుములు, మెరుపులతో ఈదురుగాలులు విరుచుకుపడ్డాయి. పెద్ద



పెద్ద వృక్షాలు సైతం నేలకొరగడం మొదలైంది. మర్రిచెట్టు తన బలమంతా ఉపయోగించి గాలికి ఎదురుతిరిగి కొండలా నిలబడటానికి ప్రయత్నించింది. కానీ తుపాను ఉధృతికి దాని వేళ్లతో సహా కదిలిపోయింది. చివరకు మర్రిచెట్టు నేలమట్టమైంది.


అదే సమయంలో తుంగ గాలి వీచిన దిశగా వంగింది. వరదనీటి కింద నేలబారుగా పడుకుంది. తుపాను తగ్గాక మళ్లీ నిదానంగా పైకి లేచి నిటారుగా నిలబడింది. తనలోని నమ్రత, వంగే స్వభావమే ప్రాణాలను కాపాడాయని తుంగ గ్రహించింది. వేళ్లతో సహా కూలిపోయిన మర్రిచెట్టును చూసి జాలిపడింది.

"జీవితమే అన్నింటికన్నా ఎంతో విలువైనది. ఎదురులేని ప్రమాదం ముంచుకొచ్చినప్పుడు ప్రాణాలను కాపాడుకోవడానికి శరణాగతిని మించిన మార్గం లేదు. గర్వం ఎంతటి మహా వృక్షాన్నైనా పతనం చేస్తుంది" అని మర్రిచెట్టుకు హితవు చెప్పింది.

నేలకొరిగిన మర్రిచెట్టు తన తప్పు తెలుసుకుంది. తిరిగి చిగురించడానికి నెమ్మదిగా ప్రయత్నాలు మొదలు పెట్టింది.

**- డా. పోతగాని సత్యనారాయణ**

## ఇగ్లూకి దారి



## రంగులు వేయండి




## పదాల పజిల్

కూరగాయల పేర్లు పజిల్‌లో ఎక్కడున్నాయో వెతకండి.

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| X | K | H | P | O | T | A | T | O | E |
| P | O | X | T | P | C | M | L | J | G |
| U | N | P | O | E | A | U | N | T | G |
| M | I | J | M | P | R | S | F | G | P |
| P | O | E | A | P | R | H | F | A | L |
| K | N | G | T | E | O | R | N | R | A |
| I | X | L | O | R | T | O | V | L | N |
| N | S | B | E | Q | T | O | C | I | T |
| S | Q | M | S | Z | T | M | X | C | U |
| F | C | O | R | N | R | S | S | W | E |

MUSHROOMS
PUMPKIN
PEPPER
POTATO
GARLIC
ONION
CORN
CARROT
EGGPLANT
TOMATOES

## చుక్కలు కలపండి




ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# సహజ పానీయాలే ముద్దు

ఆదివారం వర్షా కాలం అయినప్పటికీ ఎండలు మండిపోతున్నాయి. మధ్యాహ్నం 2 గంటలు. స్కూల్ గ్రౌండ్ లో వాలీబాల్ ఆడి ఆడి రాముా, సురేష్ ఇద్దరూ చెమటలతో తడిసి ముద్దయ్యారు. 'రాముా! నోరంతా ఎండిపోతుంది రా. వెళ్లి ఆ కోక్, ఫాంటా ఏదైనా తాగుదామా? చల్లగా ఉంటాయి కదా' అంటూ సురేష్ దుకాణం వైపు పరుగెత్తబోయాడు. రాము వెంటనే సురేష్ చెయ్యి పట్టుకుని ఆపాడు.

'ఆగు సురేష్! ఆ కూల్ డ్రింక్స్ వద్దు రా!. అవి చల్లగా ఉంటాయి కానీ, మన ఒంట్లో వేడి పెంచుతాయి' అన్నాడు.




సురేష్ ముఖం చిన్నబోయింది. 'అదేంటి రా? అందరూ తాగుతున్నారు కదా. టీవీలో కూడా హీరోలు తాగుతున్నారు. బాగుంటాయిగా!' అన్నాడు. వెంటనే రాముా జేబులోంచి చిన్న నోట్ తీసి చూపించాడు. 'చూడు సురేష్. మన సైన్స్ మాస్టారు చెప్పారు. ఈ కూల్ డ్రింక్స్ లో 8 స్పూన్ల చక్కెర ఉంటుందట! ఎక్కువ తాగితే పళ్లు పుచ్చిపోతాయి, కడుపులో గ్యాస్ వస్తుంది. ఇంకా ఒబేసిటీ కూడా వస్తుందట' అన్నారు.

'అయ్యో! అంత ప్రమాదమా?' అన్నాడు సురేష్ భయంగా.

'అవునురా. మన శరీరానికి ఎండలో నిజంగా కావాల్సింది చల్లదనం + నీళ్లు + శక్తి. అవి కూల్ డ్రింక్స్ లో లేవు.' అన్నాడు రాము.

'మరి ఏం తాగుదాం?' అన్నాడు సురేష్. రాముా చుట్టూ చూసి వేలితో దగ్గర్లో ఉన్న బండి చూపించాడు. 'అదిగో అక్కడ చూడు. మావయ్య నిమ్మరసం బండి. పక్కనే మజ్జిగ, కొబ్బరి నీళ్లు, చెరుకు రసం కూడా ఉన్నాయి.' అన్నాడు. ఇద్దరూ ఆ బండి దగ్గరికి వెళ్లారు. మావయ్య చల్లని గ్లాసు నిమ్మరసం ఇచ్చి పైన కొద్దిగా జీలకర్ర, పుదీనా వేశాడు. ఒక గుక్క తాగగానే సురేష్ కళ్లు పెద్దవి చేశాడు.

'వావ్ రాముా! ఇది సూపర్ గా ఉంది. కడుపు చల్లబడిపోయింది. ఇంకా దాహం కూడా పోయింది.'

రాము నవ్వుతూ.. 'చూశావా? ఇదే మన దేశపు సహజ పానీయాల శక్తి. రసాయనాలు లేవు, నష్టం లేదు. పైగా మన రైతులకు కూడా ఉపయోగం.' అన్నాడు.

డబ్బులు తీసుకుంటూ... మావయ్య కూడా 'బాగా చెప్పావు బాబు. మా పిల్లలకు కూడా ఇవే ఇస్తా.' తర్వాత రాము, సురేష్ ఇంటికి బయలుదేరారు.'ఈరోజు నుండి నేను  కూల్ డ్రింక్స్ కి బై చెప్పేస్తున్నా. నిమ్మరసం, లస్సీ, మజ్జిగే నా ఫ్రెండ్స్!'

రాముా తలూపుతూ 'అంతే సురేష్. _ఆరోగ్యం కావాలంటే, సహజ పానీయాలే ముద్దు'

నీతి:చల్లదనం పేరుతో ఒంటికి హాని చేసే కూల్ డ్రింక్స్ కంటే, మన ఇంటి నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరి నీళ్లే మేలు.

**యం. హేమంత్**
**7వ తరగతి, తిరువూరు.**

# ఎందుకు చదువుకోవాలి?



ఒకరోజు సీత బడి నుంచి ఇంటికి వస్తూ తన స్నేహితురాలు రవళితో 'అసలు మనం రోజు బడికి ఎందుకు వెళ్లాలి? ఎందుకు చదువుకోవాలి?' అని అడిగింది. రవళికి ఆశ్చర్యం వేసింది. 'అదేమి ప్రశ్న సీతా? బడిలో చదువుతో పాటూ.. మనకు సంస్కారం నేర్పిస్తారు. ఇతరులతో కలిసి మెలిసి ఉండడం మరెన్నో విషయాలను బడి నేర్పిస్తుంది. మనము చదువుకోవడం వల్ల జ్ఞానం కలుగుతుంది. అలాగే చదువుకోవడం వల్ల మన చుట్టూ పరిస్థితులు, సమాజ మార్పులు అర్థం అవుతాయి. ఉద్యోగం వస్తుంది. మనకు గౌరవం వస్తుంది' అని రవళి అంది.

సీతా మళ్లీ సందేహంగా 'జ్ఞానం నుంచి చదువు పుట్టిందా? లేదా చదువు వల్ల జ్ఞానం కలుగుతుందా?' సందేహం వ్యక్తం చేసింది. దాంతో రవళి కొంత ఆలోచించింది. ' తెలియదు సీతా, కానీ మంచి ప్రశ్న వేశావు. రేపు మనం మన ఉపాధ్యాయురాలు అడిగి తెలుసుకుందాం.' అంది. మనసటి రోజు పిల్లలందరూ బడికి వచ్చారు. బడికి వెళ్ళగానే సీతా, రవళి టీచర్ దగ్గరకు వెళ్లి ఈ ప్రశ్నను అడిగారు.

దానికి టీచర్.. 'మంచి ప్రశ్న సీతా! చదువు వల్ల జ్ఞానం కలుగుతుందన్నమాట నిజం. చదువుకున్న వారికి ఏది మంచి, ఏది చెడు తెలుస్తాయి, సమాజం మనల్ని గౌరవిస్తుంది. మంచి స్థానంలో ఉంటాము. మంచి గుర్తింపు కలుగుతుంది'అంది. 'సరే టీచర్ ! నాకు ఇప్పుడు అర్థమైంది' అన్నారు సీత, రవళి. అప్పుడు సీత, రవళితో.. 'నేను ఎందుకు చదువుకోవాలో నాకు ఇప్పుడు బాగా తెలిసింది' అంది. అందుకే మనకు వచ్చిన సందేహాలను వెంటనే పెద్దలను అడిగి తెలుసుకోవాలి అనుకున్నారు.

చిరునవ్వులు

**సిహెచ్ రిషిత**
**9వ తరగతి,**
**అరవింద మోడల్ స్కూల్,**
**మంగళగిరి, గుంటూరు జిల్లా.**





# సమైక్యత



మనమంతా ఒక్కటే,
మనసులన్నీ ఒక్కటే!
అందరం కలిసి ఉంటే,
అందమైన ఆనందమే!
కులమతాలు మరిచిపోదాం,
కలిసి మెలిసి నడుద్దాం.
ఒకరికొకరం సాయం చేద్దాం,
ప్రేమను పంచి పెంచుదాం!
చేతిలో చేయి కలుపుదాం,
సమైక్యతతో ముందుకు సాగుదాం!

**మదిరి ప్రతిభ**
**2వ తరగతి,**
**ఎంపిపిఎస్ వానపాముల,**
**పెదపారుపూడి మండలం,**
**కృష్ణాజిల్లా.**

# నెమలీక

పి. శివ చరణ్య,
8వ తరగతి
ZPHS మేడిపల్లి,
సిద్దిపేట జిల్లా



## పాత సైకిల్



అనగనగా గంగాపురం అనే గ్రామంలో రాజు అనే పదేళ్ళ కుర్రాడు ఉండేవాడు. వాళ్ళ నాన్న ఆటో నడుపుతాడు. రాజుకి చిన్నప్పటి నుంచి ఒకటే కోరిక - స్కూల్‌కి సొంత సైకిల్ మీద వెళ్ళాలని. కాని ఇంట్లో పరిస్థితి బాగా లేదు.

ఒక రోజు స్కూల్ నుండి వస్తూ దారిలో ఒక పాత సైకిల్ షాప్ చూశాడు. లోపల తుప్పు పట్టి చైను తెగిపోయి, టైర్లు పగిలిపోయిన ఒక పాత సైకిల్ ఉంది. దానికి చిన్న బోర్డు తగిలించి వుంది. ఆ బోర్డు మీద 'అమ్మకానికి లేదు' అని రాసి ఉంది.

షాప్ తాతయ్య అడిగితే ''బాబూ ఇది నా కొడుకు సైకిల్, 20 ఏళ్ల క్రితం మా అబ్బాయి ప్రమాదంలో చనిపోయాడు. అతని జ్ఞాపకంగా దాచుకున్నాను'' అన్నాడు తాత కళ్ళలో నీళ్ళు తిరుగుతుండగా.

అప్పుడు రాజు ''తాతయ్యా.. నేను రోజూ వచ్చి ఈ సైకిల్ తుడిచిపెట్టనా? మీ కొడుకు బదులు నేను చూసుకుంటా'' అన్నాడు.

సరేనన్నాడు తాతయ్య.

అప్పటి నుంచి రోజూ స్కూల్ అయ్యాక గంట సేపు షాప్‌కి వెళ్ళి ఆ సైకిల్ ప్రేమగా తుడిచేవాడు రాజు. దానికి ఆయిల్ వేసేవాడు.

తాతకు రాజు తన కొడుకులా కనిపించసాగాడు.

6 నెలలు గడిచాయి. రాజు పుట్టిన రోజు వచ్చింది. ఆరోజు పొద్దున్నే తాత రాజు ఇంటికి వచ్చాడు. వెనకాల అదే సైకిల్ - కాని కొత్త పెయింట్, కొత్త టైర్లు, కొత్త చెయిన్‌తో సైకిల్ మెరిసిపోతుంది.

''ఇది ఇక నీదే బాబూ. నా కొడుకు ఎక్కడున్నా నిన్ను చూసి సంతోష పడతాడు. జ్ఞాపకాలు మనసులో దాచుకోవాలి, షెడ్డులో కాదు'' అని రాజు చేతికి ఇచ్చాడు తాత.


రాజు ఏడుస్తూ తాతను హత్తుకున్నాడు.

ఆ రోజు స్కూల్ మొత్తం ఆ సైకిల్ గురించే మాట్లాడుకున్నారు. కానీ రాజుకు తెలుసు - అది కేవలం సైకిల్ కాదు. ఒక తాత ప్రేమ అని అర్థం చేసుకున్నాడు.

ఇపుడు రాజ 10 వ తరగతి ఇంకా అదే సైకిల్ తొక్కుతున్నాడు. వారాంతంలో తాత షాప్‌కు వెళ్ళి కూర్చుంటాడు. ఇద్దరు కలిసి టీ తాగుతూ, సంతోషంగా కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు.


నీతి:- కొన్ని వస్తువులు విలువ డబ్బులతో కాలువలేం. ప్రేమ, జ్ఞాపకం, నమ్మకం కలిస్తే పాత ఇనుముకూడా బంగారంగా మెరుస్తుంది.

---




**విలువ ఎంత?**

ఇక్కడున్న మొదటి మూడు వరుసల్లోని ప్రాణులు, వాటి విలువను బట్టి చివరి వరుస విలువ చెప్పండి.



**ఎన్ని నీడలు?**

ఇక్కడున్న రకరకాల నీడల్లో ఆవు నీడలు ఎన్ని వున్నాయో కనిపెట్టి చెప్పండి.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



నిజమైన హోదా ఎప్పుడూ ఒక స్థానం వల్ల కాదు. అలాగే పదవులను తీసివేసినంత మాత్రాన అది ఎప్పుడూ పోదు.
☛ మాసింగర్






# కథ మార్పు



రాము పాఠశాలకు వెళ్లక అల్లరి చిల్లరిగా తిరిగేవాడు. ఎప్పుడూ గ్రౌండ్‌లో క్రికెట్ ఆడుతూ, సినిమాలు చూస్తూ, ఇంటిలో డబ్బు తస్కరిస్తూ రాత్రి ఎప్పుడో ఇల్లు చేరేవాడు. ఇది తల్లితండ్రులకు తెలిసింది. 'ఇప్పుడు వాడి మీద కోపపడితే మనకే నష్టం. నువ్వే ఏదయినా ఆలోచించు' అని తన భార్యతో చెప్పాడు వామనరావు.

తల్లి సుభద్ర ఆలోచనలో మునిగి ఉండగా 'అమ్మా' అనే కేక వినపడింది. రాహుల్ వచ్చాడు అనుకుని 'వస్తున్న నాన్న అంటూ ఆప్యాయంగా వెళ్ళింది... ఆకలివేస్తోంది అన్నంపెట్టమ్మ' అన్నాడు.

'సరే, కాళ్లు, చేతులు కడుక్కున్నవా' అంది సుభద్రమ్మ. 'ఓ' అన్నాడు.


అన్నం కలుపుకొచ్చి రాము నోటికి అందించింది. తను టీవీలో వచ్చే పాత క్రికెట్ మ్యాచ్ హైలెట్స్ చూస్తూ 'నేను తింటానులే' అన్నాడు. రాము అన్నం కలుపుకుని తింటుంటే కొడుకునే చూస్తూ ఉండిపోయింది. ఈ సంవత్సరం కూడ కప్పు మనదే' అన్నాడు తింటూ.

తల్లి వాడి తల నిమురుతూ 'ఇక కొద్ది రోజులలో కొత్త సంవత్సరం మొదలవుతుంది. ఏమైనా తప్పులు చేసివుంటే నిజాయితీగా ఒప్పుకుని కొత్త జీవితం మొదలెట్టాలి. నీకు క్రికెట్‌పై ఇష్టం ఉంటే అదే ఆడు. కాని చదువును నిర్లక్ష్యంచేయకు అంటే 'అమ్మ' అన్నాడు.

'నువ్వు క్రికెట్ ఆడుకో, పాఠశాలకే వెళ్లకు, నీ ఇష్టమైనది చేసుకో నాన్న' అంది ప్రేమగా. తల్లి చెబుతుంటే తను తల దించుకున్నాడు. 'నిన్ను ఎవరూ ఏమీ అనరు, నీకు ఏది ఇష్టమో అదే చేయి కాని చదువును ఎప్పటికి నిర్లక్ష్యం చేయకు' అంది తల్లి మెల్లగా.

ఆ మాటకు రాముకు తలదించుకుని తల్లి పదే పదే చదువు అంటుంటే నేను సక్రమంగా పాఠశాలకు వెళ్లకపోవడం తల్లి మాటల్లోని అంతర్యాన్ని గ్రహించాడు.


వెంటనే తల్లి పాదాలపై పడి 'అమ్మ నన్ను క్షమించు, నేను పాఠశాలకు మీరు అనుకున్నట్లు సరిగ్గ వెళ్లలేదు. ఇంట్లో డబ్బు కూడా తీసుకున్నా. అయినా మీరు నన్నేమి అనలేదు. ఇంకెప్పుడు ఇలాంటి పాడు పనులు చేయను. పాఠశాలకు క్రమంగా వెళతా, అవసరం అనుకున్నప్పుడే క్రికెట్ ఆడతాను. అవసరం అయితే డబ్బు అడిగి తీసుకుంటాను.



ఈ కొత్త సంవత్సరంలో నువ్వు, నాన్న కొత్త రామును చూస్తారుగా' అన్నాడు. కొడుకులో వచ్చిన మార్పునకు సంతోషించింది సుభద్రమ్మ. రాము క్రమంగా పాఠశాలకు వెళుతూ ఆ ఏడు మంచి మార్కులతో విజయం సాధించడంతో తల్లి, తండ్రి సంతోషించారు. 'కొత్త సంవత్సరం వాడిలో కొత్తమార్పు తీసుకువచ్చింది' అన్నాడు భార్యతో.


-కనుమ ఎల్లారెడ్డి

ఇక్కడున్న మూడు బాతు నీడల్లో అసలు బాతుకు సరిపోయే నీడేదో కనిపెట్టండి!






ఇక్కడున్న చిన్నారులు గజిబిజిగా కనిపిస్తున్న ఈ దారిగుండా దిగువనున్న పార్కుకు ఎలా చేరుకుంటారో ఆ దారి కనుక్కోండి!



దారి కనుక్కోండి!



తేడాలను గుర్తించండి!

ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు చిత్రాల్లో కొన్ని తేడాలున్నాయి. అవేమిటో గుర్తించండి!





ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



కథ

# అదృష్టం



ఒక ఊళ్ళో సుదర్శనం అనే పెద్దాయన ఉండేవాడు. ఆయుర్వేద వైద్యుడు. ఊరి అవతల ఉన్న అడవిలోకి వెళ్లి ఆకులు, వేర్లు, కాయలు తెచ్చి ఏవో పసర్లు చేసి ఊరివాళ్లకు వచ్చే చిన్నా, పెద్దా అనారోగ్యాలకు వైద్యం చేసేవాడు. ఆయనకు ఒక మనవడున్నాడు. వాడిపేరు కాళిదాసు. కొడుకు చిన్నవయస్సులోనే మరణించడంతో కోడలిది, మనవడి పోషణా భారం పెద్దాయన సుదర్శనం పైన పడింది.

కాళిదాసు చిన్నప్పటినుంచి అల్లరి చిల్లరగా ఉండేవాడు. చదువు అంటే ఏ మాత్రం శ్రద్ధ లేదు. 'నాది, పరాయి భేదం లేకుండా అందరికీ ఇన్నేళ్లు ఉచిత వైద్యం చేశాను. కానీ, వీడి ముఖం మీద సన్నని అదృష్ట రేఖ పెట్టలేదు దేవుడు అని ఆయన వాపోయేవాడు. కానీ కాళిదాసుకు అదృష్టం అంటే ఏమిటో తెలిసేదికాక కనపడ్డవారినల్లా అడిగేవాడు.



ఏళ్ళు గిర్రున తిరిగాయి. కాళిదాసుకు చిల్లి కానీ సంపాదన మార్గం తెలియలేదు. వాడికి జీవితం అంటే భయం పట్టుకుంది. తాత ఆరోగ్యం కూడా ఎప్పుడు, ఏ క్షణం, ఏమో అన్నట్టుంది.

ఒకరోజు కాళిదాసు చెట్టుకింద కూర్చుని భవిష్యత్తు గురించిన ఆలోచనలో దీర్ఘంగా మునిగిపోయాడు. అప్పుడో సాధువు అటువైపు నుంచి వెళుతూ కాళిదాసును పలకరించి, అతని బెంగకు కారణం అడిగాడు. కాళిదాసు మొత్తం గతమంతా పూస గుచ్చినట్టు చెప్పి- 'అదృష్టం' అంటే ఏమిటి?' అని అడిగాడు.

అది విని ఆ సాధువు "నేనొక పని చెబుతాను చేస్తావా?" నేను చెప్పినట్టు చేస్తే నీకు 'అదృష్టం' అంటే ఏమిటో తెలుస్తుంది" అని అన్నాడు. కాళిదాసు "ఓ..!" అన్నాడు.

"ఇటు నుంచి పడమరగా వెళ్తే వంగపురం రాజ్యం వస్తుంది. ఆ రాజుకు ఒకే ఒక ముద్దుల కూతురు ఉంది. ఇటీవల ఆమె ఓ అంతుచిక్కని అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమె వయస్సు పదహారేళ్లు ఉంటాయి. ఆమె ఆరోగ్యం బాగుచేసిన వారికి, ఆమెనిచ్చి పెళ్లి చేయటమే కాక, అర్ధరాజ్యం ఇస్తానని రాజు ప్రకటించాడు. నేను నీకొక మాత్ర ఇస్తాను. ఆ మాత్రను వేసి ఆమె వ్యాధి నయం చేస్తానని రాజుకు చెప్పు.

రాజుకు వేరే మార్గం లేదు. అలా రాకుమారినీ కాపాడు, రాజ్యం సాధించి హాయిగా గడుపు" అన్నాడు సాధువు.

సాధువు చెప్పింది చెప్పినట్టు చేసి, రాకుమారిని, రాజ్యాన్ని పొందాడు కాళిదాసు.

ఒకరోజు రాజైన కాళిదాసు రథం మీద వీధుల్లో తిరుగుతుండగా తనను ఇంతటి వాడిని చేసిన సాధువు కనిపించాడు.

వెంటనే రాజు రథం దిగి, సాధువు కాళ్లకు నమస్కరించి తనకింతటి అదృష్టాన్నిచ్చిన సాధువును తనతో రాజమందిరంలో ఉండమని కోరాడు.

అందుకు సాధువు "ఇందులో నా గొప్ప తనమేమీ లేదు. నేను నీకిచ్చిన మాత్ర మీ తాత ఒకప్పుడు నాకు అనారోగ్యం వస్తే ఇచ్చినదే. అందులో కొన్ని మాత్రలు నా దగ్గర ఉండిపోయాయి. నువ్వు అప్పుడు చాలా చిన్నవాడివి. మీ తాత నాకు చేసిన మేలుకు, నేను నీకు ప్రతి మేలు చేశాను. అలా తాతగారి పుణ్యం నీకు కష్టకాలంలో అదృష్టమైంది. 'అదృష్టం' అంటే ఇదే" అని చెప్పి వడివడిగా అడుగులు వేసుకొంటూ వెళ్ళిపోయాడు. "పుణ్యమే అదృష్టమై కలిసి వస్తుందంటే నేను అనునిత్యం నా ప్రజలను ధర్మంగా పాలించాలి" అని గ్రహించాడు కాళిదాసు.

– డా. కొప్పరపు నారాయణ మూర్తి





ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



సూర్య

# బుడత



## బాలల కథ

# ‘ స్నేహం తోడుంటే..

( పల్లా వెంకట రామారావు, 9949043019)



ఒక చిన్న అడవిలో ‘ బంటి’ అనే చిన్న కుందేలు పిల్లాడు ఉండేవాడు. బంట చాలా ఉత్సాహవంతుడు, కానీ ఒక్క విషయంలో భయపడేవాడు.

ప్రతి సాయంత్రం సూర్యుడు అస్తమించగానే బంటి తన గుహలోకి పరుగెత్తి, తలుపు మూసుకొని కూర్చునేవాడు. అతని స్నేహితులు నీలి అనే కోయిల, రాము అనే ఏనుగు పిల్ల, మరియు చిట్టి అనే చిన్న జింక అతన్ని ఆడుకోమని పిలిచినా, “చీకటి పడుతోంది” అని బంటి నిరాకరించేవాడు. ఎవరు ఎంత చెప్పినా వినేవాడు కాదు.

ఒకరోజు అడవిలో ఒక పెద్ద తుఫాను వచ్చింది. గాలి బలంగా వీచి, చెట్లు విరుచుకుపడిపోయాయి. బంటి గుహలో భయపడి కూర్చున్నాడు. అప్పుడు దూరం నుంచి నీలి కోయిల ఏడుపు వినిపించింది.

“బంటీ... బంటీ... నా గూడు పడిపోయింది! నేను చీకటిలో ఒంటరిగా ఉన్నాను!”

బంటి గుండెలు గుబుక్కున కొట్టుకున్నాయి. కానీ స్నేహితురాలి ఏడుపు విని అతనికి ధైర్యం వచ్చింది. అతను చిన్న దీపం (చెట్టు కాండం మీద మెరిసే చిన్న కీటకాల దీపం) తీసుకొని బయటకు వచ్చాడు.

చీకటి అంతా కమ్ముకుంది. కానీ బంటి తన దీపం పట్టుకొని ముందుకు నడిచాడు. దారిలో అతనికి రాము ఏనుగు కనిపించాడు. “రామూ, నీలి గూడు పడిపోయింది. సహాయం చేద్దాం!” అన్నాడు బంటి. రాము తన బలమైన తొండంతో చెట్ల కొమ్మలు తీసుకొచ్చాడు. చిట్టి జింక తన వేగంతో మృదువైన ఆకులు, పూలు సేకరించింది. నీలి కోయిల సంతోషంతో పాట పాడింది.

అందరూ కలిసి కొత్త గూడు కట్టారు. చీకటి ఇంకా ఉంది, కానీ వారి స్నేహం వెలుగుతో ఆ చీకటి కూడా అందంగా అనిపించింది బంటికి.

ఆ రాత్రి బంటి తన గుహలోకి తిరిగి వచ్చి ఆనందంగా నిద్రపోయాడు. మరుసటి రోజు నుంచి అతను చీకటికి భయపడటం మానేశాడు. ఎందుకంటే తనకి ఇప్పుడు తెలిసిపోయింది ‘స్నేహం ఉన్నచోట చీకటి కూడా వెలుగులీనుతుంది’ అని.

### తెలుగు వేమన పద్యాలు

ఎలుకతోలుఁదెచ్చి యేడాది యుతికిన
నలుపు నలుపేగాని తెలుపురాదు
కొయ్యబొమ్మను దెచ్చి కొట్టినఁ బలుకునా
విశ్వదాభిరామ! వినుర వేమ!

ఎలుక తోలు ఎంతసేపు ఉతికినప్పటికీ అది తెలుపుగా మారదు. కర్రతో చేసిన బొమ్మ ఎంత కొట్టినప్పటికీ మాట్లడదు.



